ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రి



ANDHRA PATRIKA

4 అణాలు


చూడండి!
సన్‌లైట్
సగంబిళ్ల మాత్రమే
ఈ బట్టలన్నిటిని ఉతికింది!
అట్లు చేసినట్టిది దాని అధికమైన నురగ!
SUNLIGHT SOAP
సన్‌లైట్
సబ్బు
బట్టలను తెల్లగాను, కాంతివంతముగాను ఉతుకును
S. 242-X52 TL
భారతదేశంలో
తయారుచేయబడినది



నృత్యకేళి

ఫొటో: క్రముద్దీన్ ఖాన్.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 11
14-11-56

దుర్ముఖ కార్తీక శుద్ధ ఏకాదశి బుధవారం

ముఖచిత్రం: సావిత్రి.

విషయానుక్రమణిక

గమనిక.

★

ఈ సంచికలో 30-వ పేజీలోని "ఇస్రేల్ రాజ్యస్థాపన చరిత్ర" వ్యాసం తరువాయి 54-వ పేజీలో చూచుకో వలెనని పాఠకులకు మనవి.

ఆంధ్రప్రదేశ్ మంత్రుల శాఖలు

"కొన్ని శతాబ్దులుగా హైదరాబాదు ఒక పెద్ద సంస్థానంగా ఉంటూ వచ్చింది. ఆ కాలంలో ఇక్కడ కొన్ని సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఒక రకమైన సంస్కృతి ఏర్పడ్డాయి. ఈ సంస్కృతిలో బూజుపట్టి ఈ కాలానికి పనికిరాని అంశాలు కూడా కొన్ని ఉన్నాయి. వీటికి అలవాలమైన వ్యవస్థలన్నీ మనం రూపుమాపుతున్న మాట నిజమే." "తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలు కలిసిపోయాయి. ఇది ఒకరకమైన వివాహం వంటిది. వివాహం ఎంత సంతోష ప్రదమైనదో, అంత ప్రమాదకరమైనదికూడా," అని ఆంధ్ర ప్రదేశావతరణలో రాష్ట్ర శాసన సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ శ్రీ నెహ్రూ అన్నారు.

ఇంక, హైదరాబాదులో జమీందారీ, జాగిర్దారీ వ్యవస్థలకు సంబంధించిన కొన్ని అంశాలున్నాయనీ. అవి తొలగించక తప్పదనీ ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రం కాసుకోబోతున్నదనీ, కొత్త మంత్రులకు, శాసనసభ్యులకు ఇకముందునించీ కఠినపరీక్షా సమయమనీ వారందరు ఐకమత్యంతో వ్యవహరించాలనీ కూడా శ్రీ నెహ్రూ ఉద్బోధించారు.


ప్రధానమంత్రికి స్వాగతం చెబుతూ డాక్టరు బూర్గుల రామకృష్ణరావు "దేశం అంతటా నేడు కొత్తరాష్ట్రాలు ఏర్పడాయి. కొన్ని కొన్ని రాష్ట్రాలు కొత్త భూభాగాలు కలవడంవల్ల నూతన స్వరూపాలు ధరించాయి. అయితే, ఈ సందర్భంలో హైదరాబాదు రాష్ట్రం తన అస్తిత్వమే కోల్పోయింది. ఇది హైదరాబాదు ప్రత్యేకత. అయితే విశాలమైన ఆంధ్రప్రదేశం అవతరిస్తున్న ఇలాంటి శుభతరుణంలో ప్రధానమంత్రి ఇక్కడికి విచ్చేసి మన అందరికీ తమ సందేశం వినే అవకాశం కలిగించినందుకు వారికి మన కృతజ్ఞత," అన్నారు.

ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఇచ్చిన సలహాప్రకారం నడుచుకోగలమనీ, అలాగ వారి ఆశయాల్లో నడుచుకోలేనిపక్షంలో, తమ రాజీనామాలు సమర్పింపగలమనీ అన్నారు.

రాష్ట్రపతి డాక్టరు రాజేంద్రప్రసాద్ నూతనరాష్ట్రాల అవతరణ సందర్భంలో సందేశం పంపిస్తూ, భారత దేశ సౌధంలో రాష్ట్రాలన్నీ గదులవంటివనీ ఈ రాష్ట్రాల ఎల్లలు కొంచెం అటుఇటు మారినంత మాత్రాన వచ్చే ప్రమాదమేమీ లేదనీ, రాష్ట్రాలన్నీ సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామనీ అన్నారు.

ఆంధ్రప్రదేశానికి శ్రీ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా 12 గురు మంత్రులు. వీరు వివిధ శాఖలను ఇలా కేటాయించుకున్నారు.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి పరిపాలన వ్యవహారాలు, అంతరంగికశాఖ, ప్రణాళికలశాఖ నిర్వహిస్తారు. శ్రీ రంగారెడ్డి భూమ్యాదాయ శాఖ; శ్రీ కళా వెంకటరావు ఆర్థిక శాఖ, వాణిజ్యపు పన్నులూ; శ్రీ బి. వి. రాజా పరిశ్రమలు, కార్మిక శాఖ; శ్రీ జె. వి. నరంసింగరావు, నీటి పారుదల, రహదారులు. శ్రీ మెహిదీ నవాజ్ జంగ్ ఆరోగ్యం; శ్రీ గంధి వెంకటరెడ్డి నాయుడు, న్యాయశాఖ, జైళ్ళు, న్యాయస్థానాలు; శ్రీ దామోదరం సంజీవయ్య సహకారం; శ్రీ పట్టాభి రామారావు, విద్య; శ్రీ తిమ్మారెడ్డి వ్యవసాయం; శ్రీ బ్రహ్మానందరెడ్డి స్థానికసంస్థలు; శ్రీ మందుముల నరసింగరావు సాంఘిక సంక్షేమం. ★



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రమాణస్వీకరణ.

★ నవ భారత స్వరూపం ★

రాష్ట్రం పేరు	వైశాల్యం చ. మైళ్లు	జనాభా (లక్షలు)	రాజధాని	రాజధాని జనాభా (లక్షలు)	గవర్నరు	ముఖ్యమంత్రి	శాసనసభ స్థానాలు	లోక్‌సభలో స్థానాలు
ఆంధ్రప్రదేశ్	1,10,250	322	హైదరాబాద్	10.86	సి. ఎం. త్రివేది	నీలం సంజీవరెడ్డి	301	43
అస్సాం	84,924	90	షిలాంగ్	0.54	ఫజులాలీ	బిష్ణురాం మేధి	108	12
బీహార్	67,830	389	పాట్నా	2.83	ఆర్. ఆర్. దివాకర్	ఎస్. కె. సిన్హా	330	55
బొంబాయి	1,88 240	478	బొంబాయి	28.40	శ్రీప్రకాశ	వై. బి. చావన్	396	66
కేరళ	14,980	136	తిరువేంద్రం	1.87	బూర్గుల రామకృష్ణరావు		126	18
మధ్యప్రదేశ్	1,71,200	261	భోపాల్	1.02	పట్టాభి సీతారామయ్య	రవిశంకర్ శుక్లా	288	36
మద్రాసు	50,170	300	మద్రాసు	14.20	——	కె. కామరాజ్	205	41
మైసూరు	72,730	190	బెంగుళూరు	7.80	మైసూరు మహారాజా	నిజలింగప్ప	208	26
ఒరిస్సా	60,140	146	భువనేశ్వర్	——	భీంసేన్ సచార్	హెచ్. కె. మెహతాబ్	140	20
పంజాబ్	46,616	160	చండీఘర్	——	సి. పి. ఎన్. సింగ్	పి. ఎస్. కైరాన్	154	22
రాజస్థాన్	1,32,300	160	జైపూర్	2.91	జి. ఎస్. సింగ్	ఎం. ఎల్. సుఖాడియా	176	22
ఉత్తర్‌ప్రదేశ్	1,13 410	632	లక్నో	5	కె. ఎం. మున్షీ	సంపూర్ణానంద్	430	86
పశ్చిమబెంగాల్	33,279	262	కలకత్తా	45.8	పద్మజానాయుడు	బి. సి. రాయ్	238	34
జమ్మూ, కాశ్మీర్	92,780	44	శ్రీనగర్	1.1	కరన్‌సింగ్	బక్షీ గులాం మహమద్	——	6

కేంద్ర పాలిత ప్రాంతాలు

రాష్ట్రం పేరు	వైశాల్యం చ. మైళ్లు	జనాభా (లక్షలు)	రాజధాని	రాజధాని జనాభా (లక్షలు)	గవర్నరు	ముఖ్యమంత్రి	శాసనసభ స్థానాలు	లోక్‌సభలో స్థానాలు
ఢిల్లీ	578	17 4	ఢిల్లీ	13. 8	——	——	——	5
హిమాచలప్రదేశ్	10,451	9.8	సిమ్లా	0.46	——	——	——	4
మణిపూర్	8,658	5.8	ఇంఫాల్	1. 8	——	——	——	2
త్రిపుర	4,032	6.4	అగర్తాలా	0.42	——	——	——	2
లక్షదీవులు, అమీందీవి	1,900 (సుమారు)	0 2	——	——	——	——	——	——
అండమాన్, నికోబార్ దీవులు	3,215	0.3	పోర్ట్ బ్లెయిర్		——	——	——	——

ఈజిప్ట్‌పై యుద్ధం

ప్రపంచం మరో మహా సంగ్రామ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. బ్రిటిష్, ఫ్రెంచి, ఇస్రేలీ సేనలు ఈజిప్టుపై సాగిస్తున్న అప్రకటితయుద్ధం ఫలితంగా పశ్చిమాసియా పరిస్థితులు అతి ప్రమాదభరితంగా పరిణమించినవి; తూర్పు యూరప్‌లోని ఉపగ్రహ రాజ్యమైన హంగరీలో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్య విప్లవాన్ని సోవియెట్ రష్యా తన విమాన సైనికబలాలను ప్రయోగించి అణచివేస్తున్నది. గత వారం పదిరోజులలో జరిగిన ఈ రెండు సంఘటనలు శాంతిప్రియులైన ప్రజలందరి మనస్సులనూ కలచివేస్తున్నవి.

ఏ సూయజ్ ప్రాంతమునుంచైతే, రెండున్నర సంవత్సరాల క్రితం చేసుకున్న ఒప్పందం ద్వారా నిష్క్రమించిందో, ఆ సూయజ్ ప్రాంతాన్నే ప్రత్యక్ష యుద్ధం ద్వారా తిరిగి ఆక్రమించడానికి పెద్దపెట్టున బ్రిటన్ ప్రయత్నిస్తున్నది. సూయజ్ సమస్య గత జులై మాసాంతాన ఉత్పన్నమైనప్పటినుంచి బ్రిటన్ ఫ్రాన్సులు ప్రబల యుద్ధ సన్నాహాలు చేస్తూనే వచ్చినవి. రాజకీయంగా ఏ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యంగా పరిణమించిందో ఆ లక్ష్యాన్ని సైనిక బల ప్రయోగం ద్వారా సాధించడానికి బ్రిటన్ ఫ్రాన్సులు తలపెట్టినవి. సూయజ్‌పై తిరిగి తమ పతాకాన్ని ఎగురవేయడమే ఈలక్ష్యం. ఇందుకు ఇస్రేలీ, ఈజిప్టు పరిహద్దుల రక్షణ అన్నది ఒక పెద్ద సాకుగా బ్రిటన్ ఫ్రాన్సులకు ఉపయోగపడుతున్నది. 1948 మే నెలలో ఇస్రేల్ ఒక ప్రత్యేక యూదు రాజ్యంగా ఏర్పడినప్పటినుంచి ఇస్రేల్—అరబ్ రాజ్యాల పరిహద్దులలో తరుచూ అనేక సంఘర్షణలు జరగడం, ఎప్పటికప్పుడు అవి సర్దుబాటు కావడం పరిపాటిగా వస్తున్నది 1950 లో ఇస్రేలీ, ఈజిప్టు పరిహద్దు రక్షణకు బ్రిటన్, ఫ్రాన్సు అమెరికాలు హామీ ఇస్తూ ఒక ఒప్పందాన్ని చేసుకున్నవి. అయితే ఇప్పుడు. అమెరికాతో సంప్రతించకుండానే, బ్రిటన్, ఫ్రాన్సులు ఈజిప్టుపై ఈ కిరాతకానికి ఒడిగట్టడం జరిగింది.

అక్టోబరు 22న జోర్డాన్‌కు పార్లమెంటు జరిగిన ఎన్నికలలో అరబ్ రాజ్యాల సమైక్యతను బలపరిచే అభ్యర్థులే గెలవడం సంభవించింది. బ్రిటన్‌తో తరతరాలుగా వస్తున్న స్నేహ సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని వీరి వాదన. జోర్డాన్‌రాజు హుస్సేన్ ఎన్నికల ఫలితాలు తెలిసిన మూడోరోజునే పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ బ్రిటన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని సవరణ చేసుకోవలసి వస్తుందని ప్రకటించారు (ఆరునెలల క్రితం బ్రిటిషు సేనాని గ్లబ్ పాషాను బర్తరఫు చేసింది జోర్డాన్‌రాజే) జోర్డాన్ ఎన్నికలు పూర్తి అయిన మరుసటిరోజునే ఈజిప్టు యుద్ధమంత్రి మేజర్ జనరల్ అబ్దుల్ హాకెం అమీర్ నాయకత్వాన ఒక సైనిక ప్రతినిధి వర్గం రాజధాని అమ్మాన్‌కు వెళ్ళి, జోర్డాన్‌కు భారీ ఆయుధాలు, జెట్ విమానాలు సప్లయి చేసే విషయమై చర్చించింది ఈ చర్చలోనే ఈజిప్టు, జోర్డాన్, సిరియాల మూడురాజ్యాలకూ ఏకసైనిక వ్యవస్థను, సంయుక్త సైనిక ఆధిపత్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు జోర్డాన్ సేనాని మేజర్ జనరల్ అలీ నువార్ ప్రకటించాడు.

ఇది ఇస్రేల్‌కు ఆగ్రహ కారణమైంది. పశ్చిమరాజ్యాల ద్వారా స్వీకరించిన ఆయుధసంపదతో ఈజిప్టుపై పెదపెట్టున అక్టోబరు 30న ఇస్రేల్ దండయాత్రకు ఉపక్రమించింది; ఈజిప్టు భూభాగమైన (సూయజ్ కాలువ పశ్చిమ ప్రాంతం) సినాయ్ ద్వీపకల్పంలోకి శరవేగంతో ఈ ఇస్రేలీసైన్యం దూసుకుపోవడం ప్రారంభించింది. ఇస్రేలీ ఈజిప్టుల పరిహద్దులను రక్షించాలనే మిషంతో సర్వసంసిద్ధంగా వున్న బ్రిటిష్ ఫ్రెంచి సేనలు కూడా 12 గంటల అంత్య సందేశాన్ని ఒకదాన్ని ఈజిప్టు ఇస్రేల్‌కు అందజేసి రంగంలోకి ప్రవేశించాయి బ్రిటిష్ ఫ్రెంచి ఇస్రేలీ విమానాలు తమ సర్వశక్తి సామర్థ్యాలనూ ప్రయోగించి ఈజిప్టు నగరాలపైనా, సైనిక లక్ష్యాలపైనా భయంకరమైన దాడులు సాగించినవి. రాజధాని కైరోమీద కూడా అగ్నివర్షం కురిపించినవి. ఈజిప్టు సైనిక సామర్థ్యం విచ్ఛిన్నమైనప్పటికీ, ఈజిప్షన్ ప్రజల మనోనిబ్బరం మాత్రం చెక్కు చెదరలేదు; సాహసోపేతంగా బ్రిటిష్, ఫ్రెంచి, ఇస్రేలీ, సేవలను ప్రతిఘటిస్తూ వచ్చారు. తమపై జరుగుతున్న దురాక్రమణను చర్చించవలసిందని భద్రతా మండలికి విజ్ఞప్తి చేశారు. మండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానంపై బ్రిటన్ ఫ్రాన్సులు వీటో ప్రయోగించినవి అంతట సమితి సర్వసభ్య అత్యవసరసమావేశం ఈజిప్టులో తక్షణమే యుద్ధవిరమణ జరగాలని ఉభయపక్షాలకూ అత్యధిక సంఖ్యాబలంతో ఆదేశించింది; ఆదేశాన్ని ఈజిప్టు ఆమోదిస్తే, బ్రిటన్ ఫ్రాన్సులు తిరస్కరించినవి. తిరస్కరించడమే గాక, ఈజిప్టు రేవు పట్టణమైన పోర్ట్ సయ్యద్ పై ప్రబహ్మాండంగా పారాషూట్ దళాలతో ముట్టడించినవి ఇదే సమయంలో సమితి సర్వసభ్య సమావేశం, ఈజిప్టులో యుద్ధసంక్షోభాన్ని అరికటి శాంతి స్థాపించడానికి అంతర్జాతీయ సైనికబలం నిర్మించాలని నిర్ణయించింది. కెనడా సేనాని మేజర్ జనరల్ ఇ. ఎల్ ఎం. బరన్స్ ఈ దళానికి ఆధిపత్యం వహిస్తాడు. ఇది కెనడా, నార్వే, కొలంబియా దేశాలు ప్రతిపాదించిన తీర్మానం. బలపరిచిన 57 దేశాలలో భారతదేశంఒకటి. భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వంగల రష్యా, బ్రిటను, ఫ్రాన్సు, అమెరికా, చైనాల సేవలకు ఈ అంతర్జాతీయ సైనికబలంలో స్థానం ఉండదని ప్రధానకార్యదర్శి హామర్ షెల్డు స్పష్టపరిచారు. పరస్పర విరుద్ధమైన ఈ దృక్పథాల మధ్య సమితి ఈజిప్టులో సాగించే శాంతిస్థాపనకృషి ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి

★

రష్యా హెచ్చరిక


“ఐక్యరాజ్య సమితిలోని ఇతరదేశాలతో కలిసి దురాక్రమణను నిర్మూలించడానికి, మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపించడానికి రష్యా సర్వసంసిద్ధంగా ఉన్న”దని సోవియెట్ ప్రధాని మార్షల్ బుల్గానిన్ బ్రిటిష్ ఫ్రెంచి ప్రధానులకు మొన్న 5వ తేదీన తీవ్రమైన హెచ్చరిక చేశారు.

అతిశక్తివంతమైన విధ్వంసకాయుధాలు కలిగి మీ కంటే ఎక్కువబలీయమైన దేశం మీ రెండుదేశాలమీద దాడి చేస్తే మీ పని ఏమవుతుంది?” అని బుల్గానిన్ ప్రశ్నించారు.

‘విధ్వంసకాయుధాలను నౌకా, విమానదళాల ద్వారానే పంపించనక్కరలేదు. రాకెట్లద్వారా కూడా ప్రయోగించవచ్చును నిస్సహాయంగా ఉన్న ఈజిప్టును బ్రిటన్, ఫ్రాన్సులు ముట్టడించడం ఎలాంటిదో, బ్రిటన్, ఫ్రాన్సులను రాకెట్లద్వారా ముట్టడించడం కూడా అలాంటిదే. దీన్ని అనాగరిక చర్య అని మీరు నిరభ్యంతరంగా అనుకోవచ్చును,” అని బుల్గానిన్ బ్రిటిష్, ఫ్రెంచి ప్రధానులకు తెలిపారు.

★

అమెరికాలో నవంబరు పండుగ



ఐసెన్ హోవర్

ఈ నవంబరు ఆరవ తేదీ ఆరుకోట్ల అమెరికనులకు పండుగ. ఇద్దరికి పెద్దపరీక్ష.

ప్రపంచంలో ఏ దేశాధిపతికీ లేనంతటి ఉన్నతాధికారాలుగల అధ్యక్షుని ఆ రోజున అక్కడ ఆరుకోట్ల వోటర్లూ స్వయంగా ఎన్నిక చేస్తారు.

ఈ నవంబరు పండుగ నాలుగేళ్ళకొకసారి (ప్రతి లీపుసంవత్సరమూ) వస్తుంది. ఆ నవంబరులో మొట్టమొదటి మంగళవారం అసలు పండుగ అన్నమాట. దేశాధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని, ప్రజాప్రతినిధులసభకు సభ్యులను అమెరికన్ కాంగ్రెసు (పార్లమెంటు) ఎగువసభ అయిన సెనేట్‌కు మూడోవంతు సభ్యులను ఆ రోజునే ఎన్నుకొంటారు. వీరినే కాక, వివిధ రాష్ట్రాలకు గవర్నర్ల దగ్గరనుండి వేలాది కరిపాలనాధికారులను కూడా ఎన్నుకొంటారు.

ఇప్పుడు ప్రధానమైన అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకై దేశంలోని రెండు ప్రధాన పక్షాలూ చెరి ఇద్దరు అభ్యర్థులనూ నిలబెట్టాయి.

రిపబ్లికన్‌పార్టీ పేరిట అధ్యక్ష స్థానానికి డ్వైట్ డి. ఐసెన్‌హోవర్, డెమొక్రాట్ల తరఫున అడ్లాయ్ స్టీవెన్సన్ పోటీ చేస్తున్నారు. అలాగే ఉపాధ్యక్ష స్థానానికి రిపబ్లికన్ అభ్యర్థి రిచర్డ్ నిక్సన్, డెమొక్రాట్ ప్రతినిధి సెనేటర్ ఎస్టెస్ కెఫావర్.

ఈసారి విశేషం

ఈ రకం ఎన్నికలు అమెరికాలో 167 సంవత్సరాల నుండి సాగుతున్నా, ఈసారి విశేషం ఒకటి ఉంది. విదేశాంగ నీతిలో ఇద్దరికిద్దరూ ఘనులనిపించుకున్నవారే. అలాగే ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థులిద్దరూ కూడా సమాన ప్రతిభావంతులు. పేరు ప్రఖ్యాతులలో కూడా ఒకరికొకరు తీసిపోరు. అందువల్ల ఎవరు నెగ్గుతారన్న అంశం అమెరికన్లకే కాక విదేశీయులకు కూడా ఉత్కంఠ కలిగిస్తుంది.

అయితే ఆడ... కాకపోతే మొగ...

ఉత్కంఠ కలిగిసుందే తప్ప, ఫలితం ఎలా ఉన్నా సంక్షోభంవంటిదేమీ వచ్చిపడదు. ఎందుకంటే, ఉన్న రెండు రాజకీయపక్షాలూ నేనంటే నేనని ఎంతప్రచారం చేసినా, దేశాన్ని ఉద్ధరించడానికి తమ తమ పద్ధతులను ఎంతగా ఎలుగెత్తి ఘోషించినా, ప్రధానంగా అవి ఉత్తర దక్షిణ ధ్రువాలవంటివి ఏమాత్రం కావు. సామాజిక వ్యవస్థ నిర్మాణంలో, ఉన్న పద్ధతులను తిరగేస్తామని ఎవరూ అనటం లేదు... నిజానికి గత ఎనభై తొంభై ఏళ్ళుగా ఒకసారి వీరి హయాం అయితే రెండోసారి వారిది అవుతూ వచ్చింది. ఉన్నంతలో రిపబ్లికన్సే ఎక్కువసార్లు నెగ్గారు

అందువల్ల ఈ రెండు పక్షాల పేర్లనూ పర్యాయ పదాలన్నా ఫరవాలేదు పుట్టుపూర్వాలు తిరగేసి, ఎవరెవరో, ఎవరేం చేస్తానన్నారో పరిశీలిస్తే ఈ మాట ఋజువు అవుతుంది.

అచ్చ తెలుగులో చెప్పుకోవాలంటే, డెమొక్రాటిక్ పార్టీని పద్మనాభరావు అనవచ్చు. నేటి రిపబ్లికన్ పార్టీ అందులోంచే ఆవిర్భవించింది అసలు డెమొక్రాటిక్ పార్టీ అనేది 1787 ప్రాంతాలలో అవతరించింది. అంతక్రితం, ఈ పార్టీలో వారున్న పార్టీ పేరు రిపబ్లికన్‌ట. సరే ఈ డెమొక్రాట్‌లు అప్పట్లో దేశపాలనాధికారాలన్నీ కేంద్రీకృతం కావడానికి వీల్లేదన్నారు. 40 ఏళ్ళు తిరిగే సరికి వర్తక వాణిజ్యాల విషయంలో అనుసరించవలసిన విధానాలపై అభిప్రాయభేదాలు రావడంతో చీలికలు ఏర్పడ్డాయి.

స్వేచ్ఛా వాణిజ్యం కావాలన్న వారు డెమొక్రాటిక్ రిపబ్లికన్స్ అయ్యారు. మిగతావారు నేషనల్ రిపబ్లికన్స్ అయ్యారు. క్రమేణా వీరు విశేషపదాలను వదులుకున్నారు. ఈనాటి రిపబ్లికన్‌పార్టీ 102 ఏళ్ళ క్రితం అవతరించిందనవచ్చు.

ఎన్నికలలో ఒకరు నీగ్రో బానిసత్వం



స్టీవెన్సన్

ఉండాలంటే మరొకరు వద్దనడం, ఒకరు పరిశ్రమలు వృద్ధి కావాలంటే, రెండోవారు వ్యవసాయం అనడం ఒకదఫా వీరు చెప్పిన పద్ధతినే మరోసారి ప్రతిపక్షులే అనుసరిస్తామనడం ఈవిధంగా కాళ్లాగజ్జె కంకాళమ్మ బాపతుగా సాగింది ఈ పార్టీలకథ.

ఇక ప్రచారం అనేది భారీఎత్తున పట్టపగ్గాలు లేకుండ సాగుతుంది. దేశం అట్టుడికినట్టుడికి పోతుంది. రెండు మూడు నెలల పాటు.

కొందరు ఈ పేరుచెప్పి బాగా డబ్బు చేసుకుంటారు: గత ఎన్నికలలో ఒక రిపబ్లికన్ భక్తుడు ఐసెన్‌హోవర్‌కు ప్రచారం చేయబోయి, ఐ-లైక్-ఐక్ (ఐక్ అంటే నాకిష్టం) అని అచ్చువేసినయూజేసి చొక్కాబొత్తాములు బజార్లో పెట్టాడు. అవి లక్షలకొద్దీ అమ్ముడుపోయాయి.

సరే ఐక్ గెలిచాడు. అలాటప్పుడు, ఐక్ పక్షీయులంతా "నే చెప్పలేదూ!" అనడం సహజం కదా.

బొత్తాముల వ్యాపారికూడా అదే చేశాడు. "ఐ టోల్ యు సో" అని అచ్చువేసిన బొత్తాములు మళ్ళీ బజార్లో పెటాడు. అవీ లక్షల కొద్దీ అమ్ముడుపోయాయి.

ఈ సారి

చిన్న తేడాలూ తమాషాలూ ఎలా ఉన్నా ఈసారి ఒకవిశేషం ఉంది. తను ఎన్నికైతే, అణ్వస్త్రపరీక్షలు ఆపు చేయించడం ఖరారని డెమొక్రాట్ అభ్యర్థి, స్టీవెన్సన్ వాగ్దానం చేశాడు.

అమెరికా ఎవరిని ఎన్నుకున్నదీ, ఈ పాటికి మీకు తెలిసేఉంటుంది. ★

"నువ్వు ఎర్రగులాబీకన్నా అందంగా ఉన్నా"వని అన్నపూర్ణకి ఎవడో ఉత్తరం రాశాడు. కోపంతో ఆమె ముఖం గులాబిపువ్వులా ఎర్రబడింది. అంతా విని భర్త గోపాలం "అట్లాగా, వాడిసంగతి కనుక్కోవాలిసిందే' అని ఊరుకున్నాడు.

పాలపొంగు

'గోపాళం!'

'............'

'ఓరిగోపాళమూ!'

'అబ్బ, ఏవిటి?'

......వీధి అరుగు మీద పీఠం వేసుకూర్చున్న గోపాలం చిరాగ్గా పలికాడు.

"ఓరి, ఇక్కడ వుండేనట్రా పలకవు?'...వీధి వాకిట్లోకి వచ్చి చూసి అన్నది తల్లి.

నిజానికి తల్లి పిలుపు గోపాలానికి వినిపించకపోలేదు. అతగాడికి ఎందుకో పలకాలనిపించలేదు. ఆ క్షణంలో తల్లేకాదు బ్రహ్మ దిగి వచ్చి పిలిచినా పలికేవాడు కాదు.

'ఏవిటేవిట్రా, అన్నానికిలే, మిల్లుకు పోను వేళయితేనూ।" అన్నది గోపాలం తల్లి రావమ్మ.

'నాకు అన్నమూ వద్దు ఏమీవద్దు' ముక్తసరిగా అన్నాడు గోపాలం.

'మిల్లుకు పోవ్రటా? అన్నం యెందుకు తినవూ?' సాగదీసి అడిగింది రావమ్మ.

'మిల్లుకు వేళయినప్పుడు వెళతాను. ఇక అన్నమా యీపూట తినను గాక తినను'... గోపాలం మరింత బిగదీపుగా అన్నాడు.

రావమ్మ గొణుక్కుంటూ లోపల గడపలో చతికిలబడింది. కోడలు కాపురానికి వచ్చి ఏడాదయింది ఇప్పటిదాకా యింట్లో ఏ కీచులాటా లేదు. ఇటు గోపాలానికి చెరుకు మిల్లులో పనీ, అటు కోడలుకు అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలో పనీ. రెక్కలుగల పడుచువాళ్లు, వాళ్ళిద్దరూ ఇంత తెస్తుంటే, తను ఇంతవంట చేసి ఇద్దరికీ పనివేళకు పెట్టి సంసారం గడుపుకొస్తోంది.

కోడలు తనకు ఆసెపిల్ల ముచ్చటతీర్చింది ఇంతవరకు తమ ఇద్దరకు యే పొరపూలేదు. అటు వాళ్ళిద్దరూ ఒకరంటే ఒకరు ప్రాణాలు విడుస్తారు. వాళ్ళ సఖ్యత చూచి తనలో తనే మురిసిపోతుండేది కాదూ తనూ?

ఇవ్వాళ యేమిటో తెల్లవారి లేచింసగ్గర నుంచీ చిటచిటలాడుతూనే వున్నాయి యిద్దరి ముఖాలూనూ. అన్నపూర్ణ రోజూ ప్రొద్దున్నే స్నానంచేసి ఉతికిన చీరకట్టుకుని తలదువ్వుకుని బొట్టూకాటుకా పెట్టుకుని తిండితిని పనిలోకి వెళ్ళేది. ఇవాళ అసేవిటో రోజూటి ముస్తాబూలేదు. స్నానమన్నా చేయలేదు అఖరుకు భోజనమన్నా చేయలేదు. 'నాకాకలి లేదత్తా' అని చెప్పి పనిలోకి చక్కా వెళ్ళింది.

ఇటు వీడూ ప్రొద్దుటి నుంచీ మూతి ముడుచుకుని కూర్చున్నాడు. ఏవిటి చెప్మా వీళ్ళ కీచులాట? తను అడగటమెట్లాగూ? అడగక పోవటమెట్లాగూ? అయినా చిన్నవాళ్ల కీచులాటల్లో తను కలిగించుకోకూడదు. ఇప్పుడు పోట్లాడుకుంటారు, మరి కాస్సేపటికి వాళ్లే పకపకలాడుతారు.

మిల్లు మొదటికూత కూసింది గోపాలం చివాలున లేచి పైగుడ్డ సవరించుకుని మిల్లుకేసి బయలుదేరాడు.

రావమ్మ మనస్సు చివుక్కుమంది. కన్నకొడుకూ, అటు పరాయిపిల్లా. చిన్నదీ-పస్తువుండి పనిలోకి వెళితే తనకు మాత్రం తిండి యేమి సయిస్తుందీ? ఉసూరుమంటూ రావమ్మ ఆపూట తాను అభోజనం వుండి మంచం పెట్టుకుని పడుకుంది.

సాయంత్రం వాడిన మొహంతో అన్నపూర్ణ యింటికి వచ్చింది. అత్తకు మామూలుగా వంటపనిలో సాయంచేసింది. పగలంతా ఫ్యాక్టరీలో జరిగిన వింతలూ విశేషాలూ రోజూ పకపకలాడుతూ చెప్పేది. ఇవాళ ఆవిడ నోరెవిప్పలేదు

గోపాలం అయిదింటికోసరికి రోజూ ఇంటిముంగు వాలేవాడు ఇవాళ ఏడు కావొస్తున్నా యింకా రాలేదు

రావమ్మకు కొడుకు వైఖరీ కోడలి వైఖరీ బొత్తిగా నచ్చలేదు. చిన్న చిన్న పేచీలు వస్తేమాత్రం యింత ఎడమొహమూ పెడమొహమూనా?

'ఏవిటే అబ్బాయి ఇంకారాలేదు?' అని అడిగింది ఉండబట్టలేక.

'ఏమో నత్తా' అన్నది అన్నపూర్ణ ముభావంగా.

'ప్రొద్దునకూడా అన్నం తినకుండా వెళ్ళాడు. పరగడుపున పొద్దుగూకులూ పని యెట్లా చేశాడో యేమో, యింతవరకు యింటికే రాకపోయె!'...అన్నది రావమ్మ.

అన్నపూర్ణ ఉలిక్కిపడింది. 'ప్రొద్దున భోజనం చేయకుండా వెళ్ళాడా! తనమీద కోపంవస్తేమటుకు అంత పంతమూ! ఆ మిల్లులో పని అసలే బండపని. పస్తువుండి యెట్లా చేశాడో!'...అన్నపూర్ణ కళ్ళల్లో ముత్యాలంత నీటిబొట్లు నిలిచాయి

అన్నపూర్ణవి పెద్దపెద్ద కళ్లు. ఆమె చామనచాయరంగులో, శరీరపు వొంపులో, వయసులోని మిసమిసలు మెలపులు తిరిగి పోయినాయి గచ్చకాయలాడుకునే దినాల్లో నాలుగోతరగతి వరకూ చదువుకుంది. సన్నజాజికి పరిమళంవలె ఆసంస్కారలేశం ఆమెను పొదువుకున్నది.

రోజూ రాత్రిళ్ళు గుడ్డిదీపం ముందు పెట్టుకుని వారినడిగీ వీరినడిగీ తెచ్చుకున్న పత్రికలూ, చిన్న చిన్న పుస్తకాలూ గుణించుకుని చదువుకుంటూ తన నాలుగోతరగతి అక్షరజ్ఞానం మరచిపోకుండా పోషించుకుంటుండేది

ఇటీవల ఆ వ్యాసంగం మరికాస యెక్కువయింది. చేతికి వచ్చేవన్నీ మంచికథల పుస్తకాలే.

గోపాలానికి ఆ చదువు కూడా రాదు. అతనికి భార్య దీపంముందు పుస్తకం పట్టుకుని కూర్చుంటే సాక్షాత్తూ సరస్వతి తన యింటికి వచ్చినట్లుండేది అతడు బీడీ కాలుస్తూ ఆవిడ విద్యావ్యాసంగం పూర్తి కావటానికి నిరీక్షిస్తుండేవాడు.

ఈ మధ్యను వారం రోజుల్నించీ అన్నపూర్ణ కథల పిచ్చిలోపడి పది గంటలదాకా పుస్తకం వదలటం లేదు.

పగలంతా శరీర కష్టంచేసి వచ్చిన గోపా

వేదవతి

★ పాలపొంగు ★

నికి భార్యతో ఆ కబురూ యీ కబురూ చెప్పుకోవా లనుంటుంది. వారం రోజుల్నుంచీ చూస్తున్నాడు, చూచి చూచి విసిగి తాను నిద్రపోతున్నాడు. ఆవిడ ఆ పుస్తకం వదిలిపెట్టి ఎప్పుడు పడుకుంటున్నదో అతనికి తెలియదు.

ఆ క్రితం రాత్రి ముచ్చట. మామూలు ప్రకారం ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు. అన్నపూర్ణ చిటికెలో తిని కంచం కడిగి గదిలోకి వెళ్లింది. తాపీగా భోజనం ముగించి బీడీ వెలిగించుకుంటూ గోపాలం లోపలికి వెళ్లాడు.

దీపం ముందు పుస్తకం మీదకు వంగి అన్నపూర్ణ చదువుకుంటున్నది. అతగాడికి చిరాకు వేసింది.

"ఆ దీపం యివాళ్టికి తగ్గించి వేద్దూ, ఒకటే దోమలు పీకుతున్నాయి" అన్నాడు భార్య నుద్దేశించి.

ఆవిడ పలకలేదు. అసలతని మాటలు ఆమెకు వినిపించనే లేదు.

అతడికి కోపం వచ్చింది. దుడుకు రక్తం కూడా నేమో, చివాలున లేచి ఆవిడ ముందున్న పుస్తకం తీసి ఒక మూలకు గిరవాటు పెట్టాడు.

అన్నపూర్ణ గభాలున లేచి "ఎందుకూ ఆ పుస్తకం తీసివేసింది?" అని కోపంగా అడిగింది.

"నా మాటలు కూడా వినపడకుండా చేస్తున్న పుస్తకాల్ని మూలకే తోస్తాను, తుంగలోకి తొక్కుతాను...మాటల్ని కఠినంగా నొక్కుతూ అన్నాడతను.

అతని మాటలు ఆవిడకు కోపం తెప్పించాయి. ముందూ వెనుకా ఆలోచించకుండా,

"అవును మరి, పుస్తకాల విలువయేమిటో తెలిస్తేగా!" అన్నది...

అతని ముఖం ఎఱ్ఱబడింది. అన్నపూర్ణ అనాలోచితంగా అన్న ఆమాట అతడి ఆత్మాభిమానం మీద పెద్ద దెబ్బ తీసింది.

గోపాలం యింకేమీ అనలేదు. దెబ్బ తిన్న పాములా కుంగిపోయి పక్కపైన ముసుగు తన్ని పడుకున్నాడు.

అన్నపూర్ణ దీపం ఆర్పేసి చాప పరుచుకుని యిటు తిరిగి పడుకున్నది. ఆ రాత్రి ఆ గదిలో అమావాస్య నాటి మేఘాలు ఆవరించాయి.

* * *

అన్నపూర్ణకు క్రితం రాత్రి జరిగిన సంగతి మెరుపులా కళ్లముందు మెరిసింది. ఇదివరకు చిన్న చిన్న పేచీలు వచ్చినా మరొక గంటలో ఎవరో ఒకరు పలకరించనిది ఉండగలిగేవారు కాదు. ఇవాళ అతడు యింత వరకు యింటికి రాలేదు. తెల్లవారి భోజనం చేయలేదు.

తను అనాలని ఆ మాట అనలేదు. చదువుతున్న పుస్తకం మొరటుగా లాగివేశాసరికి కోపంలో నోరుజారి అనేసింది. తన ఆమాట అతని అభిమానాన్ని ఎంత అవమానపరిచిందో అప్పుడు తెలియకపోయినా, యిప్పుడు బాగా గ్రహించింది. అందుకు పశ్చాత్తాపమూ పడింది.

ఎనిమిది దాటాక గోపాలం యింటికి వచ్చాడు. తల్లిని అన్నం పెట్టమన్నాడు.

నాలుగు మెతుకులు తిని గదిలోకి వెళ్లి యించుమించు వెంటనే నిద్రకు పడ్డాడు.

అన్నపూర్ణ నివ్వెరపోయింది. అతడు అంతా మర్చిపోయి పలకరిస్తాడనీ, అలా జరక్కపోయినా తానైనా మాటాడుదామనీ అనుకున్నది. అతని యీ వైఖరికి ఆమె చిన్నబోయి ఆ రోజూ అలాగే చాప పరుచుకుని పడుకున్నది.

* * *

దినాలు గడుస్తున్నాయి. రావుమ్మకు వీళ్ల తగాయిదా అంతు పట్టలేదు. అదీ చెప్పదూ, ఇటు వీడూ చెప్పడూ! అయినా యేమి పంతాలమ్మా యివి!

కోడలు గోపాలాన్ని చాలాసార్లు పలకరించబోవటమూ, వాడు వినిపించుకోనట్లు దూసుకుని పోవటమూ రావుమ్మ చాలాసారు చూచింది. కనక యిందులో కోడలి తప్పేమీ లేదని, గోపాలానికైనా అంత పంతం కూడదనీ అనుకున్నదావిడ.

ఇటు అన్నపూర్ణ చిక్కిపోతున్నది. అది నవ్వితే యిల్లంతా యేవిటో కలకలలాడినట్లుండేది. 'అత్తా, అత్తా' అంటూ పసిపిల్లలా చుట్టుకు చుట్టుకు తిరుగుతుండేది. ఇప్పుడు ఫ్యాక్టరీ నుంచి రాగానే దిగాలుగా ఒకమూల కూర్చుంటుంది. ఇన్నాళ్ళనయం, అక్కడా, యిక్కడా యేదో ఒక పుస్తకం తెచ్చుకుని చదివి 'ఈకథ విన్నావా అత్తా, అబ్బొమ్మ చూచావా అత్తా' అంటూ యెప్పుడూ యేదో ఒకటి వాగుతూనే వుండేది. ఇప్పటికి యెన్నాళ్ళయిందో పుస్తకమనేది తెచ్చి విప్పిను. దాని ఆశంతా ఆకథల మీదే వుండేది.

'ఎందుకే యిట్లా వుంటున్నావు'...అని తను మరీ మరీ సాగదీసి అడిగితే వచ్చీరాని నవ్వు నవ్వి 'బాగానే వున్నాను కదమ్మా అత్తా' అంటుంది. అప్పటి దాని ముఖం చూస్తే తనకే ఏడుపు వచ్చినంత పనై అటు తిరిగి కళ్ళు తుడుచుకుంటుంది.

వాడు మాత్రం మునుపట్లా వుంటున్నాడా. సాయంత్రం అయిదు గంటలకు యింటికి వచ్చేవాడు. ఇప్పుడు రోజూ ఎనిమిదింటికి వస్తున్నాడు ఒక్కొక రోజు ప్రొద్దున కూడా యెక్కడికో వెళ్ళి వస్తుంటాడు' ఆదివారాలు, సరేసరి యింటి దగ్గర వుండే పనే లేదు. దానితో అసలే పలకడు అసలు దాని వంక చూస్తేనా? అది యింట్లో వుంటే తను వీధి అరుగుమీద ఆసనం వేసుకుని కూర్చుంటాడు.

ఈ కుంభకోణం యేమిటో తెలియక రావుమ్మ సతమతమయిపోతున్నది. వారిద్దరికీ మాటలు కలపాలని శతవిధాల ప్రయత్నించింది. వాడు బెల్లం కొట్టిన రాయిలా వున్నాడు కాని నోరు మెదిపితేనా?

రావుమ్మ రోజూ తెల్లవారి కొడుకువంక చూస్తుంది. కోడలువంక చూస్తుంది. వారి ముఖాలు ఆవిడకు సంతోషవార్త యేదీ చెప్పవు.

ఎప్పుడో గోపాలం ఒక ఎఱ్ఱగులాబి మొక్క తీసుకువచ్చి వాకిట్లో పాతాడు. రోజూ అది యెన్ని ఆకులు చిగిర్చిందీ లెక్కలు కడుతూ, దాని చుట్టూ తిరుగుతూ మహా ఆనందపడుతుండేవాడు. ఈ మాయదారి కీచులాట - 'అదేవిటో తనకు తెలియక పోయె - వచ్చిందగ్గరనుంచి దాని ముఖమే చూడటం లేదు.

అది యిప్పుడు మొగ్గ తొడిగింది. రోజా కొక ఎఱ్ఱగులాబీపువ్వు చెట్టున పూస్తున్నది.

అతగాడు ఆ పువ్వువంకన్నా ముఖమెత్తి చూడటంలేదు బతిమాలినా కోడలు ఆపువ్వు జడలో పెట్టుకోవటం లేదు.

* * *

పదినెలలు గడిచాయి. ఆ వేళ అన్నపూర్ణ తలంటుకుంది. సాయంత్రం వాకిట్లో తల ఆర్చుకుంటూ ఎఱ్ఱగులాబీ మొక్క పక్కన తిరుగుతూంది.

అన్నపూర్ణ వడిలిన మల్లెపువ్వులా వుంది. ఆమె కళ్లు మరీ పెద్దవిగా కనిపిస్తూ నీలాలు కారుతున్నట్లున్నాయి.

ఎవరో కుర్రవాడు పరిగెడుతూ అన్నపూర్ణ దగ్గరకు వచ్చాడు. ఒక చీటీయిచ్చి 'ఆ వీధి చివరన నుంచున్నాయన మీకీ చీటీయిమ్మన్నా'డని చెప్పి మరి నిల్చోకుండా పరుగుతీశాడు.

★ పాలపొంగు ★

అన్నపూర్ణ తలెత్తి చూసింది. ఆమెకు ఎవరూ కనిపించలేదు. వణికే చేతుల్తో చీటీ విప్పింది.

రావుమ్మకు యేదో వినిపించి వాకట్లోకి వచ్చి తొంగిచూసి 'ఏమిటేఅదీ?' అన్నది.

పెదిమలు బిగబట్టి చదువుతున్న అన్నపూర్ణ ముఖం ఎఱ్ఱగులాబీ పువ్వమైంది. చీటీ వలిపి వేలకు విసిరికొట్టి 'చూశావా అత్తా' అంటూ రావుమ్మను కౌగలించుకుంది.

'ఎవరు రాశారే అదీ?' రావుమ్మ కోడలి వెన్ను నిమురుతూ అడిగింది.

'ఎవరో నత్తా, నాకేం తెలుసూ, మీ అబ్బాయి పేరనూ' అన్నది అన్నపూర్ణ.

'అడి జిమ్మడా, ఏమని రాశాడే' అన్నది రావుమ్మ నోరు తెరుచుకుని.

'నా నోటితో ఎట్లా చెప్పను అత్తా, వాడికిటా నేను అందంగా వున్నానట. తలారబ్బకుంటుంటే ఎక్కడినుంచో చూశాడట. చెట్టునున్న ఎఱ్ఱగులాబీ పువ్వుకన్నా అందంగా ఏడిశానట. వాడి దుంప తెగా యింకేమేమో రాశాడత్తా...' బావురుమంది అన్నపూర్ణ.

రావుమ్మ రౌద్రమూర్తి అయింది. 'వాణ్ణి రానీ, ఆ వెధవ పని కనుక్కుందాం' అని కోడలికి ధైర్యం చెప్పింది.

ఎన్నడూ లేనిది ఆవేళ అయిదున్నరకే హుషారుగా యీలవేసుకుంటూ యింటికి వచ్చాడు గోపాలం.

'మాశావుత్రా' వాకిట్లోనే యెదురై అన్నది రావుమ్మ.

'ఏమిటి?'...కళ్లు చిట్లించి అడిగాడు.

రావుమ్మ సాకూతంగా చీటీ సంగతి చెప్పి ఆ చీటీ రాసినవాణ్ణి నాలుగూ దులిపేసి ఆఖరుకు 'అడి జిమ్మడా' అని ఒక్క దీర్ఘం తీసి చతికిలబడింది.

అంతా విని గోపాలం 'అట్లాగా, వాడి సంగతి కనుక్కోవాలిసిందే' అని తాపీగా బావి దగ్గరకు జారి తీశాడు.

ఆ రాత్రి అన్నపూర్ణ వచ్చి చాప పరుచుకుని పడుకున్నాక గోపాలం యిటుకేసి తిరిగి వున్నట్లుండి యిలా అన్నాడు.

'చెట్టునున్న ఎఱ్ఱగులాబీకన్నా అందంగా వున్నావు.'

అన్నపూర్ణ ఉలిక్కిపడింది. ఆమెను భయమూ, ఆశ్చర్యమూ, ఆనందమూ వెంటవెంటనే ముసురుకున్నాయి. ఇదేవిమాట! ఉత్తరంలోమాట! ఈయనకేలా తెలుసు?

ఏదో మెరుపు మెరిసినట్లయి లేచికూచుని 'ఆ ఉత్తరం...' చటుక్కున అన్నది. అంతకుముందు పది నెలలనుంచీ తాము మాట్లాడుకోవటం లేదన్నమాట మరిచిపోయి.

గోపాలం నవ్వుతూ 'అవును. ఆ ఉత్తరం నేనే రాశాను. ఈ పదినెలల్లో చదవటం, రాయటం తృణంగా నేర్చుకున్నాను.' అన్నాడు.

అన్నపూర్ణ కళ్లు పెద్దవిచేసి 'నిజం?' అన్నది ఆశ్చర్యంగా. మరో క్షణంలో ఆకళ్లు నీళ్ళతో నిండిపోయాయి.

'ఆ నాడు అనుకోకుండా అన్నమాట మిమ్మల్ని యింత బాధ పెట్టిందా!' అన్నది.

'ఆ నాడు నీవు అనుకోకుండా అన్నమాటే నా చేత యింత పని చేయించింది. ఖాళీ రాగానే చిన్నగుమాస్తాగా వేస్తానన్నాడు ఓనరుగారు.' అన్నపూర్ణకు చేయూత యిచ్చి చాప మీద నుంచి లేపుతూ అన్నాడు గోపాలం.

ఆ వేళ అర్ధరాత్రి వరకూ తన విద్యావ్యాసంగం ఎలా సాగిందీ అన్నపూర్ణకు చెపుతూ వాగినవాడు వాగినట్లే వున్నాడు గోపాలం. ఆరాత్రి వారి సమాగమం మధురమై తోచింది వారి యిద్దరికీ.

మర్నాడు గోపాలం ప్రొద్దెక్కే వరకూ లేవ లేదు.

'గోపాళం...' గదిలోకి వచ్చి పిలిచింది రావుమ్మ.

'......'


'ఓరి గోపాలమూ...

'అబ్బ ఏమిటే'...బద్ధకంగా నవ్వుతూ అన్నాడు గోపాలం.

కొడుకు ముఖం చూచింది రావుమ్మ. మరో క్షణంలో యింట్లోకి పరుగెత్తి కోడలి ముఖమూ చూచింది.

ఆమెకి అర్థమైంది ఆమెకు అర్థమైనది వారిద్దరి తగాయిదా యివ్వాళటికి పరిష్కారమైనదనే. అక్షీచులాట ఏమిటో అది యెట్లా పరిష్కారమైనదో యిప్పటికీ ఆవిడకు తెలియదు.

జ్ఞాపకం వచ్చి నప్పుడల్లా ఆవిడ ఆ చీటీ రాసిన వాణ్ణి 'వాడి జిమ్మడా' అని తిడుతూనే వుంటుంది. ★




★ ప్రభుత్వ కార్మిక విధానానికి సవాల్ ★

భారత ప్రభుత్వపు కార్మిక విధానాన్ని కార్మికులు తీవ్రంగా సవాలు చేయ సాగించారు. కార్మిక తగాయిదాలను వీలైతే సంప్రదింపుల ద్వారాను, వీలు కాకపోతే తీర్పుల ద్వారాను పరిష్కరించడం భారత ప్రభుత్వపు విధానము. పరిష్కర్త సూచించిన ఏ పరిష్కారాన్నయినా దేశావసరాలను బట్టి మార్చడానికి ప్రభుత్వానికి హక్కు ఉంది.

బ్యాంకి ఉద్యోగులు కార్మిక విధానంపై మొదటి దెబ్బ తీశారు. తమ సమస్యపై ఇవ్వబడిన పరిష్కారమార్గం తమకు వచ్చనందున బ్యాంకి ఉద్యోగులు దేశవ్యాప్తంగా సమ్మె చేశారు. ప్రధాని చేసిన విజ్ఞప్తిని త్రోసిరాజని సమ్మె సాగించారు. కమ్యూనిస్టుల వల నుండి కొందరు బ్యాంకి ఉద్యోగులను తప్పించే ఉద్దేశంతో ప్రభుత్వం లొంగి వచ్చి, ఉద్యోగుల కోర్కెలన్నిటినీ అంగీకరించింది. ప్రభుత్వపు లొంగుబాటు కమ్యూనిస్టుల గెలుపు.

బొగ్గుగని కార్మికుల విషయంలో కూడా ఇలాగే అయింది. విచారణ సంఘాన్ని నియమించడం. ఆ సంఘం తీర్పును ప్రభుత్వం పూర్తిగా అంగీకరించడం, అమలు చేయడం జరిగింది. అయినా బొగ్గు గనుల్లో సమ్మె జరిగింది బోలెడు సొమ్ము ఖర్చుపెట్టి విచారణ సంఘాల్ని నియమించడం, ఆ సంఘాలిచ్చిన తీర్పు తమకనుకూలంగా లేకపోతే కార్మికులు తిరస్కరిస్తారు గనుక కార్మికుల కోర్కెలకే చివరకి అంగీకరించడం ఇదంతా దేనికి ? ముందే కార్మికుల కోర్కెలను అంగీకరించేస్తే చవకలో, త్వరలో తేలిపోతుంది గదా ?

రైల్వేల సమస్య మరోక రకమైనది. అంతా బాగానే ఉందని ఎంత ప్రచారం చేసినా, రైల్వేలలో చిల్లర దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఖరీదైన వస్తువులు



నవంబరు 14 వ తేదీన 68 వ జన్మదినోత్సవం జరుపుకుంటున్న భారత ప్రధాని

దొంగిలింప బడుతున్నాయి. రైలు పెట్టెలు అసహ్యంగా ఉండడం మామూలే. రైల్వే కార్మికులకు మాత్రం అడిగినదంతా లభిస్తోంది. కాని రైల్వే కార్మికులు తమ బాధ్యతలను ఎంతవరకూ నెరవేరుస్తున్నారనేది ప్రశ్న. రైల్వేశాఖ అంతా బాగానే ఉందని ప్రచారం చేసినా ఫిరోజ్ గాంధీలాంటి వారు మరోక విధంగా చెబుతున్నారు. కాంగ్రెసు నాయకత్వంలో ఉన్న భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఈ చిల్లర దొంగతనాలను అరికట్టడానికి, భారతీయ రైల్వేలను స్వాతంత్ర్యానికి పూర్వపు స్థాయికి తీసుకురావడానికి ఏమి కృషి చేసింది? కార్మికులకు బాధ్యతలు లేకుండా చేసి, హక్కులను మాత్రం సంపాదించడమేనా కార్మికోద్యమలక్ష్యం?

నిరుద్యోగ సమస్య మరింత అధికమవుతుందని బట్టల మిల్లులలో 'ఆటోమేషన్' కార్యక్రమాన్ని నిలుపు చేయడం, అంబర్ చర్ఖా ఖాదీని, ఇతర రకాల ఖాదీని ఆకాశానికెత్తెయ్యడం జరిగింది.

భారతదేశ నగరాలలో గడచిన నూరేళ్లుగా గుర్రపుబళ్లు వాడుకలో ఉన్నాయి. ఢిల్లీలో వీటిని టాంగాలంటారు. గుర్రపు బళ్లమీద ఆధారపడి బండి తోలేవాడు, పచ్చిక కోసేవాడు, వడ్రంగి, కమ్మరి, దర్జీ, తోలు వస్తువులు చేసేవాడు, ఇంకా మువ్వలు తయారు చేసేవాడు, ఇత్తడి పనిచేసేవాడు, లాంతర్లు తయారు చేసేవాడు, ఇన్ని రకాలనుండి జీవనాధారం ఆర్జించుకుంటున్నారు. మోటారు రిక్షాలు రావడంవల్ల ఇంత

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక విలేఖరి]

మందికి జీవనోపాధి పోతోంది. వేలకొలది జనం ఇలా నిరుద్యోగులవుతుంటే కార్మిక నాయకులేం చేస్తున్నారు? మద్యనిషేధంవల్ల కూడా ఇలాగే అనేకులకు జీవనోపాధిపోయింది.

బ్యాంకి ఉద్యోగులు, ఆయుధ కర్మాగార కార్మికులు, బొగ్గుకార్మికులు సంఘాలుగా సంఘటితులై ఆందోళన చేయగలరు గనుక ప్రభుత్వం వాళ్ళ విషయం పట్టించుకుంటుంది. సంఘటిత కార్మిక బలం ఎన్నికలలో పరిగణించదగిన శక్తి. టాంగా కార్మికులు, మద్యపరిశ్రమ కార్మికులు అంత సుశిక్షితులు, సుసంఘటితులు కారు. అందుచేత ఎన్నికలలో వారికంత ప్రాముఖ్యం లేదు.

పారిశ్రామిక కార్మికులను ప్రభుత్వం గారాబంగా చూడడానికి కారణం ఇదే. వ్యవసాయ కార్మికులు అత్యధిక సంఖ్యాకులైనా, సంఘటితులు కాకపోవడం వల్ల వాళ్ళ నెవరూ పట్టించుకోవడం లేదు.

ఉత్పత్తి సంగతి కూడా ఆలోచించవలసి ఉంది. బ్యాంకి ఉద్యోగులడిగినదల్లా ఒప్పుకోవడం మూలాన వారుచేసే పని పెరిగిందో, తగ్గిందో ఎవరన్నా కనుక్కున్నారా? పశ్చిమదేశాల్లో కార్మికు లెంత పనిచేసేదీ, ఎంత ఉత్పత్తి చేసేదీ సక్రమమైన అంచనాలు ఎప్పటికప్పుడు వేస్తూ ఉంటారు. భారతదేశంలో అటువంటి అంచనాలు వేయడం అలవాటుందా? ఉంటే వాటి ఫలితాలెలా ఉన్నాయి? కార్మికులందరికీ న్యాయం జరగాలిగాని, ఒక్క పారిశ్రామిక కార్మికులకు మాత్రమే కాదు. తమకు జరగవలసిన న్యాయం జరిగాక కార్మికులుకూడా దేశానికి, దేశావసరాలకు జరగవలసిన న్యాయం జరపాలి. వారలా న్యాయంచేశారో లేదో ఉత్పత్తి లెక్కలు చూస్తేగాని బయటపడదు.

* * *

కొన్నాళ్ళ క్రితం ఢిల్లీలో వచ్చిన భూకంపం గురించి ఒకమాట. భూకంపం తీవ్రంగానే వచ్చింది. కాని వెయ్యేళ్ళక్రితం కట్టిన కుతుబ్ మీనార్, షాజహాన్ కట్టించిన జుమ్మామసీదు చెక్కు చెదరలేదు. గత యుద్ధకాలంలో కట్టిన ఇళ్ళు కూడా పడిపోలేదు. కాని 1956 ఆగస్టులో పూర్తి అయిన రిజర్వుబ్యాంకు భవనం "భూకంపానికి నిలిచేవిధంగా" కట్టిన భవనం మాత్రం బీటలిచ్చింది. అంతే కాదు, 1947 ఆగస్టుతర్వాత, అంటే స్వాతంత్ర్యంవచ్చిన తరువాత ప్రజాప్రభుత్వం కట్టించిన భవనాలన్నీ బీటలు వారాయి. ★

ప్రచండ చాళుక్యులు

హారీత శివశర్మ

(గతసంచిక తరవాయి)

5

యుద్ధం ప్రారంభమైనదగ్గరనుంచి కలి విష్ణువులో ఒకమార్పు వచ్చింది. ఇప్పుడు కూడా అతను అట్టే ఎవరితోను మాట్లాడ్డం లేదు. అయినా అది వరకు ఆవరించివున్న విషాద మేఘాలు తొలగినట్లు అతనిముఖం శరతులో ఆకాశం లాగా నిర్మలంగా కన్పిస్తోంది. ఒండు విరిగి సన్నగిల్లిన కృష్ణానది లాగా అతని మనస్సులో శిలక్కను గూర్చిన ఆలోచనలు విరిగి సన్నగిల్లాయని స్కంధావారంలో అంతా అనుకున్నారు. ఒక్క రుద్రునికి మాత్రం విష్ణువులోని ఈ మార్పు నచ్చలేదు. సహజమైన వాంఛలను అణచుకోవడంవల్ల అవి మనస్సును అదిమి విపరీతమైన మార్గాలను పట్టిస్తాయి. మనిషిని ఏమన్నా చేస్తాయి. ఇట్టి భయాన్ని రుద్రుడు లోపలనే దాచుకున్నాడు. సమయం దొరికినప్పుడల్లా విష్ణువును కలుసుకొని శిలక్కను గూర్చి ప్రస్తావిస్తూనే వున్నాడు. వేంగి రాజకీయాలను గురించి అరిమిత్ర మండలాలను గురించి చర్చిస్తూనే వున్నాడు. తమకు మిత్రులు అంటూ చుట్టుప్రక్కల రాజ్యాలలో లేరు. ఒక్క వేంగీ ప్రజలు, విషయాధిపతులు అండగా నిలబడటంవల్లనే ఈయుద్ధం సాగుతోంది. దాహళ హైహయులు, చేది హైహయులు తటస్థంగా వుంటున్నారు. రాష్ట్రకూటులది శాఠ్యమో, ఔదాసీన్యమో ఇంకా తేలలేదు. రాష్ట్రకూట గోవిందుడు వేంగిలో పెట్టిన సేనలను అమోఘవర్షుడు ఇంకా ఉపసంహరించలేదు. కాని వారు ఇప్పుడు యుద్ధంలో అంత ఉత్సాహాన్ని చూపించడం లేదు. ఆరాష్ట్రకూట సైన్యం ఉపసంహృతం అయ్యేట్లు చెయ్యాలి. అప్పుడు గాంగులు వచ్చినా పరవాలేదు. భీముణ్ణి అణచవచ్చు. నయతంత్రాలను గూర్చిన ఇట్టి చర్చలతో విష్ణువు మనస్సు విపరీతపు దారులను పట్టకుండా రుద్రుడు చూస్తున్నాడు.

ఒక్కొక్కసారి శిలక్కనుగూర్చినచర్చ వారిద్దరి మధ్యసాగుతూ వుండేది. "కక్కా! విష్ణూ! ఈ రాష్ట్రకూటుల శిలక్క మన చాళుక్య శిలక్క అంత అందంగా వుంటుందా" అని ప్రశ్నించేవాడు రుద్రుడు. విష్ణువు మౌనంవహిస్తే వూరుకునే వాడు కాదు. ఏదో సమాధానం చెప్పేదాకా విసిగించేవాడు. "కక్కా! నేను ఆశిలక్కను చూడలేదుగాని ఈ శిలక్క మహా అందంగా ఉంటుదయ్యా" అని విష్ణువు జబాబు చెబితే రుద్రుడు నవ్వేవాడు. అందంగా వున్నదంటే నవ్వడం దేనికి? అది విష్ణువుకు అర్థమయ్యేది కాదు. "ఎందుకు నవ్వుతావు? అని ప్రశ్నించేవాడు. "అదికాదు, కలీ! అందమేనా నువ్వు చూస్తున్నది. గుణం చూడాలి. అందం రెండు విధాలు. ఒకటి శారీరకమైంది. రెండవది గుణ సంబంధమైంది. ఆ అందాన్ని నువ్వు చూచావా, లేదా, అన్నదే ప్రశ్న" అనేవాడు రుద్రుడు. విష్ణువుకు ఈ సంభాషణలలో చాళుక్యవంశం ఆదికథనం జ్ఞాపకం వచ్చేది. శతానీకుని వంశంలో కొందరు అయోధ్యను పాలించారు. వారిలో విజయాదిత్యుడు దక్షిణాపథానికివచ్చి త్రిలోచన పల్లవునితో యుద్ధం చేశాడు. దక్షిణాపథంలో ఒక రాజ్యాన్ని స్థాపించుకోవాలని ఆయన ఆశపెట్టుకొని యుద్ధం చేశాడు. కాని ఆ యుద్ధంలో వీరస్వర్గం అలంకరించాడు. అప్పుడు ఆయన భార్య గర్భిణి. ముడివేము వాస్తవ్యుడైన బ్రాహ్మణుడు, విష్ణుభట్టసోమయాజి ఆవిణ్ణి రక్షించి కూతురుగా పోషించి, ఆవిణ్ణి, ఆమె గర్భాన్ని రక్షించాడు. ఆవిడ ఒకకొడుకును కన్నది. ఆ కొడుక్కు విష్ణువర్ధనుడు అని పేరుపెట్టింది. విష్ణువర్ధనుడు పెద్దవాడై, జరిగిన కథ అంతా తెలుసుకున్నాడు. చాళుక్య గిరి మీద నందా భగవతిని ఆరాధించి, ఎదురులేని శౌర్యంతో నర్మదనుండి సేతువు దాకా వున్న నేలను జయించి దక్షిణాధీశుడైనాడు. ఆ తల్లి ఎంత మంచిది! అటువంటి కొడుకును కన్నది. తాను శిలక్కను చూడగా ఆమె తనకు జ్ఞాపకం వచ్చింది. విష్ణువు రుద్రునితో ఈ కథ చెప్పి "కక్కా! నేను ఈ శిలక్కను పెండ్లి ఆడితీరుతాను. అందుకు అంత ఆలోచనా చేస్తున్నాను గదా! అప్పుడు నాకు పుట్టే కొడుక్కు విజయాదిత్యుడని పేరు పెడతాను. వాడు దక్షిణాధిపతి అయితీరాలి"



సంతాల్ యువతులు
చిత్రకారుడు: కుమారిలస్వామి, ఢిల్లీ.

ప్రచండ చాళుక్యులు

అన్నాడు. రుద్రునికి ఇది విన్నప్పుడు నవ్వు వచ్చేది కాదు. అతని ముఖం గంభీరం అయ్యేది. మనస్సు కలత చెందేది. కుబ్జవాని ఆలోచనలు వక్రించడం లేదు. తీక్ష్ణం అవుతున్నాయి.


6

గాంగుల సైన్యం బయలుదేరి వేంగిలో అడుగు పెడుతున్న వార్తలు అందుతున్నాయి. ఆకాశంనుంచి వూడి పడుతున్న గంగ యొక్క పతన ధారా వేగంచేత లోకాలకు దెబ్బ తగలకుండా ఆ మహానదిని తన జటాజూటంలో బిగించడానికి పరమశివుడు పూనుకున్నట్లు మహారాజు విజయాదిత్యుడు తన సైన్యం జటలుగా, తాను శివుడుగా గాంగుల సైన్య వాహినిని బంధించి వెయ్యడానికి సన్నాహం చేస్తున్నాడు. వేంగి నగరంలోను, ఆ పరిసరాలలోనువున్న రాష్ట్రకూట సైన్యాలు వెనకపాటునవచ్చి తన సైన్యాన్ని పోటు పొడవకుండా తగు కట్టుదిట్టాలు చేస్తున్నాడు. ఆ సైన్యం అక్కడనుంచి కదలవచ్చు; కదలకపోవచ్చు. కాని తన జాగ్రత్తలో మాత్రం తాను వుండక తప్పదు. వారిని అరికట్టడానికి రుద్రుణ్ణి, విష్ణువును నియోగించాడు. ఇప్పుడు సైన్యం రెండు స్కంధావారాల క్రింద చీలిపోయింది. ఒకటి విజయాదిత్యుని క్రింద గాంగులను నిలువరించడానికి సన్నద్ధమైపోయింది. మరి ఒకటి వేంగినుంచి రాష్ట్రకూట సైన్యం రాకను అరికట్టడానికి బయలు దేరింది.

విష్ణువు రుద్రుడు ఈ స్కంధావారంతో వేంగి వైపుకు నడుస్తున్నారు. చారులు తెస్తున్న వార్తలవల్ల రాష్ట్రకూటులభయం అంతగా లేదని తెలుస్తున్నది. భీముడు వలలో చిక్కిన పక్షిలాగా కొట్టుకుంటున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రకూటులు కదలరు. యుద్ధం చెయ్యరు. వారి సైన్యాన్నంతా తాను భరించాలి. ఆ భరించడం భీముడికి కష్టమైపోతోంది. తన అధీనంలో వున్న వేంగి రాజ్యంలోని జనం పూర్వం ఏమై పోతామోనన్న భయంతో తలకుమించి చెల్లిస్తున్న సుంకాలను ఇప్పుడు చెల్లించడం లేదు. ఇది విని రుద్రుడు, విష్ణువు సంతోషించారు. రాష్ట్రకూట సైన్యాన్ని వేంగి నుంచి గెంటడం ఎట్లాగని ఆలోచించారు.

విష్ణువు ఒక ఆలోచన చెప్పాడు. రుద్రుడికి అది నచ్చలేదు. కుబ్జవాణ్ణి కాదనలేక సరే చూడు అన్నాడు. అది మొదలు విష్ణువు తన స్కంధావారంలోని తెల్లని సింధు జాతి గుర్రాలను ఒక్కచోట చేర్పించాడు. రెండు వందలకు పైగా చేర్పించాడు. రెండువందల మంది ఉక్కు కడ్డీలవంటి యోధులను చేర్చాడు. అందరికి ఆ అశ్వాలతో శిక్షణ ఇచ్చాడు. ఆ అందరు చారకృత్యంలో మహా ఆరితేరినవారు. ఎటువంటి వేషం వెయ్యమంటే అటువంటి వేషం వేస్తారు. ఆ అందరికి విష్ణువు విచిత్రమైన దుస్తులు కుట్టించాడు. అందరు శ్వేతాంబరాలు కడతారు. శ్వేత కూర్పాసాలు తొడుగుతారు. శ్వేతోష్ణీషాలు ధరిస్తారు. శ్వేతాశ్వాలను అధిరోహిస్తారు. సాయంత్రం కాకముందే బయలుదేరిపోయి, తెల్లవారి ఎప్పుడో గాని తిరిగిరారు. వీరికి విష్ణువే స్వయంగా నాయకుడు. ఆ సైన్యానికి అతను బహు వ్యూహాలలో, బహువిధ ఛద్మ వేషాలలో శిక్షణ ఇచ్చాడు. అతను అగ్నిలో దూకమంటే వారు దూకుతారు. ఇది అంతా ఎందుకో రుద్రుడికి తెలుసు; తెలియదు. అంతా తెలిసిన తర్వాత "అర్థా! కలి!" అన్నాడు.

ఆ తెలిసిన విషయం ఇది. రాష్ట్రకూట రాజ్యంలో పూర్వం సామంతులు, విషయాధిపతులు ఆ మోఘవర్షుని శాసనాన్ని పాలించక పోయినా, ఎదురు తిరగడంలేదు. ఇప్పుడు ఎదురుతిరుగుతున్నారు. అతని మూలసైన్యం ఈ తిరుగుబాటును ఆపలేక పోతోంది. కక్కసువర్షుడు కొంత సైన్యాన్ని తెచ్చాడు గాని లాభం ఏమీ కన్పించడం లేదు. ఆఖరికి ఆయన ఆమోఘవర్షుడికి వేంగిలోని రాష్ట్రకూటబలాన్ని ఉపసంహరించవలసిందని ఖచ్చితంగా చెప్పాడు. ఇవిఅన్నీ చారుల వల్ల తెలిసి మహారాజు విజయాదిత్యుడు రుద్రునికి అందజేసిన వార్తలు. రాష్ట్రకూట రాజ్యంలో ఈ తిరుగుబాటు ఎట్లా సాగుతున్నది మాత్రం సరిగ్గా తెలియడంలేదు. కాని శ్వేతాంబర ధరులు, శ్వేతాశ్వరూఢులు అయిన రౌతులను గురించి కథలు మాత్రం వారి రాజ్యంలో మహా ప్రచారంలో వున్నాయి. ఆ రౌతులు ఎవ్వరో ఎవ్వరికీ తెలియదు. ఎక్కడివారో తెలియదు. వారినిగూర్చి కథలు మాత్రం విచిత్రంగా వుంటున్నాయి. రాష్ట్రకూట రాజ్యంలో ఒక విషయంలో ఒక పర్వతం వుంది. దానిమీద ఒక దేవాలయం. కొండ ప్రక్కన వూరు. జాతర జరుగుతోంది. వెన్నెలరాత్రి. జాతరకు వచ్చిన జనంలో కొందరు కొండ ఎక్కుదామని బయలు దేరారు. కొండకొమ్మున అన్నీ తెల్లని గుర్రాలు. ఆ గుర్రాలమీద మనుష్యులు. తెల్లని బట్టలవారు. తెల్లని అంగీలవారు. తెల్లని తలపాగాలవారు. జనానికి ఆశ్చర్యమైపోయింది. అద్భుతమైపోయింది. ఎక్కడి నుంచి వచ్చాయి ఈ గుర్రాలు? ఎక్కడి నుంచి వచ్చారు ఈ మనుష్యులు? వాళ్ళు దేవదూతలా? లేక దేవతలా? కాదు, కొండమీది గుడిలోని దేవత సృష్టించిన వీరులనుకు



మహబూబ్ నగరం జిల్లాలోని కోయిలసాగర్ ప్రాజెక్టు.

న్నారు కొందరు. లేకపోతే ఇన్ని గుఱ్ఱాలు కొండమీదకు ఎట్లా వస్తాయి. ఆ జనానికి భయం వేసింది. భక్తి కుదిరింది. గుఱ్ఱాలు కొన్ని కదిలాయి. కొందరు రౌతులు కిందకు దిగి వస్తున్నారు. జనం పారిపోదామనుకున్నారు. ఒక రౌతు ఆగమన్నట్లు చెయ్యి ఎత్తాడు. వారు కదలలేకపోయారు. రౌతు దగరకు వచ్చాడు. వారితో ఏమో మాట్లాడాడు. ఏమి మాట్లాడాడో తెలియదు. వారు భయంతో, భక్తితో సాష్టాంగ దండప్రణామాలు చేశారు. వెళ్లిపోయారు. కొండ దిగి క్రిందకు వచ్చి, తల ఎత్తి చూస్తే ఆ గుఱ్ఱాలు లేవు. ఆ రౌతులు లేరు. తర్వాత ఆ గ్రామంలో అలజడి బయలుదేరింది. గ్రామాధికారిని పట్టుకొని, గ్రామస్థులు కొండమీద దేవతకు బలివేశారు. అమోఘవర్షుడు మా రాజు కాదన్నారు. కొండమీద గ్రామదేవతే పాలిస్తుందన్నారు. ఇట్లా వున్నాయి కథలు. ఈ జరుగుతున్న ఉదంతాలు ఒక్క విధంగా లేవు. అన్ని చోట్ల అన్ని రకాలుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలు వినే రుద్రుడు "అద్దా" అన్నాడు. "కలీ! కలీ! నువ్వు కలివి కావు. కల్కివి" అన్నాడు. విష్ణువు మాట్లాడలేదు. విష్ణువు చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

7

రాష్ట్రకూట గోవిందుడు చనిపోయి రెండు శరత్తులు కావస్తోంది. శకవర్షం 735 లో ఆయన చనిపోయినాడు. ఇప్పుడు శకవర్షం 737 నడుస్తున్నది. రాష్ట్రకూటరాజ్యంలో అమోఘవర్షుని శాసనం పూర్తిగా మొక్కవోయింది. వేంగిలో వుంచిన సైన్యాన్ని పిలిపించుకుంటేనే గాని అతని ఉనికి స్థిరం అయ్యేట్టు లేదు. మరి విజయాదిత్యుడి గాంగుల సైన్యాన్ని కృష్ణ దాటరానియడం లేదు. ఆయన నిజంగా నరేంద్రమృగరాజై విజృంభిస్తున్నాడు. ఈ విజృంభణమే ఇట్లా సాగితే, రాష్ట్రకూటులను గూడా ఆయన తేలిగ్గా కొట్టివేసినా కొట్టివేయగలడు. కక్కసురుడు ఖచ్చితంగా చెప్పివేశాడు. నువ్వు వేంగినుంచి నీ రాష్ట్రకూట సైన్యాన్ని ఉపసంహరించివెయ్యి. నేను ఆ విజయాదిత్యుణ్ణి ఏదోవిధంగా కట్టుకువస్తాను. ఇక భీముడి వల్ల నీ కేమీ లాభం లేదు అని చెప్పాడు. అమోఘవర్షుడు వరేవక, తప్పలేదు.

అమోఘవర్షుడు ఈ నిర్ణయానికి అయితే వచ్చాడుగాని, వేంగిలోవున్న రాష్ట్రకూట సైన్యం నాయకులలో కొందరికి ఇది రుచించ లేదు. ఇందుకు కారణం వుంది. వేంగిలో తమకు అంతా హాయిగా వుంది. యుద్ధం చెయ్యనక్కరలేదు. పైగా ఊళ్ళను దోచుకోవచ్చు. డబ్బు గడించుకోవచ్చు. తీరా యుద్ధమే నెత్తిమీదికి వస్తే తప్పుకోవచ్చు. ఇప్పుడు రాష్ట్రకూట రాజ్యానికి పోతే సామంతులతో అమోఘవర్షుడు సాగిస్తున్న పోరాటాలలో పాల్గొనాలి. ఇందులో విజయం ఎవ్వరిదో తెలియదు. ఆ తెలిసే వేళకు కదలవచ్చు. ఇట్లావున్నాయి వీరి ఆలోచనలు.

కాని కొందరు వంశపారంపర్యంగా రాష్ట్రకూటుల కొలువులోవున్న సేనానులు వున్నారు. వారు తాము వేంగిని వదిలి వస్తున్నామని అమోఘవరుడికి కబురు పెట్టారు. భీముడికి అటాఅని తెలియచేశారు. భీముడు మాట్లాడలేదు. తనకు కాలం అనుకూలంగా లేదు. పరిస్థితులు అనుకూలంగా

★ ప్రచండ చాళుక్యులు ★

లేవు. ఉన్నవాళ్ళే వుంటారు. పోయిన వాళ్ళుపోతారు. ఊరకమైనజోదాసీన్యంతో అతను మానంభహించాడు.

విజయాదిత్య చాళుక్యసైన్యం ఝంఝామారుతంలాగా విజృంభిస్తోంది. గాంగులు ఆ తాకిడికి తటుకోలేక పోతున్నారు. ఈ భీముడితో కలిసి ఎందుకు ఈతంటా తెచ్చిపెట్టుకున్నామా అనుకున్నారు. చాళుక్యసైన్యం ఆత్మస్వాతంత్ర్య దీక్షతో పోరాటం సాగిస్తోంది. ఆ దీక్ష నిశ్శంకటమైంది. రాష్ట్రకూటుల ఒత్తిడి భరించి నేర్చుకున్న తితిక్ష, సహనం ఇప్పుడు కొత్త రూపాలు దాల్చి వెయ్యివిధాలుగా గాంగులను వేధించడానికి ఉపయోగపడుతున్నాయి. గాంగులకు యీ దీక్ష లేదు. వారు ఒక ద్రోహికి, దేశాన్ని రాష్ట్రకూటులకు పదువపెట్టిన వాడికి, వానికు సహాయం చెయ్యడానికి వస్తున్నారు. అందులో నీతిలేదు, నియమంలేదు, ధర్మంలేదు. విజయాదిత్య మహారాజు విష్ణువు, రుద్రుడు తమ సైన్యాలలో యిట్టి ప్రసంగాలతో నే ఉత్సాహశక్తిని నూరిపోసేవారు. మంత్రశక్తిని ఉపయోగించి భీముని మిత్రమండలాలను విరగ్గొట్టేవారు. దండశక్తితో ద్రోహులను దండించేవారు.

యుద్ధంలో విజయాదిత్యుని సైన్యాలకు విజయాలు లభిస్తున్నకొద్దీ భీమునిలో చేతకానితనం విజృంభిస్తోంది. విష్ణువు సైన్యాలతో, రుద్రునిసైన్యాలతో తలపడి బహుసార్లు పోరాటాలు సాగించాడుగాని లాభం లేకపోతోంది. తనవెంట వున్న రాష్ట్రకూట సైన్యశేషానికి గ్రామాలను, పట్టణాలను దోచుకోవడంమీద వున్నంత ఆస్థ యుద్ధంమీద వున్నట్లు కన్పించలేదు. తాను యేమి చేయగలడు? ప్రజలలో ఒక్కడు తనమాట వినేవాడు లేడు. తాను సాధ్వసంచేత వారిని వంచిచన్ని నాళ్ళు వంగినట్టువుండి, ఇప్పుడు తాశ్ప్రమాణమైన విక్రమంతో లేచి తన యీ కైజీతపు సైన్యం వెనుకతట్టును, ముందుతట్టును పార్శ్వాలలో గోతులు తీస్తున్నారు. పరిస్థితి అంతా విజయాదిత్యునికి అనుకూలంగా వుంది. భీముడు సహజముగా దుష్టుడు. అతనికి దుష్టమయిన వ్యూహాత్మక శిమయిన ఊహరాదు. పరిస్థితి ఇంత తనకు ప్రతికూలించినా అతనికి పశ్చాత్తాపంలేదు. పైగా ఆ సైజదౌష్ట్యం మూడింతల అవుతున్నది. తాను కూడా రాష్ట్రకూటులతోపాటు జనాన్ని హింసిస్తున్నాడు. గ్రామాలను దోచుకుంటున్నాడు. నగరాలకు నిప్పు ముట్టిస్తున్నాడు. సాధ్యమైతే వేంగిరాజ్యాన్ని రాజ్యాన్ని తగులపెట్టి వేసేద్దామన్నంత జుగుప్సతో కొట్టుకుపోతున్నాడు. తనకు కాని ఈ రాజ్యం ఎందుకు? ఇది భీముడి మనస్సు.

విజయాదిత్య మహారాజుకు భీముని ఈ దురాగతాలు మహామనఃఖేదాన్ని కల్గించాయి. ఆ ఖేదంలో భీముణ్ని దండించాలన్న పట్టుదలకూడా అధికమైంది. తన సర్వసైన్యంలో భీముణ్ని ప్రాణాలతో పట్టాలని ఆయన చాటించాడు. గాంగులను వెనక్కు తరిమి, తాను వేంగిమీదకు హుటాహుటిని యానం ప్రారంభించాడు. ఆ సైన్యం ఒక మహాచక్రాకృతిగా వేంగిమీదకు నడుస్తోంది. భీముడికి ఆ బంధాల్ని చీల్చుకునిపోయే అవకాశం కన్పించడంలేదు. రోజురోజుకు యుద్ధభూమి సంకుచితం అవుతోంది. ఇందులోపడి కొట్టుకుంటే లాభంలేదు. భీముడు సరాసరి వేంగికోటలో చేరాడు. కందకాలకు నీళ్లు పట్టించాడు. ద్వారాలు మూయించాడు. కైజీతపు రాష్ట్రకూటులతో అందులో కూర్చున్నాడు.

వేంగీదుర్గపు సలుపు మలుపులు విజయాదిత్యునికి తెలిసినట్లు మరియెవ్వరికి తెలియవు. అందుచేత దాన్ని వశంచేసుకోడం ఆయనకు అంతకష్టం అనిపించలేదు. ఒక్కరాత్రి ముట్టడివేసి సూర్యోదయవేళకు ఆయన నగరంలో ప్రవేశించాడు. నగరంలో ఒక పిట్టలేదు. వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. చిత్రరథస్వామి ఆలయగోపురంమీదవున్న సువర్ణ కలశాలు సూర్యుని కిరణాలుపడి వెదిఎక్కుతూ వున్న సమయానికి ఆయన రాచనగరులో

ప్రవేశించాడు. వెంట విష్ణువు, రుద్రుడు, ఇంకొంత సైన్యము వున్నది నగరులో ఎక్కడా అలికిడిలేదు. మహారాజు సరాసరి సభాస్థానం వైపుకు నడిచాడు. కైజీతపు రాష్ట్రకూటులతో భీముడు అందులో వున్నాడు. భీముడు వేంగిరాజ్యపు లోహ సింహాసనంమీద కూర్చున్నాడు. తక్కిన అతని బంటులు తత్తదాసనాలమీద వున్నారు. ఒక రాజు నిండుపేరోలగంలో వున్నట్లు వుంది సభాభవనం అంతా. దీన్ని చూచి విజయాదిత్యుడికి ఏమిచెయ్యాలో తోచలేదు. మేఘ గంభీరంగా "భీమా!" అన్నాడు. భీముడికి పిచ్చిఎత్తింది. అతను ఊరికే పగలబడి నవ్వుతున్నాడు. సింహాసనం మీద గణాచారిలాగా వూగుతున్నాడు "విజయ! విజయ! ఈ సింహాసనం నాది! ఈ సింహాసనం నాది. నీకు ఇయ్యనుపో" అంటున్నాడు. మహారాజుకు అంగలో కళ్ళనీళ్లు తిరిగాయి అంతలో ఆయన మళ్ళీ గంభీరుడై పోయినారు "రుద్రా! భీముణ్ని బంధించు" అని ఆజ్ఞాపించాడు. కైజీతపు రాష్ట్రకూటులు తలలు వాల్చేసుకున్నారు భీముడు రుద్రునిమీదకు దూకపోయి, సింహాసనంమీదనుండి బోర్లపడ్డాడు.

8

తిరిగి వేంగీ సింహాసనం శకవర్షం 789 లో విజయాదిత్యునివశమైంది ఇందుకు ఆయన నూటఎనిమిది యుద్ధాలు చేశాడు ఇప్పుడు ఆనూట ఎనిమిది యుద్ధాలు జరిగిన ప్రతిచోట ఒక్కొక్క దేవాలయాన్ని కట్టించడానికి పూనుకున్నాడు. దేశంలో నూట ఎనిమిది నకలేశ్వరాలయాలు వెలిస్తేనేగాని ఈయుద్ధంలో జరిగిన నరవధవల్ల వచ్చిన పాపం నివృత్తికాదు అని ఆయన ఈపని చేశాడు. ఈ అన్నిచోట్ల సత్రములు కట్టించాడు. ప్రపలు స్థాపించాడు. అగ్రహారాలు ఇచ్చాడు. ఆయన శాసనం వేంగిరాజ్యంలో అడ్డులేకుండా సాగిపోతోంది.

రాష్ట్రకూట రాజ్యంమాత్రం అల్లకల్లోలంగా వుంది ఇప్పుడు అసలు అమోఘవర్షుని శాసనమే అక్కడ చెల్లడంలేదు. సామంతులంతా స్వతంత్రులై పోయారు. ఇప్పుడు బలవంతుడైన వేంగీ విజయాదిత్యుడు తలుచుకుంటే అమోఘవర్షుని సింహాసనం గూడా వూడిపోతుంది.

కక్కసువర్ణుడు ఇవన్నీ గ్రహించి విజయాదిత్యుని వద్దకు రాయబారం పంపాడు. ఈ రాయబారం రాజకీయంతో కూడినదే అయినా సువర్ణుడు దాన్ని అట్లా కన్పించనీయలేదు. ఆయన రాయబారి కక్కసువర్ణుని మాటలుగా విజయాదిత్యునితో ఇల్లా అన్నాడు: "పూర్వం మీరు రాయబారం పంపినప్పుడు మీకు సింహాసనం లేదు. సింహాసనం లేనివాని కొడుక్కి మాపిల్లను ఇవ్వడం ఏమిటని అప్పుడు అపచారం చేశాము. మా చెల్లెలు శీలమహాదేవి మీ విష్ణువుమీద మనస్సు పెట్టుకొని చిక్కి శల్యం అయిపోతున్నది. ఇది మేము చూడలేకుండా వున్నాము. మా చెల్లెలును మీవిష్ణువుకు ఇస్తాము. మీరు మమ్మల్ని అనుగ్రహించాలి దంపతులను దీవించాలి".

మహారాజు రుద్రుని వంకచూచాడు. రుద్రుడు విష్ణువువంక చూచాడు విష్ణువు ముఖంఅంతా సంతోషంగా మారినట్లు వుంది. మహారాజు "మీ రాయబారాన్ని మేము ఆమోదిస్తున్నాము" అన్నారు రాష్ట్రకూట రాయబారితో.

9

శీలామహాదేవి, కలివిష్ణువుల కల్యాణం అయి రెండు సంవత్సరాలు దాటింది. వారికి ఇప్పుడు ఒక మగశిశువు. విష్ణువు తాను అనుకున్నట్టే ఆపుత్రవానికి విజయాదిత్యుడు అని నామకరణం చేశాడు. తల్లిమాత్రం అతణ్ణి గుణక్కనల్ల అని పిలిచింది. రాజులు, రాజబంధువులు అంతా ఆ కుఱ్ఱవాడు, మహారాజలక్షణాలతో వున్నాడన్నారు. బ్రాహ్మణులు ఈ కుఱ్ఱవాడు తప్పకుండా సకల దక్షిణాపథాధీశుడు అవుతాడని దీవించారు.

మహారాజు మనుమణి చేతుల్లోకి తీసుకున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు. కోడలి చేతికి ఇచ్చి కుఱ్ఱవాని ముఖాన్ని తీక్ష్ణంగా చూచాడు. "రుద్రా! దేశం నన్ను నాకొడుకును ప్రచండ చాళుక్యులు అంటున్నది. సర్వ దేశాలవారు ఆదేమాట అంటున్నారు. అది నిజంకాదు. వీడు, ఈ గుణగుడు, నిజంగా చండ చాళుక్యుడు. వాడిముఖం చూడు. నీకే తెలుస్తుంది. పరమశివుడు కరుణించాలి. పరమశివుడు కరుణించాలి" అన్నాడు. [సమాప్తం] ★

రుంబా నాట్యం

కాలక్రమాన మన పౌరాణిక చిత్రాల్లో రుంబా నాట్యం కనబడితే ఎవ్వరూ ఆశ్చర్యపోనక్కరలేదు. రుంబా నాట్యం భారతీయ సంప్రదాయానికి విరుద్ధం కాదని వాదించే వర్గం ఒకటున్నది. ఈ వర్గంవాళ్లేమంటారంటే,


దేవలోకపు ప్రైమాబాలెరినా రంభ ఒకరకం నాట్యం చేసేది. దాన్ని ఆ రోజుల్లో రంభానాట్యం అనేవాళ్లు. ఆ రంభానాట్యమే భూలోకంలో రుంబానాట్యంగా మారింది. భరతముని రంభాద్వేషి కావడంచేత రుంబానాట్యం ఇంతకాలం మూలపడిపోయింది. ఇప్పుడు పౌరాణిక చిత్రాల్లో రుంబానాట్యాన్ని ప్రవేశపెట్టి దాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సంస్కృతకసంగీతం

పౌరాణికచిత్రాలు ఇంకో విధంగాకూడా ప్రాచీన సంస్కృతిని ఉద్ధరించగలవు, పురాణ వ్యక్తులందరూ సంస్కృతంలోనే మాట్లాడుకునేవాళ్లు గనక కనీసం పాటల్లోనైనా సంస్కృత ఉచ్చారణ ఉండడం చాలా అవసరం. ఉదాహరణకి మేనక విశ్వామిత్రుడి దగ్గిర రుంబా నాట్యంచేస్తూ "హాయీ ఈరేయీ, రావోయీ" అని పాడిందనుకోండి. పూర్వకాలపు వాతావరణం రాకపోగా, బోలెడు జిగిబిగీకూడా రాదు అందుచేత గీతాః రాయీః పద్ధతిలో, "హాయీః ఈరేయీః రావోయీః"అని విసర్గలుచేర్చి పాడితే సంస్కృత ఉచ్చారణ వచ్చేసి, సన్నివేశం బొత్తిగా అద్భుతంగా ఉంటుంది.

శుద్ధమైన సువాసనగల మంచి కాఫీ

మీరు సులభంగా కొనగల ధరకు!



Stanes
స్టేన్స్ ఎట్టి లేబిల్
ప్యూర్ కాఫీ

THE PICK OF THE SOUTH

స్టేన్స్ ఎట్టిలేబిల్ ప్యూర్ కాఫీ సరిసరుచి బలమేగాక మీకు ఎన్నోకప్పుల కాఫీయగును: ప్రతి ప్యాకెట్టీపై స్టేన్స్ పేరుచూచి మరీ కొనండి సాటిలేని నాణ్యతకు అదే మీ గ్యారంటీ స్టేన్స్ ఎట్టిలేబిల్ ప్యూర్ కాఫీ తాజాగా గాలిచొరనట్లు ప్యాక్‌చేయబడి ½, 1, 3, 7, 14&20పౌన టిన్నులలో లభించును

ప్రతియొక్కరు కొనదగు చక్కని కాఫీ!

STC 400

ది యునైటెడ్ కాఫీ సప్లై కంపెని లిమిటెడ్
కోయంబుత్తూరు, దక్షిణ ఇండియా.

ఖమ్మంమెట్టు ఏజెంట్లు : మెసర్సు రాధాకృష్ణ జనరల్ స్టోర్సు, కమాబారోడ్డు, ఖమ్మంమెట్టు.
డిస్ట్రిబ్యూటర్లు: కొత్తగూడెం: మెసర్సు ది కొత్తగూడెం కాలరీస్ కోఆపరేటివ్ స్టోర్సు లిమిటెడ్, కొత్తగూడెం.

అతిమూత్ర వ్యాధి
నెమ్మదించును


మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్ర వ్యాధి (DIAB-TES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే. దీని పాలబడినవారు అరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి క్షుపగా దాహం, ఆకలి తరచుగా చక్కెరతోగాని. లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి వీనస్ భారమ్ అనేక సంవత్సరములు పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది దీన్ని వాడటంవల్ల వేనకు వేల మందిమృత్యుముఖము నుండి బయటపడ్డారు దీన్ని వాడితే రెండవలేక మూడవ రోజు నుండేమూత్రంలో చక్కెర తగ్గించి అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.

ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory (A.P.)
P. O. Box No. 587, Calcutta.

చర్మపు బాధలకన్నిటికి
"సైబాల్"



చర్మవ్యాధులన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, చిన్న క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, పొంటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధి చెందినది.

"రమణీస్ బేబి గ్రైప్"



తయారుచేయువారు

ది సౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.


డిస్ట్రిబ్యూటర్లు.
సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికింద్రాబాద్.
బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

వైటోడెంట్
దంతక్రిములను సంహరించే పండ్లపొడి
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్. మద్రాసు-30.

కాన్వాసర్లు కావలెను

నెల 1 కి రు 100 నుండి 300 వరకు తీరిక కాలములో పెట్టుబడి పెట్టనక్కరలేకుండా సంపాదించండి వివరాలు ఉచితము.

GIRSON KNITTING WORKS,
LUDHIANA (31).



నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము వీక్నెస్, విస్తృతమ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20రు. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి రు 1-1-0

పి. పి. ఎ అండ్‌కో, (ఆయుర్వేద సమాజం)
పెరిదేప (పోస్టు) — నెల్లూరు జిల్లా.

కర్ణోపదేశం

ప్రాచీన గాథాలహరి

౧

కౌరవసభలో శ్రీకృష్ణుని రాయబారం బూడిదలో పోసిన పన్నీరయిపోయింది అయినా అతని ముఖంలో చిరునవ్వులాగే కలువపూరేకలా తళతళలాడింది తిరిగి మరలి పోతూంటే ధృతరాష్ట్రాది కౌరవ్యులంతా సగౌరవంగా అతని వెంటవెంటనే నడిచి వెళ్ళారు. వాసుదేవుడు వారందరినీ మరలి పోవలసినదని ప్రార్థించాడు. వారొకరొకరే తిరుగుముఖం పట్టారు

అంతలో శ్రీకృష్ణుడు కర్ణునివైపు చూచాడు

"నన్నింకా కొంతదూరం సాగనంపిన పిమ్మట తిరిగి వెళ్ళిపోదువుగాని లే!"

అని కొంచెం వ్యంగ్య ధోరణిలో తనవెంట రావలసిందని ఆహ్వానించాడు కర్ణుడు మరి నాలుగడుగు లతనితో నడిచి రథందాకా వెళ్ళాడు.

వాసుదేవుడెంతో గౌరవంతో కర్ణునికి తన కుడిచేయి అందిచ్చాడు అతన్ని తన సరసనే రథంమీదనే కూర్చొబెట్టుకున్నాడు

సాత్యకి వారి ధోరణి గ్రహించి మరొక రథం అధిరోహించి వారికి కొంచెం దూరంగా తన రథం నడిపించాడు శ్రీకృష్ణ కర్ణు లెక్కిన రథం నెమ్మది నెమ్మదిగా హస్తినాపుర రాజవీధులు దాటిపోయింది

హస్తినాపుర పౌరులా రథంవైపు చూచి తలకోకవిధంగా మాట్లాడుకున్నారు

"శ్రీకృష్ణుడంతటివాడు స్వయంగా సంధి చేయడానికని వచ్చినా లక్ష్యపెట్టక కౌరవులాయనమాటలు పెడచెవిని పెట్టారే! వీరి మూలంగా ఇంకా ఎంత జనక్షయం కాగలదో గదా! అహా! ఇలాంటివా రొక్కడైనా ఉన్నారా?"

ఆ విధమైన ప్రసంగా లప్రయత్నంగా పౌరజానపద సమూహాలలోనుండి వెలువడి గుసగుసలుగా రొదగా నాలుగువైపులా వ్యాపించాయి క్రమంగా శ్రీకృష్ణ కర్ణు లెక్కిన రథం హస్తినాపురం పొలిమేర దాటి దూరంగా వెళ్ళిపోయింది.

శ్రీకృష్ణుడంతవరకు కర్ణునితో ఇష్టాగోష్ఠి ప్రసంగం సాగిస్తూనే ఉన్నాడు ఆ ప్రసంగం చల్లచల్లగా తానుద్దేశించిన విషయానికి తీసుకువచ్చాడు

"కర్ణా! నీవు ధర్మవేత్తవు పెద్దలమాటలంటే, అత్యంత గౌరవం కలవాడవు!"

అని కర్ణునివైపు చూచి ఒక చిరునవ్వు నవ్వాడు. కర్ణునికి శ్రీకృష్ణు డీవిధంగా ప్రసంగం మార్చివేయడానికి కారణమేమో తెలియలేదు అలాగే జిజ్ఞాసాదృష్టితో శ్రీకృష్ణుని మాటలు విన్నాడు

శ్రీకృష్ణుడు నెమ్మదిగా కథలోకి దిగాడు

"నీవు మంత్రబలంవల్ల మార్తాండునికీ, కుంతీదేవికీ జన్మించిన కుమారుడవు అంచు చేత పాండురాజు జ్యేష్ఠపుత్రుడవు! ఇది ధర్మానుమతమైన విషయం.

"నేనీవిషయం ఇంకా పాండవుల కెవరికీ తెలియజెయ్యలేదు. వారీ సంగతి గ్రహించిన ఈ తత్క్షణంలో నీ పాదాలకు సాగిలపడగలరు పుత్రమిత్రబంధు పరివార సహితంగా నీకు పట్టాభిషేకం చేసి నీ అడుగులకు మడుగు లొగ్గుతూ ఉండగలరు"

ఆ ప్రసంగం విని కర్ణు డాశ్చర్య సముద్రంలో మునిగిపోయాడు మళ్ళీ వాసుదేవుడు కర్ణుని చెవికి కొంచెం దగ్గరిగా జరిగి తన కర్ణోపదేశం ఉపక్రమించాడు

"స్వయంగా నా హస్తాలతో నేను నీకు పట్టాభిషేకం చేస్తాను సాక్షాత్తు యుధిష్ఠిరుడే యువరాజై నీ రథంమీద నిలబడి సవినయంగా నీకు వింజామరలు వీచుతూండగలడు మేమంతా నీ వెనకవెనకనే అనుసరించి రాగలము ఇంతటి మహామహేంద్ర వైభవం అనుభవించే అదృష్టం నీకు పట్టనున్నది! కొంచెం నిదానించు ఆలోచించుకో!"

అదివిని కర్ణుడొక్క చిరునవ్వు నవ్వాడు "కృష్ణా! నీవు చెప్పిన నా జన్మవృత్తాంతం నే నింతకుపూర్వం కొంచెం చూచాయగా వినకపోలేదు

కుంతీదేవి నన్ను కన్న కనికరమైనా లేకుండా నదిలో విడిచివేసి వెళ్ళిపోయింది సూతునిభార్య రాధాదేవి నన్ను కన్నకొడుకు కన్నా ఎక్కువ ఆప్యాయతతో పెంచి పెద్దవాణ్ణి చేసింది ఇంతవరకు ఆమె నన్ను తన కడుపున పుట్టిన కుమారునికన్నా ఎక్కువ ప్రేముడితో పెంచింది ఇటువంటి సమయంలో నన్నావిధంగా పెంచి పెదవాణ్ణి చేసిన నా తల్లిదండ్రుల ఆశలన్నీ అడియాసలు చేసి ఈ వేళ ఈ విధంగా పాండవులతో చేరిపోవడం ధర్మమేనా? నేను ధర్మవేత్తనని నీవేఅన్నావు నీవు చెప్పినది ధర్మసమ్మతమేనా—?"

శ్రీకృష్ణుడతని మాటలువిని మొట్టమొదట కొంచెం ఆశ్చర్యపోయాడు ఆపైన కర్ణునిపై అతనికిగల ఆదరాభిమానా లినుమడించాయి. తిరిగీ అతనికి బాగా దగ్గరగా జరిగి నెమ్మదిగా చెవిలో ఊదాడు

"నేను చెప్పేది కొంచెం జాగ్రత్తగా మననం చెయ్యి తొందరపడకు నీకు మహాసామ్రాజ్యాభిషేక గౌరవమే కాక మరొక అదృష్టం కూడా కలిసి వస్తుంది ద్రౌపదీదేవి కూడా నిన్నొక ఆరవభర్తగా స్వీకరించగలదు! తెలిసిందా! నామాట విను. జాగ్రత్తగా ఆలోచించుకో!"

అలాగ ఎంతో ఆప్యాయంగా కర్ణుని దగ్గరిగాజరిగి అతిరహస్యంగా చెవిలో ఉపదేశం చేసినా కర్ణుని ముఖం ఎక్కడా చెక్కు చెదరలేదు శ్రీకృష్ణుడతని గాంభీర్యము, గుండెనిబ్బరము, ఔదార్యము చూచి లోలోపల ఎంతో మెచ్చుకొన్నాడు ఇటువంటి మహావీరుడు, ధీరుడు, ఉదారుడు, ధార్మికుడు పాండవుల పక్షాన నిలిచి పోరాడితే పాండవులకు దిగ్విజయం కరతలామలకం కాగలదని ఉవ్విళ్ళూరి పోయాడు

కాని ద్రౌపతీదేవి విషయం ఎత్తగానే కర్ణునికి కలిగిన ఆశ్చర్యానికిక అంతులేదు. శ్రీకృష్ణు డీవిధంగా స్వతంత్రించి ద్రౌపతీదేవి విషయం ప్రసంగించడానికి ఆధారం ఏమోఅని అతడెంతో మథనపడ్డాడు ఎంత

పి. గణపతిశాస్త్రి

★ కర్ణోపదేశం ★

నేపటికీ అతనికేమీ అవగాహన కాలేదు. అనుకొన్నాడు. కాని ఆ భావమేమీ పైకి మాయావి వాసుదేవుడంతటి కైనా తగినవాడే వెల్లడి కానీయలేదు.

౨

అంతలో శ్రీకృష్ణుడు తన్ని తాను తిరిగి హెచ్చరించాడు:

"కర్ణా! నేను చెప్పేవది జాగ్రత్తగా మనసం చేసుకో! నీ హితంకోరి చెబుతున్నాను సుమా!" అని నిశితంగా కర్ణుని విశాలనేత్రాల వైపు చూచాడు. కర్ణుడలాగే నిర్లిప్త దృష్టితో శ్రీకృష్ణునికి సమాధానం ఇచ్చాడు:

"నేను సూతకులంలో జన్మించిన వాడనని తెలిసినా దుర్యోధన చక్రవర్తి నన్నెన్నడించి కించపరచలేదు. తన కుమారుల కన్నా తమ్ముళ్లకన్నా నన్నెన్నో మడుగు లెక్కువగా గౌరవించాడు. పైగా నన్నంగ రాజ్యాధిపతిగా అభిషేకించాడు. ఇంతే గాదు. ఇప్పటికైనా నేనే అర్జునుణ్ణి జయించగలనని నామీద కొండంత ఆశ పెట్టుకుని కూర్చున్నాడు. సరిగా ఇలాంటి యుద్ధప్రారంభ సమయంలో అతన్ని విడిచి పెట్టి వెళ్ళిపోవడం న్యాయ్యమేనా? నీవే చెప్పు!"

అతని వాగ్ధాటివిని వాసుదేవుడు నిరుత్తరుడైనాడు. ఆవిధంగా సమాధానం చెప్పిన అతని నిక ఏవిధంగా పాండవులతో చేర వలసిందని ప్రోత్సహించగలడు:

తిరిగి కర్ణుని ధీర గభీరవాణి శ్రీకృష్ణుని శ్రుతిపుటాలలో మారుమోగింది:

"నేను, అర్జునుడు ఒకరొకరితో పోరాడక తప్పదు. మా యిద్దరి యుద్ధము విధి విహితము. మేమిద్దరము ఒకరొకరి కెదురుగా నిలిచి పోరాడగలమని పృథివిలో గల జనానీకం అంతా ఎదురు తెన్నులు చూస్తున్నారు. ఇలాంటి విషమ సమయంలో నేను పాండవులతో చేరిపోతే వారంతా విరగబడి నవ్వరా! నేను పాండవులలో చేరినపక్షంలో అది అర్జునునికే అపకీర్తి! ఇక నామాట వేరే చెప్పాలా?"

అతని ధీర చిత్తవృత్తి చవిచూచిన శ్రీకృష్ణుడు తిరిగి ఏదో చెప్పబోయాడు.

తిరిగి కర్ణుడందుకొన్నాడు.

"నేను తన కన్నగారినని తెలిస్తే ధర్మరాజిక ఏ మొహం పెట్టుకొని రాజ్యభారం వహిస్తాడు? కాని ధర్మమూర్తి అయిన ఆ ధర్మాత్ముడే పృథివీ రాజ్యభారం వహించగల సమర్థుడు. సర్వులకు అదే శ్రేయస్కరం!"

కర్ణుడీవిధంగా నిర్లిప్తంగా, నిష్కర్షగా ప్రసంగించగలడని కృష్ణుడూహించలేదు. 'చివరికి ధర్మరాజే జయించగలడని కర్ణుడే అంగీకరిస్తున్నాడే! ఇదేమిటీ విచిత్రం!'

అని అలాగే విస్తుపోయి కర్ణుని వైపు చూచాడు. కుంతీపుత్రుడంతటితో తన ప్రసంగం ముగించలేదు:

"శ్రీకృష్ణా! నేనింకొక ముఖ్యవిషయం నీ కెరిగిస్తున్నాను. నాకీసంగతి తెలియ

వ్రాయని కవిత

మహాకవికి సన్మానం జరుగుతోంది. ఇంకో మహాకవి ఉపన్యసిస్తూ ఇలా అన్నాడు.

"మహాకవి కవిత్వమంటే నాకు చాలా ఇష్టం. నేను ఆయన పద్యాలు చాలామటుకు జాగ్రత్తగా చదివిచూశాను. చదివిన మీదట నాకేమనితోచిందంటే, ఆయన మంచి ఉత్సాహంగా పద్యాలు రాయగలరు; మంచి శక్తిగలవారు. వెనకటికి కీట్సు శ్రుతగానంకంటే అశ్రుతగానం మధురతరమన్నాడు. మన మహాకవి పద్యాల్లోకూడా జాగ్రత్తగా వెతగ్గా కొన్ని మంచి పద్యాలు కనిపించాయి. ఆయన ఏకారణం చేతనో వాటిని రాయకుండా వదిలేశారు."

"అవి ఆయన రాయలేదని మీకెలా తెలిసింది?" అని సభలోంచి ఒకరు ప్రశ్నించారు.

"నేను రాశానుగనక," అని సమాధానం.

దని భావిస్తున్నావేమో! అది సరికాదు. నాకన్నీ తెలుసును ఈమహాయుద్ధయజ్ఞంలో ధర్మరాజు కౌరవ పశుసంహారం చెయ్యబోతున్నాడు. దానికి నీ వుపద్రష్టవు ధర్మపుత్రుని సహోదరులంతా ఋత్విక్కులు. ఇది అవశ్యము జరగబోయేవిధినిర్ణయము! ఇదంతా నాకు తెలియకపోలేదు.

ఆ యుద్ధ యజ్ఞంలో పవిత్రమైన కురుక్షేత్రంలో మడిసిన మావంటివారంతా అవలీలగా పుణ్యలోకాలకు చేరుకోగలరు! ఇదఅంతా నాకింతకుముందే తెలుసును! అందుకనే నీమాట చెవిని పెట్టదలుచుకోలేదు. అంతే!"

అతి జావిధంగా నిష్కర్షగా మాట్లాడిన తరువాత శ్రీకృష్ణుడిక ఏమనగలడు? అందుచేత నెమ్మదిగా బుజ్జగిస్తూ బతిమాలుకొన్నాడు:

"నాయనా! కర్ణా! ఎంతచెప్పినా నీవు నామాట వినకుండా ఉన్నావుగదా! చివరికిదంతా నీకొక మహాసంతాప కారణంగా పరిణమించగలదుసుమా! అర్జునునిపై పట్టరాని రోషంతో నీ వివిధంగా వెనకముందులు చూచుకోకుండా మాట్లాడుతున్నావు నీ వతనితో యుద్ధంచేసినపక్షంలో పరాజయమో మృత్యువో సంప్రాప్తించి తీరుతుంది. అంతే! నేను రథసారథినై ఉండగా అర్జునుణ్ణి జయించడం నీతరమా? ఏమైనా చిట్టచివరికి పాండవ విజయం తథ్యం!

"సరే దానికేమిగాని ఇక ఏడెనిమిది రోజులలో అమావాస్య రానున్నది. అప్పటికి కౌరవులనందరినీ యుద్ధసన్నద్ధులు కావలసిందని హెచ్చరించవలసింది!"

అయినా కర్ణుడు చలించలేదు.

"వాసుదేవా! నాకింతకుపూర్వమే కొన్ని అపశకునాలు కనిపించాయి అవి చూడగానే యుద్ధం తప్పదనీ, దానిలో కౌరవపరాజయం తప్పదనీ నిశ్చయించాను.

ఇంతకీ దీనికంతటికీ నేను, దుర్యోధనుడు, శకుని కారణభూతులం గదా! ఇలాంటివాణ్ణి నేనెలాగ పాండవులతో చేరగలను! నీ విక నాకేమీ చెప్పవద్దు! నేనిక నీమాట వినేదిలేదు."

అని కర్ణుడు శ్రీకృష్ణుని సగౌరవంగా కౌగలించుకొని అతనిదగ్గర సెలవుతీసుకొన్నాడు 'ఈ యుద్ధసముద్రం ఈది బయటపడినతరవాతనో, పరలోకంలోనో, నీ పునర్దర్శనం!' అని తన రథం ఎక్కి హస్తినాపురానికి మరలిపోయాడు.


3

ఆ మరునాడు కర్ణుడు తెల్లవారుఝామునే లేచి భాగీరథీ నదీతీరానికి వెళ్ళి స్నాన సంధ్యాదుల నిర్వర్తించుకొని మహామంత్ర జపం చేసుకొంటూ నిశ్చలధ్యాన ముద్రలో మునిగిపోయాడు.

కృష్ణుడు తిరిగివెళ్ళిపోయినప్పటి నించీ పాండవులపై కర్ణుని క్రోధావేశ రోషాలు తెలుసుకొని కుంతీదేవి లోలోపల కుమిలిపోతూనే ఉంది. అతడు కేవలం పాండవ సంహారం కోసమే యుద్ధోత్సాహంతో ఉర్రూతలూగుతున్నాడని కూడా ఆమె ఎరుగును కనక నెమ్మదిగా అతనిని వెతుక్కుంటూ అక్కడికి వచ్చింది ఆనాడు కర్ణునికి జన్మవృత్తాంతం వెల్లడించి నెమ్మదిగా పాండవపక్షంవైపు తిప్పివేసుకోవాలని నిశ్చయించింది. అతని జపం ముగిసేవరకు అలాగే అతనికి వెనకగా నిలబడి జపావసానకాలం నిరీక్షించింది.

కొంతసేపటికి కర్ణుడు తన జపం చాలించి లేచి నిలుచున్నాడు. వెంటనే కుంతీదేవి అతని కెదురుగావచ్చి నిలబడింది.

చూచీ చూడగానే కర్ణుడామెకు సాష్టాంగ నమస్కారం చేశాడు. సాష్టాంగ నమస్కారంచేసి వారందరు తమ కుల



సాముద్రికం

చిత్రకారుడు: శ్రీ వడ్లమాని మధుసూదనరావు, హైదరాబాదు.

★ కర్ణోపదేశం ★

గోత్రాలు తల్లిదండ్రుల నామధేయాలు చెప్పుకోవడం ఒక అనూచాన సంప్రదాయం.

కర్ణుడు కృష్ణుని నోట తన తలి దండ్రుల విషయం విన్నాడు. అయినా కుంతీదేవికి సాష్టాంగ నమస్కారం చేసే సమయంలో పెంచిన తల్లిదండ్రులైన రాధాసూతుల నామధేయాలే చెప్పుకున్నాడు గాని కుంతీదేవి పేరైనా స్మరించలేదు. అది కుంతీదేవి గుండెలో పొడిచింది.

ఆమె దగ్గద స్వరంతో మెల్లది మెల్లదిగా ఆజన్మరహస్యం అంతా అతనితో చెప్పివేసింది.

"నాయనా! నీవు రాధ కొడుకనే అప్రతిష్ఠ ఈనాటి నుంచీ తొలిగిపోతుంది! ధార్తరాష్ట్రాదులకు, ధర్మరాజాదులకు తగిన ప్రభుత్వం నెరపవలసిన వీరమూర్తివి కనీవే నాయనా! నీవీ విధంగా నేను చెప్పినట్టు ప్రవర్తిస్తే నా హృదయానికి హాయిగా ఉంటుంది. ఇది నీకు నీ సోదరులకు నాకు శుభదాయకమైన రహస్య విషయం. నా మాట తీసి వెయ్యకు నాయనా!"

ఆపైన కుంతీదేవి కంఠం గద్గదికతో స్తంభించిపోయింది. తర్వాత ఆమె అక్కడే ఆ ఇసుక తిన్నెలో అలాగే చదికిల బడి పోయింది.

ఆమె దైన్యావస్థ తిలకించగానే కర్ణుని హృదయం తరుక్కుపోయింది. నిశ్చల భాగీరథీనదీజలాలలో ప్రతిఫలించిన సప్తర్షి నక్షత్రాల ప్రతిబింబాలు నిశ్చలంగా వారి వైఖరి పరిశీలించాయి. దూరదూరంగా కీచురాళ్ళ మోత గంభీరంగా మార్మోగింది.

కర్ణుడు సూరుడుని ఒక్క వేడి నిట్టూర్పు విడిచి పెట్టాడు:

"అమ్మా! జన్మించిన క్షణంలో నేను నీవు క్షత్రజాతి సముచితమైన సంస్కారాలకు తగిన కుమారుడుగా భావించలేదు! ఆనాడా విధంగా నన్ను నట్టేట విడిచివేశావే! ఇక ఈనాడు నీ యెడల నా పుత్రధర్మం నిర్వర్తించవలసిందని ప్రార్థిస్తున్నావా? ఇదెక్కడ ధర్మం తల్లీ!"

కుంతీదేవి తిరిగీ ఎంతో దీనంగా అతని వైపు చూచింది. మళ్ళీ కర్ణుడు సవినయంగా విన్నవించుకొన్నాడు:

"అర్జునుడు మహావీరుడని విశ్వ విఖ్యాతుడైనాడు. ఈనాడు నేను కుంతీదేవి కుమారుడనని అతని పంచన చేరితే అతనికి జడిసిపోయానని నన్నందరు గేలి చెయ్యరా?

"కౌరవుల అన్నం తిని పెరిగి పెద్దవాడనైన నేనీనాడు వారిని విడిచి వెళ్ళిపోవడం ధర్మమేనా?"

అంతలో కర్ణునికేమి స్ఫురించిందో! అతని ముఖంలో బొమముడి మూడు ముళ్లు పడింది:

"అమ్మా! నీవెన్ని చెప్పినా సరే దుర్యోధన చక్రవర్తి సరసన నిలబడి నేను నీ కుమారులందరితోను పోరాడి తీరవలెనని నిశ్చయించుకొన్నాను ఈ నిశ్చయానికిక తిరుగులేదు! అంతే!"

అని భాగీరథీ నదివైపవలోకించి కర్ణుడేదో ఆలోచించాడు. ఎంతో మథన పడ్డాడు. అంతలోనే అతని హృదయ కోంచెం ద్రవించింది:

"అమ్మా! నీవింత శ్రమపడి నన్ని విషయం అభ్యర్థించడానికి ఇక్కడికి విచ్చేశావు. కనక అర్జునుడు తక్క ఇంక ఇతరపాండవు లెవరు నా చేత చిక్కినా వారి నందరినీ సంహరించకుండా విడిచివేస్తాను. సవ్యసాచి పేరెత్తితే నాలో క్రోధాగ్నిజ్వాల రాజుకుంటూంది. నా చేతికి చిక్కితే నే నతణ్ణి సంహరించి తీరవలసిందే!

"ఒకవేళ అతడే నన్ను సంహరించినా అది నాకెంతో విఖ్యాతి కారణమే! ఈ రెండిటిలో ఏదో ఒకటి అవశ్యము జరిగి తీరవలసిందే!

నేను మిగిలినా, అర్జునుడు మిగిలినా నీకిక అయిదుగురే కుమారులనుకో! అంతేగాని నీకిక ఆరుగురు కుమారు లుండబోరు! ఇది ముమ్మాటికీ నిశ్చయం!"

ఆ మాటలు విని కుంతీదేవి అతని కట్టెదుట కుమిలి కుమిలి ఏడ్చింది:

"నాయనా! కర్ణా! దుర్విధి నిర్ణయం ఇంతే కాబోలును. ఇక నే నేమి చెయ్యగలను. సరే. అలాగే కానీ! నీవు మహాసత్యసంధుడవని పేరుకెక్కినవాడవు. నీవిచ్చిన మాటమాత్రం మరిచిపోకు సుమా!"

అని కుంతీదేవి మెల్లది మెల్లదిగా అడుగులు వేసుకుంటూ తన భవనానికి మరలి పోయింది.

రక్తారుణమైన సూర్యబింబం భాగీరథీనదిలో ఉదయించింది. భాగీరథి అంతా ఒక రుధిరధారా మహానదిగా ప్రవహించింది. దూరదూరంగా కౌరవరాజ సౌధాగ్రంలో యుద్ధదుందుభి గంభీరంగా, నిర్విరామంగా మార్మోగింది. ★

జీవితపు విలువలు

భమిడిపాటి జగన్నాధరావు

ఒక్కగా నొక్క పిల్ల వున్న తలిదండ్రులు ఆ పిల్లని చాల ముద్దుగా, మురిపెంగా పెంచుకుంటారు.

ఒకే ఒక పిల్లవున్న వాళ్ళకి చాలా డబ్బు వుంటుంది మామూలుగా

రేఖ తండ్రికి ఆయన తండ్రి బోలెడంత సంపాదించి ఇచ్చి 'వెళ్ళాడు.'

ఆమె హైస్కూలు చదువు అవగానే రేఖ తల్లి "మంచి సంబంధం చూసి పిల్లదానికి పెళ్ళి కాస్త అయిందనిపించేయకూడదూ?" అనుకుంది.

అనుకున్న సంగతి కాస్త భర్త చెవిని వేసింది.

"పిల్ల ఏమంటుందో కనుక్కోనీ... అసలు అప్పుడే ఎందుకోం దేమో" అన్నాడు తండ్రి ధలోక్తిగా.

"పూగకో నాన్నా నువ్వెప్పుడూ ఇంతే" అనలేదు రేఖ.

ఊహు సిగ్గుపడి పోయి 'ఇదైపోయిం దన్న విషయానికి కూడా సమ్మ దగినంత సాక్ష్యం లేదు. చెక్కిళ్లు ఎఱ్ఱబడ్డాయనడానికి కూడా దాఖలా లేదు

మొత్తంమీద మోతాదుగా సిగ్గుపడే వుంటుంది.

"సరేయింకా ... అమ్మాయి తల్లి మాటలు. అప్పుడే ఎందుకోసం పోనాటా" అంది తల్లి.

"తొందరెందుకు. చదువుకోనీ.... కాలేజీలో చేర్పిద్దాం"

కాలేజీలో చేరగానే రేఖ తన అందాని కున్న విలువ చాలా మట్టుకు తెలుసుకొంది.

"కాలేజీలో కల్లా రేఖ అందం చాలా గొప్పది" అనుకున్న వాళ్ళు చాలామంది.

అనుకున్న వాళ్ళు వూరుకోలేక పోయారు — ఎంతో మధురంగా ప్రేమలేఖలు సాగించారు

మొదట్లో ఆ వుత్తరాల కట్టలు చూసి ఆమె కంగారుపడినా, రానురాను అలవాటు పడిపోయింది.

ఏదో కామాయనమంతా మూడు ముక్కల్లో చెప్పినట్టుగా అన్ని వుత్తరాల్లోనూ సారాంశమొకటే "నీ అందం చాలా గొప్పది. నా హృదయం నీ కర్పిస్తున్నాను నన్ను కనికరించవూ" అని.

కొన్ని కాంపుల్ గా చదివి తర్వాత మానుకుందామె

ఉత్తరాలద్వారా కాకుండా ఎదురుగుండా వచ్చి చెబితే తనకి నచ్చితే ఒప్పుకోడానికేమీ అభ్యంతరం లేదామెకు.

ఈ సంగతి ఆమెకు తెలిసినంత బాగా ఇతరులకు తెలీకపోడం చేత వచ్చిన బాధ ఇది.

2

ఇంటర్ పాసై బి. ఏ. లో చేరిన రేఖకి గొప్ప సమస్య వొచ్చి పడింది క్లాస్ మేట్ చంద్రశేఖరం తన్ని ప్రేమించానని చెప్పలేదు తను అతన్ని ప్రేమిస్తోందో లేదో ఆమెకే తెలీదు అతను తియ్యగా మాట్లాడుతాడు. గొప్పగా కవిత్వం రాస్తాడు.

అతని కవిత్వం చూసి ఆమె తలకిందులవలేదు...అతను రాసింది చాలమట్టుకు ఆమె కర్థంకాలేదు ఏంచూసి అతన్ని మొదట్లో తనతో అంత చనువుగా మాట్లాడనిచ్చిందో ఆమె తర్వాత ఆలోచించినా తెలిసికోలేకపోయింది.

ఉత్తరాల్లో విసిగెత్తిపోయిన రేఖ మొదటి సారిగా ధైర్యంగా కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడిన శేఖరాన్ని మెచ్చుకోకుండా వుండలేక పోయింది...అది ఆమె వయసులోని శక్తి అది తెలీక ఆమె ఎందుకు శేఖరంతో చనువుగా వుంటున్నానని ఆమె చాల మాట్లు ప్రశ్నించుకొంది.

శేఖరాన్ని రేఖకి మొదటిసారిగా ఆమె ఫ్రెండు 'సుశీ' పరిచయం చేసింది. "చాలా బాగా కవిత్వం రాస్తాడు మా కజిన్"

ఆ రోజున అతను మాట్లాడిన విధం చూసి రేఖ ఆశ్చర్య పోయింది. ఎన్నాళ్లనుంచో పరిచయమున్న వాడిలా మాట్లాడాడు.

"శేఖరం రాసిన కవిత్వం వింటావా" అంది సుశీ.

"ఇప్పుడొద్దు. మూడ్ లో లేను" అన్నాడు శేఖరం.

"మా ఇంటికి సాయంత్రం 'టీ' కి రండి— అక్కడ వీలుగా వుంటుంది" అంది రేఖ.

అంతే. 'ఎరేంజ్' చేసిన రేఖకి చాలా ఆశాభంగమైంది-సుశీ వొచ్చి "నేనివాళ రాలేను" అని శేఖరం చీటీ పంపించాడంది.

రెండోరోజు క్లాసులో "ఎందుకు రాలేకపోయారండీ" అంది.

"చెప్పమంటారా?"

"అభ్యంతర మేతే వొద్దు"

"అభ్యంతరం వుండని కాదు గానీ... చెప్పలేను"

ఈసారి మరీ ఆశ్చర్య పడింది రేఖ. తనింటకి రమ్మంటే అనుకొన్న టైముకంటె గంట ముందొచ్చే వాళ్ళు లక్షుల మంది వున్నారు. పిలిస్తే రాకపోయి పైగా కారణం చెప్పలేదు.

"పోనీ రేపురండి"

"ష్యూర్ — రేపు సాయంత్రం ఐదు గంటలకి"

3

సరిగా ఐదు గంటలూ అయింతర్వాత వచ్చాడు శేఖరం. టీ తాగుతూ "మీ రచనలు తెచ్చారా?" అంది.

"అవి ఎందుకు?...మిమ్మల్ని చూస్తుంటే కవిత్వ మొస్తుంటే"

చాల ఖంగారు పడింది రేఖ. అంతమాటఅని అలా కళ్ళల్లోకి మాస్తాడే? తల దించుకొని ఎత్తితే అతని కళ్ళతో తన కళ్ళు ఎక్కడ కలుస్తాయోనని—


"పంచదార కావాలా? అంది.

"వద్దు. ఇప్పటికే చాలా మధురంగా వుంది— ఇక భరించలేను."

టీ తాగి పనుంటంటూ ఐదు నిమిషాల్లో వెళ్ళిపోయాడు శేఖరం.

పెద్ద "ప్రాబ్లమ్" ఐంది అతని ప్రవర్తన రేఖకి.

ఆ తర్వాత వాళ్లు చాలా మాట్లు కలుసుకొన్నారు. ఓ రోజున హాతాత్తుగా



జీవితపు విలువలు

అన్నాడు శేఖరం: "మీ కళ్లల్లో భరించలేనంత కాంతి వుంది. నాకేసి తిన్నగా చూడండి... నేను ఆ కాంతిని ఎంతవరకూ తట్టుకోగలనో చూడాలని వుంది."

ఆమె వెనక్కి తిరిగింది చురుగ్గా.

"అదీ! అలా కోపంతో ఆ కళ్ళు మెరుస్తుంటే కవిత్వ మెవరికైనా అబ్బుతుంది."

ఉన్న కోపం కాస్త కరిగిపోయి ఫక్కున నవ్వింది రేఖ.

"ఎలాగైన ఆడదానివనిపించుకొన్నావ్— ఐనా హృదయమంతటితో అలా నవ్వడం ఎంతమందికి చేత నవుతుంది" నవ్వుతూ అన్నాడు శేఖరం.

"నాతో కవిత్వం మాట్లాడక తిన్నగా మాట్లాడకూడదూ? అర్థమైనా అవుతుంది."

"ఐతే చెవులో చెప్తా."

ఒక్క క్షణం దూరాన్నించి చూసింది.

మరుక్షణం దగ్గర కొచ్చింది.

ఆమె చేతి నతడు తన చేతిలోకి తీసుకున్నాడు అతని వేళ్లు వణుకుతూన్న ఆమె వేళ్ళని తాకుతున్నాయి.

అతని ఊర్పు ఆమె చెంపల్ని కాలుస్తోంది.

అతని పెదవు లామె చెక్కులపై ఆనీ ఆననట్లు ఆనాయ్.

చెంప చెళ్లుమంది

గాజులు గలగల మన్నాయి.

గాజు ఒకటి పగిలి కిందపడి మిగతా ముక్క అర్ధ చంద్రాకృతిలో ఆమె చేతి నంటి పెట్టుకొనివుంది

శేఖరం కంగారు పడలేదు. చెంప తడుముకొన్నాడు.. క్షమాపణ కోరలేదు— కోరవలసింది ఆమె అన్నట్టుగా వున్నాయతని చూపులు.

కుర్చీలో కూచుని నిశ్శబ్దంగా సంధ్యకేసి చూస్తున్నాడు.

"ఎలాగైనా ఆడదానివనిపించుకొన్నావ్" అన్నాడు శేఖరం కొంచెం క్రితంసేపు, మళ్లా ఈ సారి అనిపించుకొంది. ఆ 'వీక్‌నెస్' స్త్రీలో సహజం.

"కోపమొచ్చిందా .. అంత సులభమనుకున్నావా?" అంది దగరకొచ్చి ఎరుపెక్కిన చెంప చూస్తూ.

"ఆడదాని హస్తాలు మృదువనుకోవడమే కాని— వాటి దెబ్బతింటే కాని నిజం బైట పడదు"

నవ్వు ఆపుకోలేక పోయింది రేఖ "మరి నా హస్తాల మృదుత్వం ఓనాడు వర్ణించావే

"అదంతా ఊహ— ఇది అనుభవం" అంటూ లేచి వెళ్లిపోయాడు.

వెళ్ళిపోతూ వెనక్కి తిరిగి చేత్తో చెంప నిమురుకున్నాడు.

చేతులు చూసుకొని విరిగిన గాజుని చేసు నుండి తీసి పారేసింది రేఖ.

గాజు గీసుకొని రక్తం చారలా పాకింది.

4

శేఖరం గురించి ఆలోచించినకొద్దీ రేఖకి అతను దూరమై పోతున్నాడు. అతనిలో పెద్ద ఆకర్షణేం లేదు - అది రేఖకి బాగా తెలుసు. మరి ఎందుకు తనంత చనువిచ్చింది.

అతను ఆమె వెంట ఏనాడూ తిరగలేదు. ఒక్క లెటర్ రాయలేదు. ఎదురుగా వచ్చి అనుకున్నది మాట్లాడేవాడు.

కొంచెం దూరం పోయాడు.

దెబ్బ తిన్నాడు.

తమ పరిచయం సింహావలోకనం చేసి కొంటే అంతకంటే కొత్త ఏం కనపళ్ళేదు- రేఖకి.

ఆ తర్వాత ఆమె అతన్ని రానివ్వలేదు- అతను మానలేదు.

దసరా శెలవులు వచ్చాయి.

"ఎప్పుడు వెళ్తున్నారు మీవూరు"

"రెండురోజుల్లో"

"వచ్చేటప్పుడు చక్కని కథ వొకటి రాసి పట్టుకురావాలి."

"ఇక రానేమో ఈవూరు" దూరంగా చూస్తూ అన్నాడు శేఖరం.

"ఏం?"

"ఇక్కడ వుండవలసిన అవసరం కనిపించడం లేదు." అంటూ వెళ్ళిపోయాడు.

రానన్న శేఖరం శెలవలవగానే వచ్చాడు. మనిషిలో నీరసం బాగా కనబడింది.

"రానన్నవారు వచ్చారే?"

శేఖరం మాట్లాడలేదు.

"మౌనవ్రతమేమైనా పట్టారేమిటి?" అంది రేఖ సన్నగా నవ్వుతూ.

"లేదులెండి. ఈ శెలవల్లో మా నాన్న పోయారు. పెద్దవాణ్ణి నేనేగదా-ఏదో జీవనోపాధి చూసుకోవద్దూ, ఈ చదువు పూర్తి చేసి" చాలా తాపీగా చెప్పాడు.

అంత నిబ్బరంగా మాట్లాడేవాడికి ఎలా సానుభూతి పల్కాల్లో రేఖకి తెలీలేదు.

"మా ఇంటికో సారి సాయంత్రం రండి. నాకూ ఏం తోచడం లేదు-నాన్నా అమ్మా ఎదో పెళ్లికి వెళ్లారు" అంది సంభాషణ మార్చాలని.

సాయంత్రం శేఖరం చేత్తో ఓ పుస్తకం, ఫైలుతో సహా వచ్చాడు.

"ఏమిటా పుస్తకం?"

"ఎస్ట్రాలజీ"

"మీకు వచ్చా?"

"ఏదో హాబీ"

"అయితే నా చేయిచూసి చెప్పండి" అంది చేయిచాస్తూ.

ఆమె చేయి చేతుల్లోకి తీసికొని "ఈపిల్ల ఈ చేతో ఓ రోజున చచ్చేటట్టు ఒకణ్ణి కొడుతుంది" అన్నాడు శేఖరం సీరియస్‌గా.

"మళ్లా కొడుతుందా?—ఓమాటు బెందిగా."

"మళ్ళా కాదు...ఒక్కసారే వీలవుతుందామెకు."

"మరి అంత జ్యోతిషం తెలుసున్న వారు వళ్లు జాగ్రత్తలో ఎందు వుంచుకున్నారుగాదో!"

"జ్యోతిష్కుడు ఇతరుల సంగతి చెప్ప గలడు గాని తన సంగతి తెలిసికోలేడు"

"సరే లెండి కాని నా సంగతి చెప్పండి పోనీ"

"త్వరలోనే వివాహ యోగముంది"

"ఆహా! అలాగా!"

"ఇద్దరు పిల్లలు"

"సరేలెండి...చాలిక జ్యోతిషం. ఏం రాశారు ఈ శెలవల్లో?"

"ఈ చేతు లెంత సున్నితంగా వున్నయో చూడ్డానికి" అన్నాడు శేఖరం చేయి వదలకుండానే.

"చూడ్డానికి మాత్రమేనా?"

"కాకపోతే — వాట్ల ధాటి చవిచూశానుగా"

ఏదో తప్పు చేసినట్టుగా ఫీలయింది ఆ మాటతో రేఖ. అతను ఎడమ చేత్తో ఆమె చెయ్యి పట్టుకొని కుడిచేత్తో ఆ రేఖలు చూస్తున్నాడు.

చేయి తీసేసుకోలేక పోయింది రేఖ-అది మొదట గ్రహించినవాడు శేఖరం.

తల ఎత్తి సూటిగా చూసిందామె.

"ఆకళ్ళలో ఎంత అమాయకత్వముందనీ..." అంటూ శేఖరం ఆమె కళ్ళల్లోకి చూశాడు.

అతని చేతుల్లో ఆమె చేతులు.

ఆమె కళ్ళల్లో సూటిగా అతని చూపులు.

ఆమె అలావుండి పోయింది.

అతడు ఆమె దగ్గరగా జరిగి ఆమె వదనాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. రేఖ చైతన్య విహీనంగా వుండిపోయింది... ఏదీ ఆలోచించుకోలేని పరిసితి...ఇప్పటికే ఆలస్యమయి పోయింది. లొంగిపోతున్నట్టుగా ఫీలయింది—దూరంగా జరగడానికి ప్రయత్నిస్తూ.

కింద తలుపెవరో ధడా ధడా బాదుతున్నారు.

దిగ్గున లేచి విడిపించుకొంది...కోపంగా చూస్తూ. కంగారుగా వున్నాడు శేఖరం.

"ఎవరై వుంటారు?" అన్నాడు.

"ఏమో. చూస్తానిప్పుడే"

"మీ నాన్నగారూ వాళ్ళూ నేమో?"

"అవునను కుంటా...ఈసాయంత్రం వస్తామన్నారు" అంటూ కిందికి దిగి వెళ్ళింది.

"మా అక్కయ్య మీకీ పత్రిక ఇచ్చెయమంది" అంటూ ఓ పదేళ్ళ కుర్రాడు పత్రిక ఇంట్లో పడేసి పరుగెత్తి వెళ్ళిపోయాడు.

పైకొస్తూ రేఖ అనుకుంది "ఈ సారైన శేఖరానికి తగిన బుద్ధి చెప్పాలి."

పత్రికతో పైకొచ్చిన రేఖకి శేఖరం కనిపించలేదు. ఆశ్చర్యంతో చుటూ చూసి కిందికి వెళ్లింది—వంటగది తలుపు తెరిచివుందిన దొడ్డివేపు తలుపూ తెరిచే వుంది. దొడ్లోకి వెళ్ళి తలుపు వేసివస్తూ అతని ప్రవర్తకామె ఆశ్చర్యపడింది. "నాన్నా వాళ్లూ వచ్చారనుకొని ఇలా వెళ్ళిపోయాడన్నమాట."

ఇంట్లోకి వస్తూ వంగి గులాబీ మొగ్గ కోస్తుంటే పక్కగా చిన్న పుస్తకం కనిపించింది. చప్పున తీసి తిరిగేసింది...శేఖరం డైరీ—'ఆ కంగారులో వెళ్ళిపోతూంటే జారిపోయిందన్నమాట' అనుకొంది రేఖ మొకైక్కి పైకి వెళి శేఖరం ప్రవర్తనకి ఆశ్చర్యపోతూ యాదాలాపంగ డైరీ తిరగేస్తుంటే 'రేఖ' అన్న పేరు కన్పించింది.

అతని డైరీలో తన పేరు ఎందుకుంది? చూడనా మాననా అనుకొని తనకి సంబంధించినదే గదా అని చదవబోయింది.

ఒకసారి బుద్ధి చెప్పినా వినక మళ్ళా తప్పుగా ప్రవర్తించిన శేఖరం తన్ని గురించి ఏమనుకుంటున్నాడో?...చూడాలి! తప్పేమిటి?—తనకి సంబంధించినదే గదా!

జూలై 25 : రేఖతో పరిచయం. ఆమె అందం కొట్టొచ్చినట్టుగా వుంది. అది నేను 'నోట్' చేసుకున్నట్లు ప్రవర్తించాను. సాయంత్రం టీకి రమ్మని ఆహ్వానం...వస్తానని వెళ్ళలేదు. అలా మొదటిసారి బెట్టు చేస్తేనే ఆమె తోవలోకి వస్తుంది...

జూలై 26 : క్లాసులో నిన్న రాకపోవడానికి కారణం చెప్పలేదు. మన్ని గురించి ఓ విధమైన 'కాంప్లెక్స్' ఆమెకు కలిగితేనే మన మనుకున్నది సానుకూల పడుతుంది...

ఆత్రుత హెచ్చి మిగతా పేజీలు తిరగేసింది.

ఆగస్టు 17 : ఆమె అందాన్ని వర్ణించి ఆమె కళ్ళలోకి చూశాను. తన అందం ఓ పురుషుడి నోటంట విన్న స్త్రీ అతనికి లొంగకేం చేస్తుందన్న ధైర్యంతో దగ్గరగా తీసికొంటె...చెంప పెట్టు పెటింది—కొట్టినా స్త్రీ సహజమైన మార్దవంతో ఒరిజినల్ స్థాయికి దిగిపోయింది. ఐనా లొంగకేం చేస్తుందిలే...

మిగతా రోజుల సారాంశం : ఏలాగా కొంతకాలానికి మచ్చిక చేసుకుంటె లొంగిపోతుంది - అనుమానం లేదు. దొరుకుతుందా

★ జీవితపు విలువలు ★

లేదా అన్న ప్రశ్నే లేదు. పెళ్ళిచేసికో మంటుందా—పిల్ని, పిల్లతో పాటు లక్షల కొద్దీ—ఏదైనా మంచిదే. కొంచెం జాగ్రత్తగా అలుకురాగలుగు తే దొరికిందన్నమాటే! ఇలాంటివాళ్ళు మనలో లెక్కా...!'

ఆ తర్వాత ఆమె ఇక చదవలేకపోయింది.

ఎంత హీనంగా ఆలోచిస్తున్నాడు!

మానవత్వమనేది లేదేమో ఈ మనిషిలో!

పెద్దకవిత్వం రాస్తాడు-ఎంత కల్మషముందీ ఆ మనసులో!

పిల్లదొరికినా, ఆస్తి దొరికినా - ఏదైనా మంచిదేట!

ఇక ఆపైన ఆమె ఆలోచించలేక కన్నీరు కారుతున్న కళ్లని పెద్దవిచేసి అస్తమిస్తున్న సూర్యుని చూస్తూ వుండిపోయింది."

5

...రంగారావు చాల ఆశ్చర్య పడ్డాడు. శశిరేఖ ఇంత చక్కని కథలు రాస్తుందని అతని కింతవరకూ తెలీదు.

తన భార్యలో ఎంత నైపుణ్యముంది! ఈ సంవత్సరంలోనూ తన కేనాడు తెలీకే!!

"ఏవిటే చదువుతున్నారు" చొరవించి శశిరేఖ అడిగింది.

"అవును కాని శశీ! నువ్వు కథలు రాస్తావని ఎన్నడూ చెప్పలేదే" ఆశ్చర్యపోతూ అడిగాడు రంగారావు.

"కథలా?"

"అమ్మ దొంగా! ఏం తెలీనట్టు అంటున్నావే. కథ ఇంకా పూర్తి చెయ్యలేద... శేఖరం ఏమయ్యాడు?"

"ఏవీ ఆ కాగితాలు...ఆ...సరే... ఏదో తోచక రాశాను - మీ రెప్పుడు చూశారు?"

భార్య వదనంలో ఆతురతకి కొద్దిగా చలించాడు రంగారావు.

"రేపు నీ పుట్టినరోజుగదూ...రాణీగారికి నచ్చే లేతమబ్బు రంగుచీర తీసుకువద్దామని 'డబ్బెక్కడపెట్టేవంటే' బీరువాలో వుందన్నావు పొద్దుట. డబ్బుకోసం చూస్తుంటే ఈ కాగితాలు కనబడ్డాయి-చదివాను. సరేకాని...కథ ఎలా పూర్తిచేస్తావ్"

"కథేనా...మీరే చెప్పండి" అంది శశి.

"రాసిందానివి నీకే తెలియాలికదా..."

"సరే లెండి కథకేమొచ్చెకాని-ఇంట్లో పనుంది"అంటూ వెళ్లిపోయింది. శశి, ఉన్నట్టుండి ఓ ఆలోచన తట్టింది రంగారావుకి.

"సరే కాని రేపు మనింటికో ఫ్రెండు టీకి వస్తాడు" అన్నాడు ఇంట్లోకి వెళ్లి రంగారావు.

"ఎవరు?"

"మా ఆఫీసులో క్లర్కు"

"మేనేజరుగారింటికి క్లర్కు రావడం చాలా కొత్తగావుందే-పేరు?"

"అతనో రచయిత...ఆఫీసులో చంద్రం అంటారు. ఆ రచయితని నీకు పరిచయం చేయాలని"

"అలాగే."

* * *

టీ సరంజాం అంతా రడీగా వుంచి "ఇప్పుడే వస్తానని" ఇంట్లోకి వెళ్ళింది శశి.

ఇంతలోనే చంద్రం వచ్చాడు "హలో బాస్" అంటూ ఆ కంఠంవిన్న శశి కొద్దిగా వణికింది.

"శశీ" కేకేశాడు రంగారావు.

గదిలోకొచ్చిన భార్యనిచూసి "చంద్రశేఖరంగారు...రచయిత....శశిరేఖ" అని పరిచయం చేసాడు రంగారావు.

నమస్కారం చేయబోయి కొంచెం కంగారుపడి తట్టుకొని "చాలా సంతోషం మిమ్మల్ని కలుసుకున్నందుకు" అన్నాడు చంద్రం.

శశి భర్తకేసిచూసింది...అతను కిటికీలోంచి క్రోటన్సుకేసి చూస్తున్నాడు.

కెటిల్ లోంచి టీ పోస్తూ "నాకు కొంచెం తలనొప్పిగావుంది. వెరీ సారీ చంద్రంగారు:" అంటూ శశి ఇంట్లోకి వెళ్లిపోయింది.

...రాత్రి భోజనాలు ముభావంగా జరిగిపోయాయి. శశిరేఖ ఇంట్లో పనిచూసుకు వచ్చేటప్పటికి రంగారావు నిద్రపోతున్నాడు. సన్నగా ఊర్పు వినపడుతోంది.

అమాయకంగా నిద్రపోతున్న భర్తని చూడగానే ఆమెకి దుఃఖంఆగలేదు...వెక్కి వెక్కి ఏడ్చింది.

"నే నేపాపంచేయలేదు. ఏమీ తెలీని చిన్నతనం...నన్ను క్షమించరూ? దేవసాక్షిగా చెపుతున్నాను — నేను ఏతప్పూ చెయ్యలేదు."

ఆమె భర్తహృదయంపై చేతులు పోకరించింది మెల్లిగా అతను లేవకుండా.

"అంత బాధపడ్డావెందుకు శశీ. నిజం పూర్తిగా తెలిసింది నాకు-నీ తప్పేంలేదు" అంటూ చేతులు చాచాడు.

భర్త హృదయంపై తల ఆన్చి ఆనందాశ్రువులు రాల్చిందిశశి "ఒక్కసారి క్షమించార సరూ?"

"తప్పుచేస్తేగదా క్షమించడం - చేయనప్పుడు ఆ ప్రశ్నే లేదు" అన్నాడు ఆమె కన్నీరు తుడుస్తూ.

విచారంతో బరువెక్కిన శశివదనం ఆనంద ప్రపూర్ణమైంది.

"మీలాంటివారు దొరకడం నా అదృష్టం"

"అబ్బో! అప్పుడే మొదలెట్టింది బి. ఎ. తెలుగు పాండిత్యం" అన్నాడు నవ్వుతూ.

"ఉష్! ఆమాటేకవద్దు" అందిశశి భర్త నోటిపై వేలుతాకించి.

"అవును కాని...ఆ కథలా పూర్తి చేస్తావ్?"

"మీలో చెవుంది... ట్రాజెడీ బదులు కామెడీ ఐనా"

"ఇప్పుడు ఏంచెయ్యాలో తెలిసిందిగా" అన్నాడు శశిని దగ్గరిగా తీసుకుంటూ.

"జీవితపు విలువలు తెలుసున్న మీలాంటివారుండగా కథ కామెడీ కాకపోతుందా?" అందిశశి భర్త చేతుల్లో కరిగిపోతూ... ★

అరబ్ రాజ్యాల జాతీయ చైతన్యం

రెండు మహాసంగ్రామాల ఫలితంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలలో జాతీయోద్యమాలు ప్రజ్వలించాయి. మధ్య ప్రాచ్యంలోగూడా ఈ ఉద్యమం తీవ్రంగా సాగింది. 16వ శతాబ్దం మధ్యకాలంలో ఆటోమన్ (టర్కీ) చక్రవర్తులు మధ్య ప్రాచ్యాన్నంతా జయించారు. అప్పటి నుంచీ ఆ ప్రాంతం మొదటి ప్రపంచ సంగ్రామ కాలందాకా వారి అధీనంలోనే ఉంది. ఆ ప్రాంతమంతా అరబ్బులది. పశ్చిమ ఆసియాలోను, ఉత్తరాఫ్రికాలోను అరబ్బీ భాషమాట్లాడేవారు సుమారు నాలుగున్నర కోటమంది ఉన్నారు. సావుదీ అరేబియా, యెమెన్ రాజ్యాల్లో 70 లక్షలమంది, సిరియాలో 30 లక్షలు, ఇరాక్ లో 30 లక్షలు, పాలెస్తీనాలో పదిలక్షలు, ఈజిప్టులో 1,70 లక్షలమంది, సుడాన్‌లో 20 లక్షలు, లిబియాలో 7 లక్షలు, ట్యునీషియాలో 23 లక్షలు, అల్జీరియాలో 60 లక్షలు, మొరాకోలో 50 లక్షలమంది అరబ్బులున్నారు. అరబ్బులలో ఎక్కువ భాగం మహమ్మదీయులైనా సిరియా, లెబనాన్, ఈజిప్టుదేశాల అరబ్బులలో కొందరు క్రైస్తవ మతస్థులున్నారు. ఈ అరబ్బుదేశాలన్నీ వెనుకబడిన దేశాలే. నూటికి 90 మంది విద్యాగంధం లేనివారు. ఈజిప్టుమాత్రమే పారిశ్రామికంగాను, విద్యావిషయికంగాను అభివృద్ధి అయిన దేశము.

అరబ్ జాతీయోద్యమం 1847 లో ప్రారంభమైంది. అమెరికన్, ఫ్రెంచి మిషన్ పాఠశాలలలో విద్యాభ్యాసం చేసిన సిరియన్ అరబ్బులలో ఈ ఉద్యమం ప్రబలింది. అమెరికన్ మిషనరీల ప్రోత్సాహంతో ఒక సాహితీసంఘం జాతీయభావాలను ప్రచారం చేసింది. మధ్య ప్రాచ్యంలో బహిరంగంగాను, రహస్యంగాను అనేకసంఘాలు బయలుదేరాయి. టర్కీ ఆధిపత్యాన్ని నాశనం చెయ్యడమే వీటి ప్రధానలక్ష్యం. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో (1916) మక్కా షరీఫ్ హుసేన్, ఆయనకుమారులూ, ప్రసిద్ధవ్యక్తి యైన కర్నల్ టి. ఇ. లారెన్స్ (బ్రిటిష్) సహాయంతో అరబ్బుల నందర్ని కూడగట్టుకుని టర్కీపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు విజయవంత మైంది. 1918 నవంబరులో బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు మధ్య ప్రాచ్యంలో జాతీయప్రభుత్వా లేర్పరచడం తమలక్ష్య మని ప్రకటించాయి. 1922 నాటికి నానాజాతి సమితి ప్రణాళికక్రింద ఇరాక్, పాలెస్తీనా, ట్రాన్స్‌జోర్డానియాలలో బ్రిటిష్ ఆధిపత్యము, సిరియాలో ఫ్రెంచి ఆధిపత్యమూ ఏర్పడ్డాయి. అరేబియా ఇబిన్ సావుదీ రాజరికం క్రింద స్వాతంత్ర్యం సంపాదించుకుంది. యెమెన్ కూడా స్వతంత్రరాజ్య మైంది. 1914 లో బ్రిటిష్ రక్షకత్వం క్రిందికిపోయిన ఈజిప్టు 1922 లో స్వతంత్ర మైంది.

టర్కీ ఆధిపత్యం నుంచి తప్పించుకున్నా మనుకున్న అరబ్బులకు యూరపియన్ ఆధిపత్యం మెడకు చుట్టుకోవడంతో ఆశాభంగ మైంది.



సావుదీ అరేబియా రాజు ఇబిన్ సావుద్.

ఈజిప్టు

1922 తరవాత ఈజిప్టులో జాతీయోద్యమం తీవ్రమై బ్రిటిష్ ఆక్రమణ సేనలతో ఘర్షణలు జరిగాయి. 1936 లో ఫయద్ రాజు చనిపోయి, అతని కుమారుడు ఫరూక్ రాజయ్యాడు. ఆ సంవత్సరం బ్రిటన్ ఈజిప్టుతో కొత్త సంధి చేసుకుంది. ఈజిప్టుకు సర్వస్వాతంత్ర్యం ఇచ్చేట్లు బ్రిటిష్‌సేనలు ఈజిప్టును విడిచి వెళ్ళిపోయేటు, సూయజ్ ప్రాంతంలోమాత్రం 10వేల బ్రిటిష్ సైన్యం, 400 మంది వైమానికులు మాత్రం ఉండేట్లు, అలెంగ్జాండ్రియా, పోర్టుసయద్ లలో బ్రిటిష్ నౌకా సైన్యం ఉండేట్లు, యుద్ధసమయంలో బ్రిటన్ ఈజిప్టు సహాయానికి వచ్చేట్లు సంధి జరిగింది. ఈ సంధి పరిమితి కాలం 20 ఏళ్లు. ఈజిప్టులో విప్లవ ఫలితంగా ఫరూక్ రాజరికం అంతరించింది. అప్పుడు రిపబ్లికన్ ప్రభుత్వంతో బ్రిటన్ కొత్త సంధి చేసుకుంది. సూయజ్ ప్రాంతం నుంచి కూడా బ్రిటిష్ సేనలు వెళ్లిపోవాలని, 20 నెలల్లో బ్రిటిష్‌వారు అంచెలవారీగా ఖాళీచేయాలని 1954 అక్టోబరు 19న జరిగిన ఈ సంధి నిర్దేశించింది. అరబ్ రాజ్యాలకు యుద్ధ ప్రమాదం సంభవించే పక్షంలో సూయజ్ ప్రాంతంలోకి మళ్ళీ బ్రిటిష్ సేనలను రానివ్వాలనీ, యుద్ధం అయిపోగానే బ్రిటిషు సేనలు వెళ్లిపోతాయనీ సంధిలో మరొక షరతు.

1955 అక్టోబరులో నాసర్ ప్రభుత్వం జెకోస్లావేకియాకు ప్రత్తి, బియ్యం ఇచ్చి, ఆయుధ సామగ్రి తెప్పించుకోడానికి నిశ్చయించింది. బాగ్దాద్ ఒడంబడికలో చేరడానికి నిరాకరించింది. మిగతా అరబ్ రాజ్యాలు చేరకుండా చేయ ప్రయత్నించింది. దీంతో బ్రిటిషువారికి నాసర్ ప్రభుత్వం పై విద్వేషం ప్రబల మైంది. ఈ సంవత్సరం జూలై మాసాంతంలో ఈజిప్టు సూయజ్ ను జాతీయం చేయడంతో బ్రిటిష్‌వారు నాసర్ ప్రభుత్వానికి ఉద్వాసన చెప్పాలనే ఉద్దేశంతో మొదట రాజకీయంగాను, తరవాత సైనికంగాను ఒత్తిడి

(54–వ పేజీ చూడండి)

అరబ్ యూదుజాత



మధ్యప్రాచ్యంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని ఎదిరించి నిలబడిన ఈజిప్ట్ అధ్యక్షుడు నాసర్; బ్రిటిష్, ఫ్రెంచిసేనల దురాక్రమణను తీవ్రంగా ఖండించిన ప్రధాని నెహ్రూ.

ఇజ్రేల్ రాజ్యా

అక్టోబరు మాసాంతంలో ఈజిప్టుపై ఇజ్రేల్ దురాక్రమణ చేసింది. ఇజ్రేల్ సేనలు ఈజిప్షన్ భూభాగంలోకి చొచ్చుకు పోయాయి. ఈజిప్షన్- ఇజ్రేల్ సేనల మధ్య యుద్ధం చెలరేగింది. ఈ యుద్ధం నుంచి, సూయజ్ కాలవను, రక్షించుకున్నామనే నెపంతో బ్రిటన్, ఫ్రెంచి ప్రభుత్వాలు సైన్యాలు పంపాయి. బ్రిటిష్, ఫ్రెంచి సైనిక చర్యలను 64 ఐక్య రాజ్యసమితి సభ్య దేశాలు ఖండించాయి. బ్రిటన్ ఫ్రాన్సులు దురాక్రమణ చేశాయని భారత ప్రధాని నెహ్రూ తీవ్రంగా గర్హించారు. ఈదురాక్రమణ ఫలితంగా మధ్యప్రాచ్యమంతా అటు కికినట్లు ఊడికి పోతోంది. యుద్ధం ఈజిప్టు ఇజ్రేల్ దేశాలకు మాత్రమే కాక మిగతా ప్రాంతాలకుకూడా వ్యాపించే ప్రమాదం ఏర్పడింది.

అరబ్ రాజ్యాల గుండెలపై కుంపటిగా ఏర్పడిన ఇజ్రేల్ యూదు రాజ్యం మొదటి నుంచీ కయ్యానికి కాలుదువ్వుతూనే ఉంది. 1949 లో ఐక్య రాజ్య సమితి అధ్వర్యాన యుద్ధవిరమణ అమలు జరిగిన కొంతకాలం దాకా పరిస్థితి శాంతంగానే ఉన్నట్లు కనిపించింది. సూయజ్ సమస్య సాకు తీసుకొని ఈజిప్టుపై కత్తు వహించిన బ్రిటన్, ఫ్రాన్సుల మద్దతు చూసుకొని ఇజ్రేల్ ఈజిప్టుపై దురాక్రమణ ప్రారంభించింది.

పాలెస్తీనా చరిత్ర

ఇప్పటిఇజ్రేల్ రాజ్యం 1948 మే15వరకూ పాలెస్తీనాలో భాగం. ఆ రోజు వరకూ పాలెస్తీనా బ్రిటిష్ ఆధిపత్యంలో ఉండేది. 10,400 చ. మైళ్ వైశాల్యంగల పాలెస్తీనాలో 11 లక్షలమంది అరబ్బులు, 6 లక్షల మంది యూదులు ఉండేవారు. 1948 మే 14 తో బ్రిటిష్ ప్రభుత్వం తన ఆధిపత్యం (మాండేట్) ఉపసంహరించుకుంది. మే 15 వ తేదీన టెల్ అవీవ్ రాజధానిగా ఇజ్రేల్ రాజ్యం ఏర్పడినట్లు యూదులు ప్రకటించారు.

యూదు ఉద్యమం (జియోనిజమ్) అతి ప్రాచీనమైనది. క్రీ. పూ. 1200లో పాలెస్తీనాను యూదుజాతీయులు జయించి సుమారు 13 వందల ఏళ్లపాటు అక్కడ నివసించారు. క్రీ. శ. 637 ప్రాంతాలకుగాని అరబ్బులా దేశాన్ని ఆక్రమించుకోలేదు. అందుచేత అరబ్బులకంటే తమకే ఎక్కువగా పాలెస్తీనాపై హక్కు ఉందని యూదులు వాదిస్తారు. దాదాపు రెండు వేల ఏళ్లనుంచీ యూదులకు మాతృదేశమంటూ లేదు. ప్రపంచంలో అనేక దేశాలలో వారు చెల్లాచెదరై



ఈజిప్ట్-ఇజ్రేల్ సంఘర్షణ సాకుగా సూయజ్ ప్రాంతంపై దురాక్రమణ సాగిస్తున్న బ్రిటిష్ ప్రధాని ఈడెన్.

...ల అనాది శత్రుత్వం


...సన చరిత్ర

పోయారు. పాలెస్తీనాను తమకు మాతృదేశం చెయ్యాలని ఆధునిక కాలంలో యూదు జాతీయోద్యమం 1897 లో ప్రారంభమైంది. థియొడోర్ హెర్జెల్ ఈ ఉద్యమ ప్రారంభకుడు.

పాలెస్తీనా 1517 నుంచీ టర్కిష్ ఆటోమన్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండేది. మొదటి ప్రపంచ సంగ్రామంలో (1917) బ్రిటిష్‌వారు పాలెస్తీనాను ఆక్రమించారు. ఒక దేశమంటూ లేని యూదులకు పాలెస్తీనాలో శాశ్వత స్థావరం ఏర్పరుస్తామని బ్రిటిష్ ప్రభుత్వం [బాల్ఫోర్ ప్రకటన ద్వారా] వాగ్దానం చేసింది. ఈ వాగ్దానానికి ఇతర 'మిత్ర' రాజ్యాలు కూడా ఒకబడ్డాయి. పాలెస్తీనాను పరిపాలించే అధికారాన్ని నానాజాతి సమితి 1923 జూలై 14 న బ్రిటిష్ ప్రభుత్వానికి అప్పగించింది. పాలెస్తీనాలో బ్రిటిష్ అధికారం ఏర్పడగానే, దేశదేశాలనుంచి యూదులు తండోపతండాలుగా రావడం మొదలెట్టారు శతాబ్దాలుగా తమకు స్థావరంగా



ఈజిప్టుపై అక్రమ యుద్ధానికి దిగిన ఫ్రాన్సు ప్రధాని గై మోలే.



హఠాత్తుగా, పెద్దపెట్టున యుద్ధరంగంగా మారిన సూయజ్ ప్రాంతం, దాని పరిసరాల్లోని అరబ్ రాజ్యాలు, ఇస్రేల్.

ఉన్న పాలెస్తీనాలోకి యూదులీ విధంగా వచ్చి స్థిర పడడం అరబ్బులకు క్రోధ కారణమైంది.

1921 లో అరబ్బులు తిరగబడ్డారు. ఈ తిరుగు బాటును బ్రిటిష్ వారణచి వేశారు. 1923 లో ట్రాన్స్ జోర్డానియాను పాలెస్తీనా నుంచి విడదీసి, వేరే రాజ్యం చేసి దానికొక అమీరును (అబ్దుల్లా) ఏర్పాటు చేసి, తమ ఆధిపత్యం క్రిందఉంచుకున్నారు. ఈ ట్రాన్స్ జోర్డన్ రాజ్యానికి రెండో ప్రపంచ సంగ్రామానంతరం 1946 లో బ్రిటన్ స్వాతంత్ర్యం ఇచ్చివేసింది.

1921 లో అరబ్బుల తిరుగుబాటును అణచివేసినప్పటినుంచీ బ్రిటిష్‌వారు యూదులకు, అరబ్బులకు అంతఃకలహాలు పెట్టి, తమ ఆధిపత్యం నిలుపుకుంటూ వచ్చారు. 1929 నాటికి పాలెస్తీనాలో యూదుల సంఖ్య రెండు లక్షలకు పెరిగింది.

ఆ సంవత్సరం మళ్ళీ అరబ్బులు యూదుల వలసకు నిరసనగా తిరుగుబాటు చేశారు. దానిఫలితంగా యూదుల వలసను తగ్గించడానికి బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది.

యూదుల వలస

జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చి యూదులను హింసించడం ఆరంభించాక పాలస్తీనాలోకి యూదుల వలస మళ్ళీ అధికం కాజొచ్చింది. 1933 లో 9,553 మంది యూదులు వలసవచ్చారు. ఆమరుసటి సంవత్సరం ఈ సంఖ్య హఠాత్తుగా 42,359

★ ఇజ్రేల్ రాజ్యస్థాపన చరిత్ర ★

కు పెరిగింది. ఆపైయేడాది 61,854 కు పెరిగింది. అనుమతిలేకుండా జొరబడిన యూదుల సంఖ్య చెప్పనే అక్కర్లేదు ఇలా వలసవచ్చిన యూదులందరూ ధనాఢ్యులు వీరువచ్చి పెట్టుబడులు పెట్టి బలపడసాగారు. 1936 లో అరబ్బులు మళ్ళీ తిరగబడ్డారు. బ్రిటిష్ సైన్యాలు ఈ తిరుగుబాటును కూడా అణచివేశాయి బ్రిటిష్ ప్రభుత్వం పాలస్తీనా పరిస్థితిని పరిశీలించే నిమిత్తం పీల్ కమీషన్‌ను పంపించింది. 1937 లో పీల్ కమీషను ఒక నివేదికను తయారుచేసింది. ఆనివేదికలో పాలెస్తీనాను యూదు, అరబ్ రాజ్యాలుగా విభజించాలని ఉత్తరాన కోస్తావెంబడే యూదులు నివాసాలేర్పరుచుకున్న భాగాన్ని యూదు రాజ్యాని కిచ్చివెయ్యాలని ఆ కమీషను సలహా ఇచ్చింది. ఈ రాజ్యంలో 20 లక్షల మంది యూదులకు చోటుందని కమీషను అభిప్రాయపడింది. కాని యీ సలహాను అరబ్బులు, చాలమంది యూదులు త్రోసిపేశారు.

1939 మేలో బ్రిటిష్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుంటూ ఒక ప్రకటన చేసింది. పాలెస్తీనాను యూదురాజ్యంగా మార్చబోమనీ, దాన్ని యూదులు, అరబ్బులు కలిసిన స్వతంత్రరాజ్యంగా పదేళ్ల తరవాత స్థాపిస్తామని బ్రిటిషువారు ప్రకటించారు. ఆ రాజ్యంలో యూదుల జనాభా మూడోవంతుకు మించనివ్వమని ప్రకటించారు. ఈ ప్రకటన బాల్ఫోర్ ప్రకటనకు విరుద్ధంగా ఉందని యూదులు తిరస్కరించారు. అరబ్బులుకూడా అసంతృప్తి వెలిబుచ్చారు. చివరికి నానాజాతి సమితికూడా తిరస్కరించింది.

ఇంతలో రెండవ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. యూరప్ అంతటా యూదులపై హిట్లర్ హింసాకాండ తీవ్రతరమైంది. యూదుల వలస మరీ అధికమైంది. యుద్ధానంతరంకూడా ఈ వలస ఆగలేదు. బ్రిటిషు ప్రభుత్వం ఈ వలసను అరికట్టాలని ప్రయత్నించింది. కానియూదు అతివాదులు దౌర్జన్యచర్యలద్వారా బ్రిటిషు వైఖరిని తమ కనుకూలం చేసుకోవాలని భారీ ఎత్తున హింసాకాండ ప్రారంభించారు. చివరికి బ్రిటిషుప్రభుత్వం లాభం లేదని 1947 ఫిబ్రవరి 18 వ తేదీన పాలెస్తీనా సమస్యను ఐక్యరాజ్యసమితికి నివేదించింది.

పాలెస్తీనా విభజన

సమితి పాలెస్తీనాసంఘం 1947 ఆగస్టు 31 న నివేదిక సమర్పిస్తూ పాలెస్తీనాను విభజించాలని సూచించింది. ఈ విభజన పథకాన్ని ఇండియా, పర్షియా, యుగోస్లావియా వ్యతిరేకించాయి. అయినా పాలెస్తీనా విభజన తీర్మానం 1947 నవంబరు ఐక్యరాజ్య సర్వసభ్యసమావేశంలో నెగ్గింది. యూదులకు ఉత్తరాన తూర్పు గలీలీ, మధ్యలోఉన్న కోస్తా ప్రాంతం, నెగివ్ ఎడారి ఇచ్చేట్లు, అరబ్బులకు పశ్చిమగెలిలీ మధ్యలోఉన్న భూభాగము, ఒక నడవతో సహా జాఫారేవు, గాజారేవుతో సహా దక్షిణ కోస్తా ఇచ్చేట్లు నిర్ణయం జరిగింది. జెరుసలెమ్‌ను ఐక్యరాజ్య సమితి పరిపాలనలో ఉంచాలని కూడా నిర్ణయం జరిగింది. దీన్ని అమెరికా, రష్యా బలపరిచాయి. యూదులు అంగీకరించారు. కాని అరబ్బులువ్యతిరేకించారు

బ్రిటిష్ ఆధిపత్యం అంతమయ్యేనాటికి పాలెస్తీనాలో యూదులసంఖ్య ఆరులక్షలయింది. వలసవచ్చిన యూదులు మంచి సమర్థులు. అచిరకాలంలో వీరుకట్టుదిట్టమైన పద్ధతులలో వ్యవసాయ క్షేత్రాలు నిర్మించుకున్నారు. 5 లక్షల ఎకరాల భూమి కొన్నారు. అనేక పరిశ్రమలు స్థాపించారు. ఎడారిగాఉన్న స్థలంలో లక్షా అరవైవేల జనాభాతో టెల్ అవీవ్ నగరం నిర్మించుకున్నారు. హీబ్రూ భాషను పునరుద్ధరించారు. ఆ భాషలోనే విద్యా సౌకర్యాలు వృద్ధిచేశారు. అనారోగ్యం అనేది లేకుండా చేసుకున్నారు. నిరుపేదలుగా వచ్చిన అసంఖ్యాక యూదుజాతీయులు కొద్ది సంవత్సరాల వ్యవధిలో ఉన్నత జీవన ప్రమాణం అందుకున్నారు. యూదులిలా దినదినాభివృద్ధి పొందుతుండగా అరబ్బుల పరిస్థితి 1918 కు ముందు ఎలా ఉండేదో తరవాత కూడా అలాగే ఉండిపోయింది పారిశ్రామికంగాను, విద్యా విషయికంగాను అరబ్బులు చాలా వెనుకబడిపోయారు. పైదేశాలనుంచి యూదులువచ్చి తమ దేశంలో తిష్ఠవేసుకోవడం వారికి ద్వేషకారణమైంది. యూదు జాతీయోద్యమాన్ని ప్రతిఘటించడానికి 1945 మార్చి 22 న అరబ్ లీగ్ స్థాపితమైంది. మొదట్లో ఈజిప్టు, సావుదిఅరేబియా, ఇరాక్, ట్రాన్స్ జోర్డానియా, యెమెన్ దేశాలరాజులు, సిరియా, లెబనాన్ దేశాల అధ్యక్షులు ఈ లీగ్‌లో సభ్యులుగా చేరారు. (ఇటీవల మొరాకో, ట్యునీషియా మొదలైన దేశాలు చేరాయి)

ఇజ్రేల్ స్థాపన

1948 మే 15 న ఇజ్రేల్ రాజ్యం ఏర్పడింది. యూదు జాతీయోద్యమానికి 30 ఏళ్లుగా నాయకత్వం వహించిన సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు డా॥ వైజ్‌మన్ ఇజ్రేల్ అధ్యక్షుడయ్యాడు. ప్రధానమంత్రి బెన్ గురియన్ కొత్త రాజ్యాన్ని అమెరికా, రష్యా, మరికొన్ని దేశాలు గుర్తించాయి. ఇజ్రేల్ బలమైన సైన్యం ఆయత్తంచేసుకున్నది. ఇంతలో అరబ్ లీగ్ రాజ్యాలన్నీ ఒక్కుమ్మడిగా ముట్టడించాయి. ఇజ్రేల్‌కు సోవియట్ కూటమినుంచి ఆయుధ సహాయం లభించడంవలన, అరబ్ లీగ్ రాజ్యాలలో ఒకదానికీ ఒకదానికీ సరిపడక కీచులాడుకోవడంవల్ల ఇజ్రేల్ విజయవంతంగా అరబ్ ముట్టడిని నిలువరించుకున్నది. యుద్ధ విరమణను ఏర్పాటుచేయడానికి ఐక్యరాజ్యసమితి కౌంట్ బెర్నాడోట్‌ను పంపించింది. అతడు నాలుగువారాల యుద్ధవిరమణను సాధించి, పాలెస్తీనా, ట్రాన్స్‌జోర్డానియాలను యూదు, అరబ్ రాజ్యాలుగా చేసి ఒకే దేశంగా రూపొందించాలని ప్రతిపాదించాడు దీనికి ఉభయపక్షాలు నిరాకరించాయి. మళ్లీ యుద్ధం ప్రారంభమైంది. 1948 సెప్టెంబరులో యూదు అతివాదులు బెర్నాడోట్‌ను హత్యచేశారు. ఆతరవాత సమితి డా॥ రాల్ఫ్ బంచ్‌ను మధ్యవర్తిగా పంపించింది.

1949 ఫిబ్రవరి 24 న ఇజ్రేల్‌కు ఈజిప్టుకు యుద్ధ విరమణ ఒడంబడిక జరిగింది తరవాత క్రమంగా మిగతా అరబ్ దేశాలు కూడా యుద్ధ విరమణకు అంగీకరించాయి

ఈజిప్టు గాజా-రాఫాలమధ్యఉన్న కోస్తా చీలికను. సైనాయ్ ఎడారిని ఆక్రమించుకుంది. నెగివ్‌ను ఇజ్రేల్ స్వాధీనం చేసుకుంది. జెరుసలెమ్ నగరంలో పాతపేట జోర్డన్ అధీనంలోనే ఉండిపోయింది.

ఇజ్రేల్ నుంచి తండోపతండాలుగా పారిపోయే అరబ్ కాందిశీకుల సమస్య మాత్రం ఆరని అగ్నిలాగా రగులుతూనే ఉంది. ఈ సమస్య మూలంగా యుద్ధవిరమణ ఒడంబడిక ఏ క్షణంలోనైనా భగ్నమైపోయే పరిస్థితిలో పడింది. నిజానికి పేరుకుమాత్రం ఒడంబడిక అమలులోఉన్నా, ఐక్యరాజ్య సమితి పరిశీలక సంఘం అక్కడేఉన్నా, చిన్న చిన్న సంఘర్షణలు జరుగుతూనే వచ్చాయి

ఇలా ఉండగా గత సంవత్సరం సెప్టెంబరు మాసాంతంలో ఈజిప్టు జెకొస్లొవాకియాతో ఆయుధాల సరఫరా ఒప్పందం కుదుర్చుకోవడంతో మధ్యప్రాచ్య రాజకీయాలు పాకాన పడ్డాయి పశ్చిమరాజ్యాలు ఈజిప్టుకు ఆయుధ సహాయం చేయలేదనీ, పైగా ఇజ్రేల్‌కు భారీ ఎత్తున సైనికసామగ్రి పంపిస్తున్నాయనీ, కనుక తాము జెకొస్లొ

మంత్రాలు: నమ్మకాలు

మంత్రం అంటే ఏమిటి?

ఈ మధ్య ఆంధ్ర 'వార' పత్రికలో 'మంత్రాలు-నమ్మకాలు' శీర్షిక క్రింద ఒక్కొక్కరి అభిప్రాయమే చదివినమీదట ఇది వ్రాస్తున్నాను. మంత్రమనేది కొన్ని బీజాక్షరాల కలయిక. బీజాక్షరాలలో అగ్ని, జల, వాయు తత్త్వాలుండుట శాస్త్ర సమ్మతము. ఆయా బీజములు ఆయా తత్త్వములకు చెందినవై, మన శరీరమునందు ఆయా స్థానములం దధిష్ఠానములై ఉంటాయి. జ్ఞానులైన వారు శరీరములో గల వివిధ నాడులను శుద్ధీకరించుటకై ఏయే బీజము లేవిధముగా నుచ్చరించి ఏ సాధన చేస్తే, నాడీశుద్ధి అవుతుందనేది గ్రంథములను పరిశీలించిన వారికి తెలుస్తుంది. మనము సామాన్యంగా ఉపయోగించే అక్షరాలు సామాన్యమైనవి కావు. కాని ఈ యంత్రయుగములో వాటి ప్రయోగము, ఉపయోగము పరిశీలించే వారే లేరు. అకార ఉకార మకారముల సంయోగమైన ఓం అను బీజాక్షరమునందు సర్వశక్తులు గలవనీ, అదే పరబ్రహ్మ స్వరూపమనీ, దానినుండియే సకల చరాచర ప్రపంచ మావిర్భవించినదనీ చెప్పిన బ్రహ్మజ్ఞానుల మాట కాదనగలమా? ఆయా బీజాక్షరములలో దేని తరవాత దేనిని ఉచ్చరించిన ఏ ఫలితము వస్తుందనేది అనుభవ వేద్యమైనది. నియమముల యథాతథా ననుసరింపజాలనివారు ఫలితములు పొందలేరు. అంతమాత్రాన మంత్రములలో శక్తి లేదనరాదు. చిత్తశుద్ధి, యోగ్యమైన నడవడి, ఆత్మవిశ్వాసము కలవాడే మంత్రసాధనకర్హుడు. మంత్రము లద్భుతశక్తిపూరితములనుట నిర్వివాదాంశము.

ఉమహేశ్వర్-పర్లాకిమిడి.

* * *

దెయ్యాలను గురించి కొందరు, నవయౌవనంలో గాఢమైన కోరికలుకలిగి అవి తీరకుండా చనిపోయినవాళ్ళు దెయ్యమై, కోరికలు తీరేవరకూ వికారప్పనులు చేస్తూవుంటారని చెబుతారు. అయితే యీ దెయ్యాలు, మనోదార్ఢ్యం వున్నవాళ్ళ జోలికిపోక, దుర్బలులనే పట్టుకుంటాయి.

కాలేజీలో చదువుకునే రోజులలో ఒక స్నేహితుడు ఒక కథ చెప్పాడు. వాళ్ళింట్లో చచ్చిపోయిందట. దెయ్యమై బాధలు పెట్టే వదినగారో, తోబుట్టువో నవయౌవనంలో డట. ఆ పోయినమనిషి యొక్క భర్త మళ్ళీ చేసుకున్న భార్యని పట్టుకుని బాధించేదట. శుభ్రమైనచీర కట్టి విడిచి దండెంమీదవేస్తే కాలిపోవడం, భర్తతో పరుండే రాళ్ళవర్షం కురవడం, పేడ, పెంట వగైరాలు వచ్చి పందిరిమంచంనిండా వుండడం. అలా కొన్నాళ్ళు బాధలుపడి, ఓ మంత్రగాడిని తీసుకువస్తే అతగాడు స్నానం, జపంచేసి, ఒక పీటవేసి, దానిపై యీ దెయ్యంచే పీడింపబడే ఆమెను కూర్చోపెట్టి జుట్టుకు చిన్న ముడి వేసి, ఆ ముడి కత్తిరించి, ఒక సీసాలో పెట్టి పెరట్లో లోతుగా పాతిపెట్టించాడట. ఆ తరువాత ఏబాధా లేదట. దీనినిబట్టి దెయ్యాలున్నాయని, వాటిని నివారణచేసే మంత్రశక్తి వుందనీ నమ్మవలసిందేకదా?

మంత్రాలున్నాయాలేదా, వాటిని నాకుచూపితేగాని నమ్మననే కుతర్కవాదులకు కొన్ని సంగతులు చెప్పాలి. వాళ్ళకి మంత్రం అంటే తెలియదు. "అదో మెస్మరిజంరా" నాయనా అంటే "ఓహో" అదా అలా చెప్పుఅంటాడు. నీకు తెలుగు తెలుస్తుందిరా అంటేవాడు యింగ్లీషులో చెపితే తెలుస్తుందన్నట్టు.

కరీంనగరుజిల్లాలో చలిగంటి అనే గ్రామంవుంది. ఆ వూళ్ళో చలిగంటి రాజనరసయ్య అనే ఒక మహా మంత్రవేత్త వున్నాడు. ఎప్పుడో కాదు, ఇప్పుడు జీవించి వున్నాడు. పాముకరిస్తే ఆయనపేరు తలచుకొని ఫలానాటైములో దర్శనంచేసుకుంటానని దండం పెట్టుకుంటే ఆ విషం దిగిపోతుంది. ఆ టైములోపల ఆయన్ను దర్శించి దండం పెట్టకపోతే మళ్ళీ విషం ఎక్కచచ్చిపోతారట. ఇది మంత్రశక్తి అంటారా? కాదా? ప్రతిమంత్రానికి కొన్ని నియమాలుంటాయి. అవి పాటించకపోతే వికటించికొడుతుంది.

అమలాపురం తాలూకాలో వున్న చింతలపూడి అనే గ్రామంలో ఒక కంసాలి మంత్రగాడుండేవాడు. ఎవరికైనా పాము కరిస్తే అతగాడికి కబురుచేస్తే వచ్చి, ఒక చీటీవ్రాసి, తొండకిచ్చి పంపేవాడట. ఆ తొండవెళ్ళి కరచిన పామును తీసుకు వచ్చేదట. ఆ పాముచేతే విషముతీయించి బ్రతికించేవాడట. ఇది మొన్నమొన్నటి సంగతే.

వై. గవర్రాజు-సికిందరాబాదు.

* * *

మా అమ్మగారికి తేలుకు మంత్రము, దిష్టిమంత్రము, ఒక టేమిటి చాలా వచ్చును. పెద్దపెద్ద డాక్టర్లు కూడ ఆశ్చర్యపడునట్లుగా మా అమ్మగారు తన మంత్రప్రభావముచే ఎందరినో రోగ విముక్తుల గావించినది.

చలిజ్వరము మందు:- మా గృహావరణయందు అనేక చెట్లుచేమలు గలవు. ప్రతి దినము చలిజ్వర పీడితులు మా యింటికి ఉదయం 6-30 నుండి 9 గం వరకు వక 'క్యూ' లో ఉందురు. మా అమ్మగారు పెరటిలోనికి పోయి ఏవో రెండు మూడు ఆకుల రసము పిండి, ఆ రసములో బెల్లము కలిపి మాత్రలు చేసి చలిజ్వర పీడితులచే మ్రింగించును. అటుల రెండుమూడు వరుస దినములు ఆతీరున ఆకురసము మాత్రలు సేవించిన చలిజ్వరము టక్కున కట్టును మాత్రలు సేవించిన పిదప రోగులు యింటికి వెళ్ళి కొలదిగ పెరుగు అన్నము తినవలెను అట్లు తినజాలని పేదవారికి మా అమ్మగారే పెరుగన్నము పెట్టి పంపేసేది. వారెల్లరు వారము పది దినములలో అరోగులయ్యెదరు. ఇంతకూ ఆ ఆకులు ఏవో కావు: పిప్పింటాకు, పిచ్చి దొండాకు.

ఇంతకంటే విచిత్రమైనది, ఆశ్చర్యకరమైనది, మరొక మంత్రము. అది పచ్చకామెర్ల మంత్రము. పచ్చకామెర్ల రోగులకు మా అమ్మగారు పెట్టు మంత్రము అమోఘముగా పని చేయును. అనేకమంది డాక్టర్లు గూడ ఆమె మంత్రప్రభావమునకు చకితులైనారనిన అతిశయోక్తిగాదు. పచ్చకామెరు చాల దుష్టవ్యాధి. కండ్లు, ముఖము పసుపువన్నెకుదిగి చాల ప్రమాదము కలిగించును. ఆమె పెట్టు మంత్రము చాల విచిత్రముగా నుండును స్వచ్ఛమైన నీటిని ఒక గాజు పాత్రలో పోసి, రెండు మూడు సూదులతో రోగి కండ్లను, ముఖమును మంత్రించి, ఆ సూదుల నా గాజు పాత్ర యందలి స్వచ్ఛమగు నీటియందువైచి, ఆ పాత్ర నా రోగికి యిచ్చును. పిమ్మట తెల్ల గలిజేరాకు వేరు గంధమును రోగికండ్లలో వేయును. రోగులు యింటికిపోయి సూదులనీటి పాత్ర నొకచో

★ మంత్రాలు, నమ్మకాలు ★

భద్రపరచి, మరునాడు మంత్రమునకు వచ్చునప్పుడా పాత్రను తెత్తురు. అదేమి చిత్రమోగాని ఆ చిన్నిపాత్ర యందలి నీరు పసుపు రంగుగా మారియుండును. మా అమ్మగారా నీటిని పారవైచి, కనులను శుభ్రపరచి, మరల మంత్రించి, కంటిలో తెల్ల గలిజేరాకు వేరు గంధము వేసి పంపుచుండును. ఇట్లు వారము పదిరోజులు మంత్రించిన పిమ్మట, మంత్ర జలము రంగు స్వచ్ఛతకు వచ్చుచుండును. కనులయందలి పసుపురంగు తగ్గి తెల్లబడుచుండును. ముఖము మామూలు స్థితికి వచ్చుచుండును. అట్లు మంత్ర జలము స్వచ్ఛముగా ఉండువరకు మంత్రించును. అంతటితో రోగికి కామెర్ల వ్యాధి పూర్తిగా నయమగును. ఈ తీరున మా అమ్మగారు తన మంత్ర ప్రభావమును చూపుట మేమెన్నియో మారులు చూచితిమి.

గంగరాజు వెంకట పున్నయ్య,
గుంటూరు.

మంత్రాల నమ్మకం కొంపలు ముంచినది

ఒకాయన తేలు కుట్టుకూ, పాము కాటుకూ, గజ్జి, సర్పి, గవదవాపులు, గ్రహబాధ అని ప్రజా సామాన్యంలో నమ్మకం ఉన్న అపస్మారము (Hysteria) మొదలయిన కొన్ని జబ్బులకూ, మంత్రాలు వేస్తూ ఉండేవాడు. ఈప్రకారం కొన్నాళ్లు జరిగేటప్పటికి అతనికి చిల్లంగి, చేతబడి, దృష్టి, ప్రయోగం అనే పేర్లతో పిలవబడు దుర్మాంత్రిక శక్తి ఉన్నదనీ, తన విరోధులమీదనూ, తనకు డబ్బు యిచ్చియో ఆశ్రయించియో కోరినవారి శత్రువులపైనీ, ప్రయోగం చేస్తాడనీ, అందువల్ల కొందరు ఆకస్మికంగా మరణిస్తున్నారనీ, కొందరు దీర్ఘ రోగాలవల్ల క్రుళ్లుతూ ఉంటారనీ, గ్రామంలోను పరిసరాలలోను ప్రతీతి వ్యాపించినది. అందువల్ల అతనికి కొందరు శత్రువులైనారు, కొందరు మిత్రులయినారు. మొత్తమునకు పలుకుబడికంటె అతనికి గ్రామంలో విరోధం ఎక్కువైనది. అతని పేరు "మంత్రాలయ్య" అని వాడుక అయినది

మంత్రాలకు ఉచ్చారణ ప్రధానమనీ, ఉచ్చారణకు ముందరి పండ్లు అవసరమనీ, అవి పోతే అతని మాంత్రిక శక్తి నశించిపోవుననీ, నమ్మి, కొందరు గ్రామస్థులు కలిసి ఒకనాడు అతనిని ఒక గదిలో నిర్బంధించి, కాలు చేతులు కదల్చుటకు వీలులేకుండ గట్టిగా పట్టుకొని కమ్మరికారుతో బలవంతంగా అతని ముందరి రెండు పండ్లూ ఊడదీశారు

ఆ వ్యక్తులమీద మంత్రాలయ్య కేసు పెట్టగా, మేజిస్ట్రేటుగారు వాళ్లకు ఆరు మాసముల చొప్పున కఠిన శిక్ష విధిస్తూ జడ్జిమెంటులో ఇట్లా వ్రాశారు. "మంత్రాల నమ్మకం ఉభయ పక్షాల కొంపలూ ముంచినది. ఫిర్యాదికి పండ్లూడి శాశ్వతమైన అంగవైకల్యం సంభవించినది. ముద్దాయిలకు ఆరు నెలల చొప్పున కఠిన శిక్ష ప్రాప్తమై శాశ్వత కళంకం కల్గినది."

ఈ సంఘటన భీమవరం తాలూకాలో కొన్ని సంవత్సరముల క్రిందట జరిగినదని వాడుక.

డొంకాడ అప్పలనరసయ్య,
— సాలూరు.

* * *

నాకు మంత్రాలపై భక్తి ఉన్నదని తెలుసుకున్న ఒక మహానుభావుడు, నాకొక పర్వదినమున ఒక చిన్న మళయాళ మంత్రమును ఉపదేశించెను. ఆ గురుని వాత్సల్యమును పొందుటచే, నాటినుంచి నేటివరకూ నేను మా గ్రామమున జయప్రదముగ తేలు మంత్రము వేయుచున్నాను. బండిపై ఏడ్చుచు వచ్చిన వ్యక్తులు, తేలు బాధనుండి ఒక్క నిమిషములో నివారణ చెంది, నడిచి తిరిగి యింటికి వెళ్లుచుందురు. వారికి తేలు కుట్టిన సరియైన ప్రదేశమును కనుగొని, ఆ తావును ఒక చిన్న పులతో నా శరీరము పైకి మార్చుకుండును. మనశ్శక్తికి మంత్రశక్తికి, యిదొక తార్కాణమని భావింతును.

ద్రోణంరాజు కృష్ణారావు,—
తాడేపల్లిగూడెం.

* * *

పాముల నరసయ్య పేరు వినని ఆంధ్రులుండరు. ఈయన నైజాము స్టేటులో రైల్వేలో పనిచేస్తూ వుండేవాడు. ప్రతిదినము అనేక స్థలాలనుండి ఫలానా వాడికి పురుగు ముట్టింది (పాముకరిచింది) అనే వార్త యితనికి ఫోనులో వస్తూవుండేది. ఈ వార్త వింటూండగానే తన పైకండువాను చించి మంత్రించి ఒక చెట్టుకొమ్మకు కట్టేవాడు. ఆ పాముకరచిన వ్యక్తిని పాముల నరసయ్య పిలుస్తున్నాడుఅని అతని చెవుల్లో చెప్పమని ఫోనులోనుండి చెప్పేవాడు. ప్రక్కనున్నవారు వెంటనే "పాముల నరసయ్య పిలుస్తున్నాడులే" యని అతని చెవులదగర అరచేవారు. కొద్దిసేపటికి పాముకరిచిన వ్యక్తి నిద్రనుండి లేచినట్లుగా లేచేవాడు. పాముల నరసయ్య నివాసము, అతను మంత్రించే విధానము రైల్వేవుద్యోగులు చెప్పినదానిని బట్టి నమ్మిన విషయాలు. ఆయన యేవిధముగా మంత్రించేది మనకు కనుపించకపోయినప్పటికిని, పాము కరచిన వ్యక్తి చెవుల్లో "పాముల నరసయ్య పిలుస్తున్నాడు లే" యని అరచుట ఆ వ్యక్తి కొద్దిసేపటికి మెల్లగా లేచి కూర్చుండుట; ఇటువంటివి నాలుగయిదు స్వయంగా నాకళ్లతో చూచాను

సుమారు ఇరువది సంవత్సరాలనుండి రైల్వేస్టేషనులలో పని చేస్తున్న రైల్వే వర్కర్లందరు యిందుకు సాక్షులు. పాముకాటును రుచిచూచి పాముల నరసయ్యచేత పునరుజ్జీవితులైన వేల సంఖ్యలో గల ఆంధ్రులే ప్రత్యక్ష నిదర్శనము. అటువంటి పాముల నరసయ్య యీనాడు మనకు లేకుండాపోయాడు. ఆయన చనిపోయి కొన్ని సంవత్సరము లైనను ఆయన కీర్తి యీనాటికి మన ఆంధ్రలో నిలచివున్నది.

సి. హెచ్. వెంకటేశ్వర్లు,
—రాజమండ్రి.

చరితార్థుడు

"విరించి"

పదిహేడవ శతాబ్దపు ప్రథమదినాలు, చంద్రగిరి రాజ్యాన్ని వేంకటపతి రాయలు పరిపాలిస్తున్నాడు రాజు ప్రజానురంజకుడే అయినా, అతగాడికి ఒక తీరని కోరిక వుండేపోయింది వేంకటపతి రాయలుకు యిప్పటికి షష్టిపూర్తి అయికూడా యేడు సంవత్సరాలు అయింది అయితే, యేం లాభం? ఆయనకు సంతానం లేదు.

వేంకటపతి రాయలు భార్య వెంకటమ్మ గొబ్బూరు జగ్గరాజు కూతురు జగ్గరాజుకు రాజ్యం తనకు కాకుండా, తనకూతురు కనని సంతానానికి కాకుండా మరొకళ్ళకు పోవటం సుతరామూ యిష్టంలేదు అయిందేదో అయిందని వెంకటమ్మతో రహస్యాలోచన చేశాడు లోగడే ఆమెకు సన్నిహితురాలయిన ఒక బ్రాహ్మణయువతి కన్న మగబిడ్డను తీసుకువచ్చి రాణి ప్రసవించిందని ప్రదర్శన చేశాడు వేంకటపతి రాయలు కూడా ముందు సంతోషించినవాడే కాని, కొద్దిరోజులకే ఆయనకు ఈ అబద్ధం తెలిసిపోయింది ఆ కుర్రవాడిని రాజు ప్రేమించలేక పోయినాడు అందుచేతే రాజ్యం అతడికి కట్టబెటటం ఇష్టంలేక ఆలోచిస్తున్నాడు

వేంకటపతి రాయలు కుమారులు లేనందుకు దిగులుపడలేదు తన తమ్ముని కుమారుడు రంగరాయలును చేరబిలిచాడు ప్రధాన సామంతులను రాబంపాడు అందరూ వింటూవుండగా, తన రాజ్యానికి రంగరాయలే తన అనంతరం ప్రభువని ప్రకటించాడు తన చేతిఉంగరం ఆ కుర్రవాడికి తొడిగాడు వారం గడువక ముందే, వేంకటపతిరాయలు పరమపదించాడు ప్రజలు ఉస్సూరుమని వాపోయారు

గతించిన రాజు ఆదేశానుసారం రంగరాయలు గద్దెఎక్కాడు ఒడుదుడుకులు లేకుండా పాలనం చేస్తున్నాడు కొద్దిరోజుల్లోనే ప్రజలకు సామంతులకు తలలో నాలుకలాగున మెలగజొచ్చాడు కాని ఈ ధర్మపాలనం చూచి సహించలేక పోయినాడు, జగ్గరాజు తాను పన్నిన కుతంత్రము పారలేదు, తనకూతురు సంతానహీన, గొడ్రాలు. ఏమయినా, తనకూతురు పెంచుకొంటూన్న బ్రాహ్మణ కుమారుడే రాజు కావాలి, రంగరాయలు చాలుతప్పినవాడు— అని నిర్ధారించుకొన్నాడు. కాని ఎట్లా సాధ్యమవుతుంది జాగ్రత్తగా ఆలోచించి పథకం తయారుచేశాడు అంత్యంలో పరాభవంపాలయినా, ప్రథమదశలో దుష్టంత్రాలకు ప్రోత్సాహం వుంటుంది కద!— అలాగనే రంగరాయలు సైనికులకు పెద్ద లంచాలు చెల్లించగా, వాళ్లంతా జగ్గరాజుకు చేదోడుగా నిలుస్తామని బాసచేశారు

నగరంలో పరిస్థితులు యిట్లా వుండగా, కొందరు సామంత ప్రభువులు కప్పం సరిగా పంపడం లేదని రంగరాయలు వారికి ప్రత్యేకించి కబుర్లు పంపాడు వెంటనే కప్పం పంపకపోతే, సామంతదేశం స్వాధీనం చేసుకుంటానన్నాడు ఇందుమూలాన, సామంత రాజులకు ప్రభువులపై కోపంవచ్చింది జగ్గరాజు వారందరికీ దుర్బోధలు చేశాడు అగ్నికి ఆజ్యం తోడయినటయింది! వీరంతా జగరాజుకు తోడునీడగా నిలుస్తామన్నారు అమాయకుడైన రంగరాయలకు జగ్గరాజు కుతంత్రాలు, దుష్టచింతనలు తెలుసుకునే అవకాశం లేకపోయింది

జగరాజు రంగరాయనిం ప్రభువువారికి ఒకరోజు ఇలా కబురుచేశాడు "ప్రభువు వారికి సాష్టాంగ దండప్రణామాలు మీపై తిరుగుబాటు సల్పుతున్న సామంత రాజులను నేను మీకు హితులుగా మార్చాను వారు కుమార్గంనుంచి సన్మార్గానికి వచ్చారు దేవరవారి సందర్శన భాగ్యంకోసం మేము సేనా సమేతంగా వేచివున్నాం కనుక మాకు తమ దర్శనభాగ్యం కలిగించాలని మనవి"

ఈ కబురువిని రంగరాయలు ఉప్పొంగిపోయాడు అనవసరంగా యుద్ధాలు, రక్తపాతాలు లేకుండా సామంతులు కలసివస్తున్నారు! ఇది కేవలం వేంకటపతిరాయల ఆశీర్వచనబలం—అనుకుని సామంతులను లోనికి దొడ్కొనిరమ్మని కబురంపాడు

జగ్గరాజు, ఇతర సామంతులు సేనాసమేతంగా కోటలోనికి వచ్చారు. జగ్గరాజు కోటగుమ్మాలన్నిటి దగ్గర తన సైనికులను కాపు వుంచాడు అప్పటికిగాని రంగరాయలుకు అతని ద్రోహచింతనం అర్థంకాలేదు కాని ఇప్పుడు చేయగలదేముంది? చేతులు కాలినతర్వాత, ఆకులు పట్టుకుని ఎంత ప్రయోజనమో, ఇప్పుడువగచికూడా అంతే! శత్రువులబలం కోటలో ఎక్కువగా వుంది రంగరాయలు సకుటుంబంగా తన మందిరంలోనే బందీ చేయబడ్డాడు

* * *

జగ్గరాజుకు ఇంక ఎదురులేక పోయింది తనకూతురి పెంపుడుకుమారునకు 'చిక్కరాయలు' అను నామకరణం చేసి గద్దెఎక్కించాడు సామంతులకు అతగాడు చెప్పిన మాయమాటలివి: 'ఈ చిక్కరాయలు నా కుమార్తెకు, వేంకటపతిరాయనికి పుట్టినవాడు. నా మనుమడు కనుక రాజ్యాధికారము వీనికే అవసానకాలంలో, మతిభ్రమణం కలిగివుండవలెను! అందుచేతనే స్వంత కుమారుని కాదని, దారినపోయే రంగరాయలుకు రాజ్యాధికారము చుట్టబెట్టినాడు! ఇప్పటికి నేను అపసవ్యమును సవ్యము చేసినాను న్యాయముగా ఎవడు రాజు కావలెనో, వాడే ఇప్పుడు గద్దెపైనున్నాడు సామంతులు కప్పములు చిక్కరాయనికే చెల్లించాలి కానుకలు సమర్పించాలి ఈతడు మిమ్ము ధర్మప్రభువవలె కాపాడగలడు—'

సామంతరాజులందరును సరేయనిరి కాని, ఉత్తర మల్లూరు ప్రభువు వెలమదొర యాచమనాయుడు మాత్రము ఈప్రకటనతో ఏకీభవించలేదు అతడు కొత్తరాజుకు కానుకలు పంపలేదు ఆ రాచరికమునకు ఒప్పుకొననే లేదు జగ్గరాజు చేసిన ద్రోహానికి యాచమనాయని ఒడలు దహించుకుపోతోంది ప్రభువైన రంగరాయని చెఱవిడిపించవలెనని అతడు శపథము చేశాడు తన సేనతో చంద్రగిరికోటను ముట్టడించాడు ముట్టడి చాలరోజులు సాగింది ఎప్పటికినీ పూర్తయేట్లు కనిపించలేదు కోటలోపలి సైన్యం యాచమనాయని సైన్యంకన్న ఎన్నోరెట్లు పెద్దది యాచమనాయుడు నిరాశచెంది, చంద్రగిరి వదలి ఉత్తర మల్లూరు వెళ్ళిపోయినాడు కాని, రంగరాయలను విడిపించి తిరిగి రాజ్యాధికారము

★ చరితార్థుడు ★

సానగూర్చడం ఎటులాయని అతను తదేకంగా ఆలోచిస్తూ వుండిపోయాడు

ఇంతలో జగ్గరాజు ఊరికే వుండక యాచమనాయనికి కబురుపెట్టాడు త్వరలోనే తన మనమడైన చిక్కరాయనికి పట్టాభిషేకం చేయబోతున్నట్లు ఈ లోపలే యాచమనాయడు తన ప్రభువుకు ప్రణామం చేసి కానుకలు పంపవలెననీ, లేకపోతే, సైన్య సమేతంగా వచ్చి సామంతరాజ్యాన్ని కైవసం చేసుకుంటానని బెదిరించాడు కూడాను, జగ్గరాజు. యాచమనాయడు ఈ కబురు విని మండిపడ్డాడు.

'దారినపోయే వాడిని ఎవడినో తెచ్చి రాచరికం కట్టబెట్టటానికి, నీ వెవరు? మా ప్రభువు వేంకటపతిరాయలు అవసానకాలంలో, రంగరాయలు పేరే చెప్పి వెళ్లాడు అతడే మా ప్రభువు కాని మరిఎవరూ కారు అతడికి తప్ప మరిఎవరికిన్నీ మేం వినయవిధేయతలు ప్రకటించవలసిన అవసరంకూడా లేదు సైనికబలం చూపితే, బెదిరిపోవడానికి యాచమనాయడు పుట్టుపిరికి కాడు! అంతవరకూ వస్తే బలాబలాలు చూచుకుందాము కానీ.' అని యాచమనాయడు ప్రత్యుత్తరం పంపాడు దీనికి జగ్గరాజు కూడా అగ్గిపిడుగులా అయ్యాడు కాని అతడికి తొందరపడటం వివేకంకాదనిపించింది ఏమో, ఎటుపోయి ఎటు వస్తుందో తీరా తాను సైన్యాన్నంతా వెంట వేసుకుని యాచమనాయని మీదకు దండయాత్రకంటూ ఉత్తర మల్లూరు వెడితే, ఇక్కడ రాజధాని నగరంలో ఏం ఉపద్రవం మూడుతోందో! శత్రువులు తాను లేకుండా చూసి, మళ్ళీ గద్దెను ఎవరు తెస్తారేమోనని భయపడ్డాడతను అదీగాక ఉత్తర మల్లూరు ప్రభువు బలం ఎంతో సమంగా తెలియదు ఏమాత్రమో సమఉజ్జీ వాడు కాకపోతే, ఇంత మొండిగా ఎందుకు వుంటాడు? ఏ ధైర్యం చూచుకుని, ఎవరూ ఎదురు పలుకని తనకు, బగులు మాట చెబుతున్నాడు?-అని అనేకమైన సంశయాలు జగ్గరాజు మదిలో మెదిలాయి

ఎంతసేపు మదనపడిన మీదట కాని, జగ్గరాజు ఒక నిశ్చయానికంటూ రాలేకపోయినాడు ఏమంటే, యాచమనాయనితో దురుసుగా ప్రవర్తించి లాభంలేదు. సామనీతిగానే పరిష్కారమార్గం సాధించాలి అందుకనే జగ్గరాజు మధ్యేమార్గంగా యాచమనాయనికి ఇలా కబురు చేశాడు 'నీవు చాల గొప్పవీరుడవు నీకు సాటి ఎవరూ లేరు నాతో వివాదపడక చిక్కరాయుల రాచరికానికి తలవొగ్గినట్లయితే, నిన్ను మా సామంత సరదారులలో మేటి చేస్తాను నీకు రత్నమాణిక్యాలు బహూకరిస్తాను కావల్సినన్ని భూములు ఈనాముగా ఇస్తాను నీకూ మాకూ పోరువల్ల ప్రయోజనం లేదు'

యాచమనాయడు ఈ కబురుకు కూడా లొంగలేదు నీతోడి పొందుకన్నా నరకమే మేలన్నాడతను నీ విచ్చు రత్నమాణిక్యాలకన్నా గర్భదారిద్ర్యమే మెరుగన్నాడు నీవు రాజద్రోహివి కాన నీ ముఖసందర్శనమే పాపహేతువన్నాడు

ఇక యాచమనాయడు రంగరాయలును చెఱవిడిపించే మార్గములు ఎన్నో ఆలోచించాడు ఆలోచనలు బాగానే వున్నాయి కాని, ఆచరణలో ఒకటీ సాగలేదు ప్రతిదానికీ ఏదోవొక విఘాతం వచ్చి నిరాశ కలుగుతూ వచ్చింది అయినా నాయడు ప్రయత్నం మానలేదు ముందుగా, రాయల కొడుకులలో ఒకడిని తనదగ్గరకు చేరదీసే ప్రయత్నంచేస్తే బాగుంటుందని నాయనికి తోచింది వంశాంకురము తనదగ్గరేవున్న తరువాత, రాజద్రోహులు ఎంతటిఘోరపాపానికి ఒడికట్టినా, తన న్యాయరక్షణ దీక్ష కుంటుబడకుండా వుంటుందని తోచింది అందుచేత రాయలు బందీగావున్న జైలులో బట్టలువుతికే చాకలివాండను పిలిపించి, వాళ్లను మంచిచేసుకున్నాడు వాళ్లద్వారా రాయలుకు చిన్నచీటీ ఒకటి పంపగలిగాడు! 'రాయలు ప్రభువారికి నమస్కారాలు దేవర వారికి న్యాయం చేకూర్చటానికి విరామం లేకుండా పని చేస్తున్నాను ముందు - ఈ చాకలివాళ్లతో మీ కుమారులలో ఒకడిని ఇచ్చి పంపండి ఏమీ సందేహించవద్దు మూడవమనిషికి ఎరుక లేకుండా పంపవలెను'


ఈ చీటి చూచుకుని రంగరాయలు ఆనందానంద భరితుడైనాడు తన సామంతులలో ఒకరైనా, ఇలాంటి భక్తిశ్రద్ధలు, ప్రభుభక్తి వున్నవాళ్లు అగుపించినందుకు అతని హృదయం సంతోషం, గర్వంతో పులకరించింది తడుముకోకుండా తన రెండవకుమారుడిని చాకలివాళ్ల వెంట పంపాడు ఈ కుర్రవాడు పన్నెండేళ్ల వాడు చాకలివాళ్ల పాతగుడ్డల బుట్టలో రహస్యంగా ఒదిగి కూర్చున్నాడు జైలు కాపలాదార్లు యే మాత్రం అనుమానించడానికయినా అవకాశం లేకుండా, రంగరాయలు రెండవకుమారుడు యాచమనాయని వద్దకు చేరుకున్నాడు

తన ప్రభుకుమారుని చూచి, ఆ సామంతరాజు హృదయం ఉప్పొంగిపోయింది తన కర్తవ్యం నెరవేరుస్తున్నాననే సంతృప్తితో అతడిని తనదగ్గరే ప్రత్యేకశ్రద్ధతో పెంచుతున్నాడు

* * * *

ఒకనాడు యాచమనాయడు నమ్మకమైన సైనికులను ఇరవైమందిని చంద్రగిరికి పంపాడు వాళ్ళను రంగరాయలు బందీగా వున్న జైలులో ఉద్యోగాలు సంపాదించి, ప్రభువును విడిపించే ప్రయత్నంలో వుండమన్నాడు వాళ్లుకూడా ప్రభువాజ్ఞ జౌదల దాల్చి చంద్రగిరి చేరుకుని జైలు అధికారి ప్రాపకం సంపాదించారు

(55 వ పేజీ చూడండి)



కలువల కథ

వెల్చేరు నారాయణరావు

గలగలలాడే అలల కొలనులో
జిలుగుల వెలుగుల కలువల్లారా!
కథలుచెప్పు నేస్తాలు మీ కెవరు
కలలో కొంచెం చెప్తారా?

ఆకుపచ్చ ఆకులు మీ దగ్గిర
అలికిడి లేకనె పడిఉంటాయే!
అవి మీకెట్లా అందమైన కథ
అల్లిచెప్పునో చెప్తారా?

అందమైన తెల్లని బాతులు మీ
కందుబాటులోనే ఉంటాయే!
అవి చెప్పే కథలన్నీ కూడా
అంత చక్కగా ఉంటాయా?

పచ్చని ఆకుల చెట్టుల కొమ్మలు
మచ్చికగా మీ మీదికి వంగును!
అవి చెపుతాయా నచ్చినట్లు, మీ
కందరికీ నవ్వొచ్చే కథలను.

ఒడిలో పెట్టుకు జోలపాడుతూ
ఊయలలూపే అలల వరుసలే -
అల్లిబిల్లి లోకపు కథలన్నీ
మెల్లమెల్లగా చెబుతాయా?

ఎవరూ కథలను చెప్పకపోతే
ఎందుకుమరి తలలూపుతారెపుడు?
కలువలు చక్కనికథ చెపుతాయని
కలలో దేవుడు చెప్పాడమ్మా!

కలువల కన్నుల పాపలమంతా
కథలు వినాలని వచ్చేమిప్పుడు.
మనమందరమూ ఒక్కజట్టుకద
మంచి కలువలూ! మాటలాడరా!

రసీదు రాద్ధాంతం

పాత్రలు

రంగనాథం
సీతమ్మ : రంగనాథం భార్య
విశ్వం : పెద్దకొడుకు
శాంత : కుమార్తె
రవి : చిన్నకొడుకు
నౌకరు కృష్ణుడు
కామాయమ్మ : పొరుగింటావిడ

(రంగనాథం గారి యింట్లో హాలు. రంగనాథంగారు ఈజీచేర్లో కూర్చుని పేపరు చూచుకుంటున్నారు. సీతమ్మ పువ్వులు కట్టుకుంటోంది. విశ్వం నిలువుటద్దం ముందు తల దువ్వుకుంటున్నాడు. శాంత తల్లి ప్రక్కనే కూచుని వారపత్రిక చదువుకుంటోంది.)

రం : (పేపరు మడిచి టేబిలు పైకి విసరి సీతమ్మని చూస్తూ) ఇదిగో! దర్జీ దగ్గరినుంచీ నా సూటింకా రాలేదు గదూ!

సీ : లేదే! ఎప్పుడు పంపిస్తానన్నాడు?

రం : మొన్న సాయంత్రం కాబోలు, అడిగాను. రెండు రోజులలో పంపిస్తానన్నాడు. ఒకవేళ నేను ఆఫీసుకు వెళ్ళిన తరువాత కృష్ణుడు దుస్తులు తీసుకురావచ్చు. ఎందుకైనా మంచిది. ఈ పదిరూపాయల నోటు నీ దగ్గరుంచుకో.

వి : రూపాయలెందుకు నాన్నా!

రం : దర్జీ నారాయణ మన బంధువు కాదురా బాబూ! అతడు మనకు దుస్తులు కుట్టి యివ్వడం, అందుకు యధోచితంగా మనము ప్రతిఫలం ముట్టజెప్పడమూ మామూలు.

వి : కానీ డబ్బు ముట్టజెప్పవలసిన పద్ధతి యిది కాదు నాన్నా!

రం : ఒరే విశ్వం! నా పద్ధతులతో నేను ఏభై ఏళ్లు నిశ్చింతగా కాలం నెట్టేశాను. ఇప్పుడా పద్ధతులు మార్చుకోవాలంటే మారవు.

సీ : పోనీ అబ్బాయిని వాడికి నచ్చిన పద్ధతేదో చెప్పనివ్వరాదటండీ!

వి : అలా అడగాలి మరి! మనకు దర్జీలు, డక్టర్లు మొదలైన వాళ్ళతో ఒకప్పుడు పని వుండి, మరొకప్పుడు ఉండదన్న నమ్మకం ఏమీ లేదు. నెలపొడుగునా వాళ్ళతో మనకు అవసరం తగులుతుంటుంది. నెలాఖరుకి మనమెంత యివ్వాలో బిల్లు వేసి వాళ్లు తపాల్లోనో, నౌఖరు ద్వారానో మనకు పంపిస్తారు.

రం : బిల్లా?

వి : అవును నాన్నా! బిల్లే! బిల్లు చేరిన తర్వాత త్వరగా మనం డబ్బు చెల్లించినట్లయితే మంచి ఫర్మ్లు డిస్కౌంటు గూడ ఇస్తాయి. నెలలో మొదటి వారమంతా మా ఆఫీసులో నాకా డిస్కౌంట్లు లెక్కగట్టడంతోటే సరిపోతుంది.

రం : చూడు విశ్వం! నువ్వొక ఫర్మ్‌లో పని చేస్తూ బిల్లులు తయారుచేసి వాటికి డిస్కౌంట్లు లెక్కగట్టి ఆ వ్యాపార తతంగంలో ప్రావీణ్యం గడించినందుకు నాకు సంతోషమే! కానీ వ్యాపారాన్ని గురించి నాకూ కొన్ని స్వంత అభిప్రాయాలున్నాయి. బాకీలు పెట్టి పద్దులు వ్రాయించుకుని, బిల్లులు తెప్పించుకుని అప్పుడు డబ్బుకోసం వెతుకోడమంటే నాకు తలనొప్పి! నేను అప్పటికప్పుడే డబ్బు చెల్లిస్తాను.

సీ : అవున్రా విశ్వం! బాకీలకు మీ నాన్నగారికి ఎప్పుడూ పొత్తు లేదు. ఓరోజు నేను చేత చిల్లర లేక రెండణాల పువ్వులు అప్పుగా తీసుకున్నందుకు మండిపడ్డారు.

వి : పోనీ, మనం చెల్లించిన డబ్బుకు రసీదయినా పుచ్చుకోడం మంచిది.

సీ : పోనీ, మీరా రసీదేదో, దాన్ని కాస్తా పుచ్చుకోగూడదండీ!

రం : ఐతే ఈరోజు అబ్బాయి చెప్పున్నాడు గదా అని నన్ను దర్జీ నారాయణని రసీదుకోసం పీడించమంటావు! నాకూ నారాయణకీ వున్న లావాదేవీ ఈనాటిది కాదు. లెక్కలో ఒక కాసీ పొరపాటు యింతవరకూ రాలేదు.

వి : నారాయణ మోసగాడని

మూలం :
తామస్ కెయిన్

అనుసరణ :
మధురాంతకం రాజారాం

ఒకడు డాక్టరుదగ్గిరికెళ్ళి తనకి జబ్బేమిటో చెప్పమన్నాడు. డాక్టరు పరీక్షచేసి జబ్బులేదని తేల్చి ఆరోగ్యం బాగా ఉండాలంటే ఈ సలహాలు పాటించమన్నాడు

“ప్రతిరోజూ పావుసేరు ఆవుపాలు తాగి నాలుగుపేజీలు వుడ్‌హౌస్ చదువు. హిందీ సినిమాలు మానెయ్. రాజకీయ నాయకుల ఉపన్యాసాలు, రేడియోలో శాస్త్రీయ సంగీతం వినడం తగ్గించు. మోడరన్ తెలుగు ఫొయిట్రీ జోలికిపోకు.”

యిక్కడెవరూ చెప్పడం లేదు నాన్నా! కానీ అతడికి మీలా ఎందరు ఖాతాదారులు లేరు! ఏమో, అతడు మరచిపోయి మళ్ళీ ఒకసారి మిమ్మల్ని డబ్బడిగితే!

రం: అతడెప్పుడూ అలా మరిచిపోలేదే మరి!

వి: పోనివ్వండి, నారాయణకి మతిమరపే వుండదనుకుందాం—కాని నౌఖరుక్రాడు మనడబ్బును స్వంత ఖాతా క్రింద జమ కట్టుకుని వాళ్లు డబ్బివ్వలేదని నారాయణతో చెబితే? అప్పుడు మీరేం చేస్తారు?

రం: ఏం చిక్కుతెచ్చి పెట్టావురా అబ్బాయీ!

సీ: చిక్కేగదండీ మరి! ఐనా డబ్బంటే మనకింత నిర్లక్ష్యం పనికిరాదండీ!

వి: నువ్వు చెబితే నేగానీ నాన్నగారికి తెలీదమ్మా! చెప్పు రసీదు తీసుకోకుండా డబ్బిచ్చివేయడం మంచిపని కాదు. అందువల్ల ఒకప్పుడు గాకపోయినా ఒకప్పుడు మనం బోల్తాపడకతప్పదు. నా కాఫీసుకు టైం కావచ్చింది. వెళ్తున్నా.

(నిష్క్రమణ)

రం: అమ్మాకొడుకులకి ఏకాభిప్రాయం కుదిరింది. ఇంక నా మాటేం సాగుతుంది. డబ్బు ముట్టజెప్పగానే చచ్చినట్టు నేను రసీదు రసీదంటూ ఎదుటివాణ్ణి పీడించవలసిందే నన్నమాట! హతవిధీ! నీ చేష్టలు దురవగాహంరా బాబూ!

(తలుపుపైన చప్పుడు)

సీ: చూడు శాంతా! ఎవరో వచ్చినట్టున్నారు.

రం: (ద్వారం వైపు చూస్తూ) ఇంకెవరు! ఆ కుర్రాడే. అబ్బాయ్! ఇక్కడికే రా.

కు: (ప్రవేశిస్తూ) షూట్ తెచ్చానండీ!

రం: గుడ్! మాటంటే అలా వుండాలి. చూద్దాం. పార్సెల్ విప్పు. అన్నట్టు బిల్లు, తెచ్చావు గదూ!

కు: పార్సెల్లోనే వుందండీ! ఇదిగో!

రం: ఎంతయింది? ఎంతో ఎందుకవుతుంది! మామూలేగా! ఆ టేబిల్ పైన వుంది చూడు పదిరూపాయల నోటు, తీసుకో. (జేబులో చేయివేసి ఒక బేడ నాణాన్ని పైకితీస్తూ) ఇదిగో నీకు బక్షీసు!

కు: నేను సెలవు తీసుకోవచ్చాండీ?

సీ: సెలవు తీసుకుంటావా! రసీదు యివ్వకనే!

కు: రసీదా!

రం: తెలియదూ! డబ్బు ముట్టినట్టు నువ్వు బిల్లుక్రింద సంతకం పెట్టడమన్నమాట.

కు: అదా! దానికేముందండీ! నా దగ్గరో చిన్న పెన్సిలుండాలి. అరరే దీనికి ముక్కు లేదండీ!

రం: ఉంటే మాత్రం! పెన్సిలుతో నా రసీదివ్వడం? (మేజాసొరుగు తీస్తూ) శాంతా! ఇంకిబాటిల్ ఏదీ?

శాం: రవిని అడగాలి నాన్నా! నిన్న వాడు, వాడి నేస్తాలు తోటలో మల్లెపందిరి కింద ఒక నాటకం వేశారు. ప్రతినటుడూ చెంపకు చేరడేసి మీసాలతో సిద్ధమయ్యాడు.

రం: ఐతే మనం సిరా యింకా మిగిలి వుంటుందని ఆశించడం అవివేకమన్నమాట!

శాం: ఐనా వాణ్ణి అడిగిచూద్దాముండండి. (బిగ్గరగా) ఒరే రవీ! రవీ!

రవి: (ప్రవేశిస్తూ) పిలిచావా అక్కయ్యా!

రం: ఇంకిబాటి లేదీ?

సీ: అదింకా ఎక్కడుంది? ముక్కలైవుంటే ఎత్తిచెత్తతొట్టిలో పోయించాను. డబ్బివ్వండి. తీసుకొస్తాడు.

రవి: అమ్మా అమ్మా! సగం ఆటలో వున్నాను. ఇప్పుడు నేనెక్కడికో వెళ్లాలంటే ఆ బాబిగాడు ఊరుకోడు.

రం: ఊరుకోడూ! నీ దారికడ్డం వస్తే లెంపలు వాగిపోతాయని చెప్పు. ఇదిగో! అర్థరూపాయి. ఇక్కడున్నట్టు తిరిగిరావాలి.

రవి: అలాగే నాన్నా!

(నిష్క్రమణ)

కు: రసీదుని సాయంత్రం పంపించుకోడానికి వీలుందాండీ!

రం: ఎందుకూ! ఒక నిమిషం తాళుకో అబ్బాయ్! శాంతా! నా కలం ఎక్కడ పెట్టానో చూడు.

★ రసీదు రాద్ధాంతం ★

సీ: మీదొకపాడు! దానికెక్కడ తీరుతుందండీ పాపం! ఆ గ్రంథమేదో కాస్తా పూర్తి కానీ!

శాం: లేదులేవే అమ్మా! ఇప్పుడు నీకొచ్చిన చిక్కల్లా నా చదువుతోనే! పోనీలే. కలం ఎక్కడుంది నాన్నా!

రం: అదే నాకూ తెలియడంలేదు.

శాం: నీకేమైనా తెలుసా అమ్మా?

సీ: నాకెందుకే తల్లీ కలాలూ, కాగితాలూను! ఆ అలమారులో చూచినట్టు జ్ఞాపకం. ఉందేమో చూడు.

శాం: ఉంది వుంది.

రం: రైట్! ఇలా తీసుకో.

శాం: లాభం లేదు నాన్నా! పాళీ విరిగిపోయింది. బహుశా మన రవీంద్రబాబు నిన్ననో మొన్ననో ఒక కావ్యం వ్రాసినట్టున్నాడు.

రం: గీతాంజలి కాదుగదా!

రవి: (ప్రవేశిస్తూ) తెచ్చేశాను నాన్నా!

రం: చేశావుగానీ ఘన కార్యం, ఈసారి రెండు పాళీలు తీసుకుని త్వరగా రా! చిల్లర మిగిలింది కదూ!

రవి: మళ్లీ వేసేనా! అక్కయ్యే వెక్కేసేం నాన్నా!

రం: ఒరే రవీ! నేను చెబుతున్నాను. నువ్వు వెళ్ళాలి. అంతే!

రవి: (ఏడుపు ముఖంతో నిష్క్రమణ)

హను: (ప్రవేశిస్తూ) సీతమ్మగారూ! ఇంటినిండుకూ బంధువులు దిగబడ్డారు. డికాక్షను మరుగుతోంది.

సీ: పంచదారే కదండీ! (లోపలికి వెళ్తుంది)

కు: బాబూ! ఈరసీదుగొడవతో పొద్దే పోతోందండీ!

రం: (చిరాకుతో) పోనీ లేవోయ్! (తెప్పరిల్లుకుని) ఆఁ ఏమిటబ్బాయ్! ఈపాటికి మావాడొస్తుంటాడు. అదిగో వచ్చేశాడు. ఏవిరా ముళ్లు?

రవి: ఇవిగో నాన్నా!

రం: (కలానికి పాళీ వేసి) అబ్బాయ్! బిళ్ళందుకో. అక్షరాలా పదిరూపాయలుముట్టినవి అని వ్రాసి సంతకం పెట్టాలి. తెలుసు కదూ!

హను: ఏమిటండీ అది! రసీదా?

సీ: (హాల్లోకి వస్తూ) రసీదు పుచ్చుకోడం ఎందుకైనా మంచిది కదండీ హనుమాయమ్మ గారూ! గిన్నె తీసుకోండి.

హను: అదిసరేనండీ సీతమ్మగారూ! కానీ పదిహూపాయల రసీదుకు పట్టి సంతకం పెట్టించుకోడమేమిటి! రివెన్యూ స్టాంపేదీ!

రం: డేంజర్, డేంజర్! అది కూడా కావలసిందేనటండీ!

సీ: హనుమాయమ్మ గారు ఊరికే చెబుతుందాండీ మరి!

రం: చెప్పదు, చెప్పదు. ఒరే రవీ!...వాడు దూరదేశమే వెళ్ళినట్టున్నాడు. శాంతా! వంతునీది. పోస్టాఫీసుదాకా వెళ్ళిరావాలి.

శాం: వెళ్ళకేంచేస్తాను నాన్నా! ఈరోజు మనమందరం ఏ ఏబ్రాసి ముఖమో చూచి లేచినట్టున్నాం!

కు: మీ సంగతి ఏమోగానీ నాకుమాత్రం ఇది మహా చెడ్డదినమే అయిపోయిందండీ! ఇంత ఆలస్యమైనందుకు నేనేం సంజాయిషీ చెప్పుకోవాలో తెలియడం లేదు.

రం: నారాయణతో నేను చెబుతా లేవోయ్!

సీ: ఐనా ఒక రసీదు పుచ్చుకోడంలో యింత శ్రమ వుంటుందని నే ననుకోలే దబ్బాయ్!

రం: శ్రమయితేనేం! శ్రమ అని దేవతలు పాలసముద్రం తరచడం వదలిపెట్టారా?

శాం: (ప్రవేశిస్తూ) స్టాంపు ఇదిగో నాన్నా!

రం: రైటో! (బిల్లుపైన స్టాంపు అతికించి) కానీయ్ అబ్బాయ్! సంతకం పెట్టు.


కు: (సంతకం చేస్తాడు)

రం: ఇదిగో శాంతా! కొండని త్రవ్వి ఎలుకని పట్టేశాను (కాగితాన్ని పైకెత్తి) అమూల్యమైన ఈ రసీదుని అందరూ ఒకసారిచూడాలి.

సీ: గారడీవాడిలా చేతులు తట్టమనరుకదా!

రం: ఇది పుచ్చుకోకపోతే విశ్వంకొంప మునిగిపోతుందన్నాడు. నువ్వు వాడి పాటకి తాళం వేశావు. మీ తృప్తికోసం ఈ రసీదుని సంపాదించాను. ఆలసించిన ఆశాభంగం. అందరూ కళ్ళు తెరిచి చూడండి! వన్, టూ, త్రీ! (ముక్కలుగా చించి రసీదుని గిరవాటు కొడ్తాడు)

(తెర) ★



28

అష్టపాద జంతువుల అలజడి

క్రౌన్సెలు ఎంత చెప్పినా నెడ్ లాండ్ తనపట్టు విడవలేదు. అష్టపాదజంతువులవంటి భయంకర ప్రాణులన్నీ వట్టి అభూత కల్పనలే అని కొట్టి పారవేశాడు. అయితే అలాంటి జంతువులను గురించిన గాథలు బాగా ప్రసిద్ధి కెక్కాయి. బ్రిస్టీ వస్తుప్రదర్శనశాలలో 6 అడుగుల పొడవుగల అష్టపాద జంతువుల అస్థిపంజరా లున్నాయి.

ఒక శాస్త్రజ్ఞుడీ జంతువులకబంధ హస్తాలిరవైయేడు అడుగులపొడవుం టాయనిఅన్నాడు. ఈవిషయాలన్నీ కౌన్సెలు నెడ్‌లాండ్‌తో చెప్పాడు. నెడ్‌లాండ్ అతడు చెప్పేదంతా శ్రద్ధగా విన్నాడు. కాని మళ్లీ తన ధోరణి మానలేదు:

"ఇంతకీ వాటిని బతికి ఉండగా పట్టుకున్న వాళ్లెవళ్ళయినా ఉన్నారా?"

"ఎవరు పట్టుకోలేదనుకో! కాని వాటిని కళ్ళారా చూచిన నావికు లెందరో ఉన్నారు. అయితే అవి తప్పకుండా ఉన్నాయనడాని కొక పెద్ద దాఖలా కనబడింది!"

"ఎప్పుడు?"

అనువాదం: "వినాయక"

"1861 లో ఇంచుమించుగా మనమిప్పుడున్న ప్రదేశంలో అలాంటి జలజంతువొకటి కనబడింది. ఆ సమయంలో కొందరు నావికు లలాంటి జంతు విక్కడ ఉన్నదని పసిగట్టారు. ఒక నౌకాధికారి ఆ జంతువు నెదుర్కొన్నాడు. దానిమీద ఎన్ని ఫిరంగి గుళ్లు ప్రయోగించినా ఏమీ ప్రయోజనం కనబడలేదు. కొంత ప్రయత్నించినమీదట ఆ జంతువుమీది కొక వల విసరివేశారు. అది వలలో పడింది. కాని అది పైకి లాగబోయే సరికి ఆ జంతువు నీటిలో మునిగి పోయింది."

"మొత్తం మీద కొంతవరకు నమ్మదగిన సంగతే చెప్పావు"

"కొంతవర కేమిటి? ఇది పూర్తిగా నమ్మదగిన సంగతే!"

"దాని పొడవెంత?"

"ఇంచుమించుగా పద్ధెనిమిది అడుగులు."

"దాని తలమీద ఎనిమిది కబంధహస్తా లున్నాయా? అవి నీటిలో పెద్ద పెద్ద సర్పాలలాగ అటూ ఇటూ కదిలాయా?"

"ఆఁ కదిలాయి." అని కౌన్సెలు కిటికీలోనించి సముద్రతరంగాల కేసి చూశాడు. అతని కక్కడ యేదో అత్యద్భుతజంతువు కనిపించింది.

జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచ ప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకల కది ఇక్కడ కనిపించి ఇట్టే మాయమయ్యేది. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడాని నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్ తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్ లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళవర్షం కురిపించారు. అబ్రహామ్ లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సిల్ నెడ్ లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బైటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి. ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. జలాంతర్గామి వానికోరో ద్వీపంమీదుగా వెళ్ళి గిల్బోవా ద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు. ముగ్గురు గిల్బోవా ద్వీపంలో వేటముగించుకొని వస్తూ ఉండగా హఠాత్తుగా ఒక రాయి వారిదగ్గర పడుతుంది. పిమ్మట కెప్టెన్ నీమో వజ్రాయుధంతో ఆటవికుల నందరినీ హడలగొట్టివేస్తాడు. క్రమంగా జలాంతర్గామి పగడాలదీవి చేరుకుంటుంది. చనిపోయిన నావికుని శవానికి అక్కడ సమాధి ఏర్పాటుచేస్తారు. కెప్టెన్ నీమో మన్నారు సింధుశాఖలో ఒక పెద్దముత్యం సంపాదిస్తాడు. పిమ్మట ఎంతో చాకచక్యంతో ఒక బెస్తవాని ప్రాణాలు సంరక్షిస్తాడు. పిమ్మట జలాంతర్గామి మధ్యధరాసముద్రందాటి అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. తరవాత జలాంతర్గామి నావికులు విగో అఖాతంలో మునిగి వెండిబంగారాలపోగులు సేకరిస్తారు. కెప్టెన్ నీమో ప్రొఫెసర్ అరోనాకు అట్లాంటిస్ ఖండం చూపిస్తాడు. జలాంతర్గామి సముద్రం అట్టడుగున ఉన్న బొగ్గుగనులలోనించి బొగ్గు నింపుకుంటుంది. క్రమంగా దుర్భేద్యమైన మంచుకొండ అడుగునించి ప్రయాణంచేసి దక్షిణధ్రువం సమీపిస్తుంది. తరువాత కెప్టెన్ నీమో దక్షిణధ్రువం కనిపెట్టి అక్కడ తన జండా ఎగరవేస్తాడు. జలాంతర్గామి దక్షిణధ్రువం దగ్గిరనించి మళ్ళీ తిరుగుప్రయాణం సాగిస్తుంది.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

ప్రొఫెసర్ అరోనా కేసి, నెడ్ లాండ్ కేసిచూసి తొందరగా అన్నాడు:

"మీరు కనక చూడాలనుకుంటే ఆ అష్టపాదజంతు విదిగో!"

నేను నిర్ఘాంతపోయాను. నెడ్ లాండ్ ఒక్క దూకులో కిటికీ దగ్గిరికి పరుగెత్తుకుపోయాడు:

"ఎంత భయంకరంగా ఉందో!" అన్నాడు.

నిజానికది చాలా పెద్ద జంతువు. అధమం 32 అడుగులపొడవైనా ఉంటుంది. అది నాటిలస్ వైపు చూస్తూన్నది. దానికళ్ళు పసిడిపచ్చని ఆకుల్లా మెరుస్తున్నాయి. దానినోరు రవ్వంతప్పుడు తెరుచుకోవడం మొదలుపెట్టింది. పళ్ళు తెల్లని కత్తెరల్లా తళతళా మెరిశాయి! శరీరం బరువు 50 వేల పౌనులవరకు ఉండవచ్చును. రంగు మాటి మాటికీ బూడిదరంగులోనించి ఎర్ర రంగులోకి మారిపోతూంది.

ఏదో అదృష్టవశాత్తు ఆ భయంకరజంతువు మా జలాంతర్గామి దగ్గిరికి వచ్చింది. బహుశః మా జలాంతర్గామి కనిపించగానే దానికి పట్టరాని కోపం వచ్చిందేమో! ఎవరు చెప్పగలరు? ఏమైనా నేను జాగ్రత్తగా ఆ జంతువు స్వభావం పరిశీలించాలని నిశ్చయించాను.

"వెనక ఈ ప్రాంతంలో తిరిగే ఓడకు కనిపించిన జంతువిదేనేమో!" అన్నాడు కౌన్సెల్.


"కాదు! దీని అవయవాలన్నీ చెక్కు చెదరకుండా అలాగే వున్నాయి! వెనక కనిపించిన అష్టపాదజంతువుతోకవలలో చిక్కుకుని విరిగిపోయిందిగా!" అన్నాడు నెడ్ లాండ్.

"ఏమో ఆ తోక మళ్ళీ పెరిగిందేమో!" అన్నాను.

"అది కాకపోతే ఇది మరి ఒకటి అయివుంటుంది" అన్నాడు నెడ్.

అంతలో అలాంటి జంతువులు మరికొన్ని మా కెదురుగా ప్రత్యక్షమైనాయి. నేను వరసగా వాటి నన్నిటినీ లెక్కపెట్టాను. నాకు కనిపించినవి ఏడు అష్టపాద జంతువులు. ఇంతకుపూర్వం కనిపించినదానితో కలిపి మొత్తం ఎనిమిది జంతువులు! అవన్నీ నాటిలస్ వెంటపడ్డాయి. అలాగే మా వెనకాలే వచ్చాయి. నాకు వాటి ఆకారాలన్నీ స్పష్టంగా కనిపించాయి.

అంతలో హఠాత్తుగా మా జలాంతర్గామి ఆగిపోయింది. ఆ అఘాతంతో లోపలివాళ్ళంతా గజగజ వణికిపోయారు.



మేమంతా ఎంత భయంకరంగా ఆ జంతువుతో పోరాడాము! మా శరీరాలన్నీ రక్తంతోను, మాంసంతోను తడిసి ముద్దయిపోయాయి.

"మనం ఇక్కడ చిక్కడిపోయామేమో!" అన్నాను. "తేలుతున్నాము కాబట్టి కొంతసేపట్లో మళ్ళీ కదిలిపోవచ్చు" అన్నాడు నెడ్ లాండ్.

జలాంతర్గామి తేలుతూనే ఉంది కాని ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదు అంతలో కెప్టెన్ నీమో మాదగ్గిరికి వచ్చాడు

నేనతన్ని చూచి చాలా రోజులయింది మనిషి బాగా దిగులుగా ఉన్నట్టు కనబడ్డాడు కాని అతడు మాకేసి చూడనైనా చూడలేదు. ఆ అష్టపాద జంతువులకేసి చూసి తనపక్కనే నిలబడిన ఓడ అధికారితో ఏదో మాట్లాడాడు ఆ అధికారి అక్కడినించి వెళ్ళిపోయాడు నేను నెమ్మదిగా కెప్టెన్ దగ్గిరికి వెళ్ళాను:

"ఆ జంతువులన్నీ మన మీద విరుచుకుపడ్డట్లున్నాయే" అన్నాను

"అవును! ప్రొఫెసర్! ఇప్పుడు మనం వాటి అన్నింటికీ ఎదట నిలబడి పోరాటం సాగించాలి."

"పోరాటం సాగించాలా?" అని అడిగానెంతో ఆశ్చర్యపోతూ.

'ఆ జంతువులలో ఒకదాని కబంధహస్తం మన జలాంతర్గామి యంత్రాలలో చిక్కుపడింది. అందుచేతనే మన జలాంతర్గామి నడవడంలేదు"

"అయితే మనమిప్పుడేం చెయ్యాలి?"

"జలాంతర్గామి టాపు మీదికి వెళ్ళి ఆ జంతువులనన్నిటినీ ముక్కలు ముక్కలుగా నరికి వెయ్యాలి"

"అయితే ఇది చాలా గడ్డు సమస్యే!"

"విద్యుచ్ఛక్తితో తయారుచేసిన తుపాకీగుళ్ళు వాటినేమీ చెయ్యలేవు. అందుచేత వాటిని గండ్రగొడ్డళ్లతో నరికివెయ్యవలసిందే!"

"నేనుకూడా నా ఆయుధాలతో సాయపడతాను" అన్నాడు నెడ్ లాండ్

"తప్పకుండా! నీ సహాయం మాకు కావాలి!" అన్నాడు కెప్టెన్.

"మేమంతా మీతో వస్తాము." అని చెప్పి మేమంతా కెప్టెన్ నీమో వెనకాలే వెళ్ళాము అక్కడికి వెళ్ళినతరవాత పదిమంది నావికులు గండ్రగొడ్డళ్ళు చేత్తో పట్టుకుని మా వెనకాలే నడిచివచ్చారు. మేముకూడా తలో గండ్రగొడ్డలి చేత బుచ్చుకొన్నాము.

సరిగా అదే సమయంలో ఒక అష్టపాద జంతువుకు సంబంధించిన తొండం నాటిలస్ టాపుమీదికి వచ్చింది. కెప్టెన్ నీమో వెంటనే అది ముక్కలు ముక్కలుగా నరికి వేశాడు.

మేమంతా నాటిలస్ టాపు మీద గుమిగూడాము కొంత సేపటికి ఒక అష్టపాదజంతువు తొండం మాలో ఒక పనిమనిషిని చుట్టబెట్టి లాగడం మొదలుపెట్టింది

అది చూడగానే కెప్టెన్ నీమో ఒక్క కేకపెట్టి ఆ నావికుని సంరక్షణకోసం అతని దగ్గిరికి వెళ్ళిపోయాడు

ఏమి భయంకరదృశ్యం! పాపం

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

ఆ నావికుడు అష్టపాదజంతువు తొండంమెలిలో చిక్కుకుపోయి "రక్షించండి! రక్షించండి!" అని కేకలు పెట్టాడు

ఆ కేక ఫ్రెంచిభాషలో పెట్టిన కేక! అది వినగానే నాగుండె జలదరించింది. పాపం ఆ నావికుడు చాలా అసహాయ స్థితిలో పడిపోయాడు! అతనిని ఎవరు రక్షించగలరు? చివరికి కెప్టెన్ నీమో తెగించి ఆ అష్టపాదజంతువు మీద విరుచుకుపడ్డాడు దాని తొండం ముక్కలు ముక్కలుగా నరికివేశాడు. కెప్టెన్ నీమో కింది ఉద్యోగి మిగిలిన అష్టపాద జంతువులతో పోరాడుతున్నాడు మిగిలిన నావికులు కూడా వాటితో పోరాడుతున్నారు.

పాపం ఆ నావికుడు ఒక్క దెబ్బతో సముద్రంలో పడిపోవలసిందే! మిగిలిన నావికులు ఆజంతువు తొండాలు ముక్కలు ముక్కలుగా నరికివేశారు మిగిలిన ఆ ఒక్క తొండము ఆకాశంలో అల్లలాడుతూంది అంతలో ఆ జంతువు నల్లనల్లని ద్రవమేదో మా అందరి మీదికి చిమ్మివేసింది క్షణ కాలం దాకా మా కళ్ళు కనబడలేదు. మళ్లీ కొంత సేపటికి కళ్లు తెరచి చూచేసరికి నావికుడదృశ్యుడై పోయాడు. ఇంతమందీ ఏకమయినా మేమతన్ని సంరక్షించలేక పోయాము!

మేమంతా ఎంత భయంకరంగా ఆ జంతువుతో పోరాడాము! మా శరీరాలన్నీ రక్తంతోను, మాంసంతోను తడిసి ముద్దయిపోయాయి. నెడ్‌లాండ్ ఒక్కొక్క బల్లెపు పోటుతో ఒక్కొక్క అష్టపాద జంతువు కన్ను పచ్చడిచేసి వేశాడు అంతలో ఒక అష్టపాదజంతువతన్ని తన తొండంతో అమాంతంగా వెనక్కి తోసివేసింది. కాని అతడెలాగో అలాగ ఆ దెబ్బ తట్టుకుని కాళ్లు రెండూ నిలవదొక్కున్నాడు.

అంతలో ఇంకొక అష్టపాగ జంతువతన్ని మింగెయ్యడానికి నోరు తెరిచింది. నెడ్‌లాండ్ ఎంతో చాకచక్యంతో దాని నోటిలో బల్లెంతో ఒక్కపోటు పొడిచాడు ఆ దెబ్బతో అది గిలగిలా తన్నుకుని అక్కడే పడిపోయింది.

నాకా భీభత్సదృశ్యం చూచేసరికి కళ్లుతిరిగిపోయాయి ఆవిధంగా ఆ జంతువులతో యుద్ధం ఒకపావు గంటసేపటిదాకా సాగిపోయింది.

చావుదెబ్బలు తగిలిన అష్టపాద జంతువులన్నీ హడలిపోయి సముద్రంలోకి పారిపోయాయి.

కెప్టెన్ నీమో శరీరం అంతా రక్తంతో తడిసిపోయింది.

అతడలాగే సముద్రంకేసి చూస్తున్నాడు పాపం సముద్రంలో ఆ జంతువులకు బలి అయిపోయిన ఆ నావికుని దురదృష్టం తలుచుకోగానే అతని రెండు కళ్లూ కన్నీటితో నిండిపోయాయి

—ఇంకా ఉంది.

అతివృష్టి, అనావృష్టి

పూర్వం ఒకానొక నగరంలోని ప్రజలందరూ చాలా చురుగ్గా ఉండేవారు.

నడిచి వెళ్ళి చేసే పనులన్నీ వాళ్లు పరుగెత్తి వెళ్లి చేసేసేవారు వాళ్ళ భోజనానికి ఒక్క నిముషంకన్నా ఎక్కువ పట్టేది కాదు. ఎంత పెద్ద పుస్తకమైనా ఒక గంటలో చదివి పారేసేవారు అక్కడి కవులంతా నిద్రపోతూన్న సమయంలో కూడా కావ్యాలూ కథలూ అల్లేసేవారు. పనివాళ్లు ఎంత బరువైన పని ఐనా ఒక్క క్షణంలో చేసిపెట్టేసి, 'ఇంకా పని చెప్పండి!' అని అడిగేవారు.

పని అంతా ఇట్టే ఐపోతూ ఉండడంవల్ల ఎవడికీ తగినంత పని లేనట్టుగా కనపడేది ప్రజలకు ప్రొద్దస్తమానం చేతినిండా పని ఉండేటట్టు చెయ్యకపోతే నిరుద్యోగ సమస్య వచ్చి దానిమూలాన ఏ ఉపద్రవమైనా రావచ్చు. 'నిముష నిముషానికీ కొత్త పని కల్పించడమన్నా కష్టమే గనుక, ప్రజలలో ఉండే చురుకుతనమే తగ్గించాలి' అని ఆ నగరం రాజుగారు నిశ్చయించుకున్నారు

'ఇది ఎలా సాధ్యమౌతుంది?' అని రాజుగారు మంత్రితో ఆలోచించారు.

"ప్రజలకి బద్ధకం అలవాటయేటట్లు చేస్తే సరి ఒక చాటింపు వేయిద్దాం" అన్నాడు మంత్రి.

ఆ మర్నాడు నగరమంతటా, "బద్ధకస్తులకు బహుమతీలూ, బిరుదులూ, ఉద్యోగాలూ ఇస్తారు టోహోయ్, రాజుగారు!" అన్న చాటింపు వినిపించింది

ఆ నగరప్రజ ఎందులోనైనా చురుకైనవాళ్లే గనుక ఆ చాటింపును వినీ వినడంతోనే ఇట్టే సోమరితనాన్ని అలవాటు చేసేసుకున్నారు!

పాలంకి వెంకట రామచంద్రమూర్తి

ఆ సంవత్సరం తమ జన్మదినోత్సవ సమయంలో రాజుగారు ఇచ్చిన బిరుదులన్నీ పాత ఫక్కీలో కాక, బద్ధకం సంపాదించడంలో నేర్పుచూపినవాళ్ళకే ఇవ్వబడ్డాయి. 'బద్ధకప్రవీణ', 'బద్ధక శిరోమణి', 'బద్ధక మహామహోపాధ్యాయ' - ఇలాంటి బిరుదులన్నీ చాలామంది సంపాదించుకోకలిగేరు.

దరిమిలా ఒకనాడు రాజుగారు మంత్రిని వెంటబెట్టుకుని షికారుకు వెళ్ళేరు వారికి ఎక్కడ చూసినా నిద్రమొద్దులూ, ద్రాపిగాళ్ళూ, బడుద్ధాయిలూ ఎదురై, కూచున్న వాళ్లు లేవలేకుండానూ లేచినవాళ్లు అడుగు వెయ్యలేకుండానూ ఉండి, క్షణక్షణానికీ ఆవులిస్తో కనపడ్డారు.

వాళ్ళని చూసేసరికి రాజుగారికి ఒక సరదా పుట్టింది మంత్రితో "వీళ్ళలో మిక్కిలి బద్ధకస్తుల్ని ముగ్గుర్ని ఏరండి బహుమతీలు ఇద్దాం" అన్నారు.

మంత్రి ఒక్కసారి పరికించేసరికి, ఒక చోట కాలు అంతా కాలిపోయి పెద్ద పుండుఐన ఒక మనిషి కనపడ్డాడు. "ఏమిరా అబ్బీ, నీ కాలు ఇలాగ ఎందుకు కాలింది?" అని అడిగేడు మంత్రి.

వాడు, "రాత్రి చలి కాగుతున్నాం ప్రభూ. 'మంట దగ్గరసా వచ్చింది. కాస్త జరుగు!' అంది నా భార్య బద్ధకంగాఉండి, 'ఆ, ఎవడు జరుగుతాడు!' అని అక్కడే ఉండిపోయాను. గుడ్డా, గుడ్డతో బాటు కాలూ అంటుకున్నాయండి." అని చెప్పి, ఆవులిస్తో ఒక్కసారి కళ్లు మూశాడు. వాడి నిద్రకు భంగం కలిగించడంఎందుకని తోచి, రాజుగారు ఒక నూరు వరహాలు బహుమతీగా వాడి కొంగున మూట కట్టించి మంత్రితో ముందుకు సాగేరు.

పది బారలు వెళ్లేసరికి జోడు తొడుక్కుని నడుస్తూన్నవాడొకడు కుంటుతూ ఎదురయ్యాడు.

మంత్రి, "ఏమోయ్, కుంటుతున్నావు?" అని అడిగేడు

"చెప్పులో సూదిలాంటి రాయి

(48-వ పేజీ చూడండి)


వనితా లోకం

ఆడపిల్లల చదువులో అవసరమైన మార్పులు

ఆడపిల్లలకు చదువులవసరం అనే ఛాందసులు నేడు లేరు, కాని కాలేజీ చదువులంటే ఝడిసేవారుమాత్రం చాలమందివున్నారు. కాలేజీలో చదివే ఆడపిల్లలంటే, క్రమేపి స్వాతంత్ర్యపరిధుల్ని దాటి, స్వేచ్ఛావిహారులై పోవడమే కాక, వారుకూడ కేవలం పురుషులవలె వుద్యోగాలకు పనికివచ్చే యంత్రాలుగా తయారయే ధోరణి కనబడుతున్నది. అలాంటివారికి గృహసంరక్షణ లలితకళలంటే తెలియవు. నేర్చుకోవాలన్న శ్రద్ధా, ఆపేక్ష వుంటే తప్ప, అవి తెలిసికోనే ఆస్కారంకూడా లేదు. అటువంటప్పుడు యీ విద్యావతులకు పెళ్ళిళ్ళయి ఇల్లు చక్కబెట్టుకోవాలంటే ఎంత క్లేశమో చెప్పనవసరం లేదు. దానికి ఝడిసి చాలామంది పెళ్లికే దూరంగా వుంటున్నారంటే తప్పులేదేమో.


ఇంటిని పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచుట ఇంటికి వచ్చినవారితోనూ, ఇరుగు పొరుగు వారితోనూ, సుహృద్భావము కలిగి, సభ్యత తెలిసి నలుగురితో కలసి మెలసి ఉండుట నౌకర్లను దయతో చూచి నమ్మకంగా వారిచే పనిచేయించుకునే తీరు ఉండుట, ఇవి సంసారములో ముఖ్యమైననైనా పైకిమాత్రం అతి సామాన్యంగా కనిపిస్తాయి. అన్నిటికన్నా ముఖ్యమైనది వంట. కాని దీనిని చాలమంది అతి తేలికగా, కొన్ని సమయాల్లో నీచంగా చూడడంకద్దు.

'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అనే సూత్రం అందరికీ తెలిసిందే. ఆహారవిషయంలో ఎటువంటిజాగ్రత్త తీసుకోవాలో తెలిసినదేకాని తీరా అది ఆచరణలో పెట్టే సమయానికీ ఎక్కడలేని అశ్రద్ధ, బద్ధకోలు బయలుదేరుతాయి. ఇక పిల్లల సంరక్షణ, పోషణ సరిగ్గా గమనిస్తే ఇది ఒక ప్రత్యేకకళ అని చెప్పవచ్చు. దీనికి ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలి. పెద్ద చదువులు చదివిన తల్లులు తమపిల్లల పెంపకాల్లో ఎంత అనాదరణ వహించి ఆయాలమీద ఆధారపడివుండడం మనం నిత్యం చూస్తున్నదే. దినమెల్లా పనితో అలసిన పెనిమిటికి యింటికిరాగానే ఆనందాన్ని కలిగించి, ఆప్యాయంగా ఆదరించి, అతని అలసటలను పారద్రోలి నవోత్సాహం కలిగించే శక్తిని కలిగి, అతనికి చేదోడువాదోడుగా వుండాలి. పైఅంశాల్లో ఏమాత్రం పరిచయం అనుభవం లేని యీ విద్యావతుల్ని పెళ్లిళ్లు చేసుకున్న యువకులు మొదట్లో సర్దుబాటుగాపోయినా క్రమేపి వారిలో ఓర్పుతగ్గి, అసంతృప్తి, విద్వేషాలు చెలరేగి ఆఖరికి యింటే నరకప్రాయంగా తయారయి, ఇరువురి జీవితాలు దుఃఖభూయిష్టమై పోతున్నవి. అన్యోన్యంగా సాగుతున్న సంసారములు లేవని చెప్పడంలేదు కాని వాటికన్న యీవిధమైన సంసారాలే హెచ్చుగాకనబడుతున్నాయి. ఇటువంటివారికి విడాకులచట్టం సుదర్శనచక్రంలాగ కనబడుతూంది. కొన్నిచోట్ల వ్యక్తిస్వాతంత్రమనే పేరుతో దూరపుచూపులేక ఎవరికివారే వరాన్వేషణం సాగించి పెండ్లాడి, ఆత్మశాంతికీ, సంఘానికి దూరం అవడం జరుగుతూంది.



వీటన్నిటినీ పరిష్కరించుటకు నేటి విద్యావిధానంలో మార్పు చాలఅవసరము. విద్యాధికారులు నేటి ఆర్థిక సాంఘిక జీవనానికి దోహదమిచ్చే సరియైన పథకాలను తయారుచేసి, స్త్రీవిద్యాసంస్థల నెలకొల్పి, భారతస్త్రీల పూర్వపు ఔన్నత్యమును పునరుజ్జీవింప చేయవలయును. లలితకళలు, గృహసంరక్షణ, శిశుసంరక్షణలకు ప్రాముఖ్యతనిచ్చే విద్యాబోధనము గరిపిన, స్త్రీ తన జీవితమును సౌఖ్యవంతంగాను, తనగృహాన్ని ఆనందవిహారంగా నిర్మించుకోగలదు. ఈవిద్యాసంస్కరణవలన నేడు బాధిస్తున్న కొన్ని సమస్యలుకూడ పరిష్కరింపబడగలవని నమ్మవచ్చును. ఇంటగెలిచి రచ్చగెలుమన్నటు స్త్రీ మొదట తన గృహావరణముల సంస్కరించినపిదప బాహ్యావని సంస్కరింపబూనుట సర్వవిధాల శ్రేయస్కరము.

★



అందముతో, మధుర మరందముతో
మందారము కనువిందై విరిసెను.

విలువైన సలహాలు

కాలం; పొదుపు

బద్ధకం ఎక్కడయినా ఏమయినా రాణిస్తుందేమో గాని గృహనిర్వహణలో మాత్రం నూటికి నూరు పాళ్ళూ తగనిది. ఈ బద్ధకం మూలంగా విలువైన కాలం కర్పూరంలా హరించి పోతుంది. చాలా సంసారాలకి డబ్బు ఎటా పొదుపు చెయ్యాలీ అని తగని ఆలోచనలు వేధిస్తాయి. అంతేగాని కాలాన్ని ఎలా పొదుపు చేయాలో తెలీదు. అసలు ఈ సమస్యే చాలా మందికి తట్టదు. డబ్బుని పొదుపు చేయకపోవడంతో ఎంతగా బాధ పడతారో కాలం విలువ గుర్తించక పోవటం వల్లా అంతే. అయితే, డబ్బు పొగుపు వల్ల లాభం కళ్ళ ఎదుట కనిపిస్తుంది; ఇదిమాత్రం పరోక్షంగా ఉండటం చేత తెలుసుకోలేం.

మా పొరుగింటి చూడమ్మ వదినె కాలం పొదుపు చేసేతీరు చూస్తే ముచ్చటేస్తుంది. పదింటికల్లా వంటా వార్పూ ముగించి ఇంకో గంటకల్లా భోజనాల తతంగం పూర్తి చేసి చెంబూ తప్పేలా ఎక్కడవక్కడ సర్దేస్తుంది. ఆపైన మధ్యాహ్నం కునుకు తీయడం నేనెన్నడూ చూళ్ళేదు. వంటింటి నుంచి దక్కొచ్చి ఏకులబుట్ట తీసుకొని రాట్నం ముందు కూచుంటుంది. అలా ఆ రాట్నం మోత మళ్ళీ అన్నం వండే వేళదాకా మా ఇంటికి వినిపిస్తూనే ఉంటుంది. ఎవరేనా మంతనాలకీ, కబుర్లకీ వస్తే వారినలా మర్యాద చేసి కూచోబెట్టి తన కదురుని 'గర్ర్' మనిపిస్తూనే ఉంటుంది. అంచేత అమ్మలక్కలెవరూ ఊసుపోక కబుర్లతో పొద్దుపుచ్చడానికి ఇక్కడికి రారు. వచ్చినవాళ్ళెవరూ గంటలతరబడి కూచోనూ లేరు. చూడమ్మ మాత్రం మందహాసంతో అలా వడుకుతూనే ఉంటుంది. ఆమె అలా వడికేస్తుంటే నేనే లేసులల్లుతూనో, ఏడిజైనో కుట్టుకుంటూనో గంటలతరబడి మాట్లాడ బుద్ధవుతుంది. ఆమె వడికిన దారం సన్నగా నాజూగ్గా ఉంటుంది. ఇదే దారం ఆమె ఇంట్లో దాదాపు చాలావరకు వినియోగిస్తుంది. కుషన్ కవర్లు మొదలు పిల్లల చొక్కాలదాకా ఖద్దరు గుడ్డలే వాడుతారు. చూడమ్మగారింట్లో ఖద్దరుబట్టలు ధరించడం ఇప్పుడు సర్వత్రా వ్యాపించి పోయిందిగాని చూడమ్మగారింట్లో ఏనాటినుంచో పుష్కలంగా వాడబడుతూంది.

కుంపటి ముట్టించడానికి ప్రతిసారీ ఇంతంత కిరసనాయిలు కాల బెడతారు. బస్తీలలో ఎలానూ సాధ్యపడదుగాని, ఇక్కడ చూడమ్మ తీరిక వేళల్లో పిడకలు చేసుకొంటుంది. వీటివల్ల అటు వంట చెయ్యకూ అంత ఖర్చుగాదు, ఇటు డబ్బాలకి డబ్బాలు కిరసనాయిలూ తగలెయ్య అవసరముండదు. సునాయాసంగా కుంపటి ముట్టించవచ్చు.

ఇహ మా ఇంట్లో అంటారూ? కాలాన్ని నీళ్ళలా వాడేసే మనుషులు. చూడమ్మగారింటి ప్రక్కన, మాలాంటివాళ్లు ఉండడం నాకు సిగ్గేస్తుంది. మా ఇంట్లో నేను చిన్నదాన్ని. నేను చెప్పినా విని వినట్లు ఖాతరు చెయ్యరు. మా ఇంట్లో ఆడవాళ్లు పగలంతా సుష్టుగా నిద్రపోతారు, పనీపాటా

జయప్రద

చేతిసంచుల సొగసులు





ఇటీవల ఆఫెన్ బాచ్ (జర్మనీ)లో జరిగిన తోలుపరిశ్రమ ప్రదర్శనంలో పలువురిని ఆకర్షించిన "లెదర్ హాండ్ బాగ్స్" ఎడమవైపు చిత్రంలో సంచి, కాఫ్ లెదర్‌తో చేసినది. ఈ తోలు ఎక్కువగా, భారత దేశంనుండి జర్మనీకి ఎగుమతి అవుతుంది. కుడిబొమ్మలో సంచి మొసలి చర్మంతో తయారు చేసినది. ఈ చర్మ పరిశ్రమలో యూరప్ మొత్తంమీద జర్మనీదే అగ్రస్థానం.

★ [illegible] దుపు ★

లేకుండా. అయితే అంతగా పగలు నిద్ర ఎలా వస్తుందంటారేమో! మాది పెద్ద కుటుంబం. పిల్లల గోలతో మా ఇలు ఎప్పుడూ గిల్లుమంటూంది. రాత్రిళ్లు అందరి భోజనాలయే వరకూ పదకొండు గంటలవుతుంది. మగవాళ్ళెప్పుడూ పదవుతేగాని లేచిరారు. ఆడవాళ్ళేమో పని బడలికవల్ల వట్టి చాపమీద చీర చెంగు పరచుకొని కోడినిద్ర పోతారు. ఎంతరాత్రికో వస్తే వాళ్ళకి వడ్డించి ఆడవాళ్లు తినేప్పటికి చాలా రాత్రవుతుంది. అన్ని ఇళ్ళూ నిద్రపోతున్నా మా ఇంట్లో సందడిగానే ఉంటుంది. అందరూ ఒక్కసారివచ్చి సమాపంక్తిన కూర్చోరు. వచ్చిన ఒక్కొక్కళ్ళకి మాతేసి వడ్డిస్తారు. ఇట్లా ఒకళ్లితరవాత ఇంకోళ్లు వచ్చి తినేసి బయట పడేప్పటికి పగలు అపరాహ్ణం దాటుతుంది. రాత్రి అర్ధరాత్రవుతుంది. ఇట్లా చేయటం వల్ల హోటలు సర్వరువలూ బాధ పడడమే కాకుండా కాలం అఘ మేఘాలమీద దాటి పోతుంది. పగలు పనీ లేకుండా నిద్రతో కాలక్షేపం అవుతుంది. సాయంత్రం వంటింట్లోకి ప్రవేశించేంతవరకు చేసుకోవలసిన పనులు ఎన్నో ఉంటాయి ఉదాహరణకి పిల్లల బట్టలు, రవికలూ ఇలాంటివి తీరిక సమయాల్లో ఉతికేసుకోవడం మంచిది. ఇటువంటి చిన్న చిన్న బట్టలు చాకలవాళ్లు పోగొట్టడమూ సహజం. వాళ్ళతో ఎప్పుడూ ఇటువంటి పేచీలుంటూనే ఉంటయ్ వడేసి వాళ్ళనగర రాబట్టుకోలేం బట్టలు మనవి మనం ఉతుక్కోవడం ఈనాడు నాగరికతా లక్షణంగా పరిగణిస్తున్నారు. గొప్ప కుటుంబాలలో సైతం బట్ట లారేసిన తాళ్ళు కనిపిస్తూనే ఉంటాయి. అయితే ఇంకా కొందరు ఇది నామోషీ యని అభిప్రాయపడేవా రున్నారు. ఒక బట్టల విషయమే గాదు; నిత్య జీవితంలో సాన్యమైనంతవరకు మనకు ఉపయోగపడేవి 'మనకు' అవేవి మనమే చేసుకోవటం మంచిలక్షణం.

పోతే టిఫిన్ త్వరగా కాలేదని అవతల మొగాళ్ళు కేక లేస్తుంటే అదరాబాదరాగా చేసేయడమూ, ఇంట్లో వాళ్ళ కోపతాపాలకి గురి కావడమూ, పగలంతా నిద్రపోయో అమ్మలక్కల సభకి తయారవలో తీరా సమయానికి అవిలేవూ ఇవి లేవూ అని కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరగడం జరుగు

వదినా మరదళ్ల గోష్ఠి

తీరిక సమయాలలో గృహ పరిశ్రమలు

టేబుల్ సాల్టు చేసేవిధం

“అన్నంలో మజ్జిగపోసుకుని కొంచెం ఉప్పు వెయ్యమనేసరికి వుప్పుగళ్లో లేకపోతే ఆ వల్లని వుప్పునే నూరో వేస్తారు. సాధారణముగా ఎక్కడో తప్ప అన్నిచోట్లా నల్లని ఉప్పే దొరుకుంది. మా మరదలు నాకూ ఆ ఉప్పే వేసేసరికి “ఇదేమి టమ్మా శుభ్రంగా టేబుల్ సాల్టు చేసి పెట్టుకో కూడదూ!” అన్నాను.

“ఇళ్ళలో ఈ సాల్టు చేస్తారని విన్నాను గాని అది తయారుచేసే విధం తెలియదు వదినా!”

“అయితే నేను చెబుతాను చేస్తావా మరి?”

“అయితే చెప్పమ్మా వదినా!”

“ఒక శేరు ఉప్పు తీసికొని వెడల్పాటి కళాయి గిన్నెలోగాని అల్యూమినియం గిన్నెలోగాని పోసి, శేరు మంచినీళ్లుపోసి మూతబెట్టి బాగా కరగనివ్వాలి.”

“అంటే ఎన్ని గంటలు వదినా?

సాయంత్రం సాల్టు చేసుకుంటూ మనగా ఉదయం నీళ్ళలో ఉప్పు కరగబెడితే సరి! సాయంకాలం మూడు నాలుగు గంటలప్పుడు తీరిగ్గా తయారుచేసుకోవచ్చు. ఈ ఉప్పు బాగా కరగనిచ్చి సెల్యూలాయిడ్ ఫనల్ ఒకటి తెచ్చుకోవాలి. అది దొరక్కపోతే చిల్లు

కొత్తపల్లి రాజ్యలక్ష్మి

ఉన్న కొబ్బరిచిప్ప చాలు. ఒక పౌను హాస్పటల్ దూది తీసికొచ్చి అర అంగుళం మందమున కొబ్బరిచిప్పలో గాని గరాటాలో గాని సరిపడినంతగా లోపల పరిచి, ఈ ఉప్పునీళ్ళను వేరొక కళాయి పాత్రలోకి వడియకట్టాలి.”

“అలా యెన్నిసార్లు వడియకట్టాలి?”

“ఈవిధంగా దూదిని వేస్తూ తీస్తూ (తడిసిన తడవకూ) ముప్ఫై సార్లు వడియకట్టితే అప్పటికి మంచినీళ్ళవలె చక్కగా యీ ఉప్పునీరు తేటగావుంటుంది.”

“అప్పుడేం చెయ్యాలి?”

“ఈ వడయకట్టిన ఉప్పునీటి పాత్రమీద మూతపెట్టి దీనిని పొయ్యిమీద కెక్కించి పొయ్యిక్రింద మంటబెట్టాలి. మధ్య మధ్య మూత తీసి చూస్తూ వుండాలి. ఓ ఇరవై నిముషాలకల్లా నీళ్ళన్నీ యింకిరి తెల్లగా మల్లెపూవు మాదిరిగా ఉప్పు తయారవుతుంది.”

“ఉప్పునీటి పాత్ర పొయ్యిమీద పెట్టాక మంట బాగా వుంచవచ్చా?”

“మొట్టమొదట్లో మంట బాగానే పెట్టాలి. నీరు ఇగురుతున్న కొద్దీ దగ్గిరవుండి చూచుకోవాలి. ఈ వడియకట్టేటప్పుడు, క్రింద ఒక చుక్క కూడ, ఉప్పునీరు పోనీయకుండా గనక వడియకడితే, శేరు ఉప్పుకి, శేరు టేబుల్ సాల్టు తప్పకుండా అవుతుంది!”

అంతేనా!”

“ఉప్పు తయారవగానే ఒక పేపర్లోకి తిరగబోసి రెండు గంటలు ఆరినతర్వాత శుభ్రమయిన సీసాలో పోసి అట్టే పెట్టుకోవచ్చు.”

“ఎక్కడ ఆరబెట్టాలి? ఎండలోనా? నీడలోనా?”

“ఎండలో అక్కరేదు నీడనే! తీరిక సమయాల్లో అరెమ్మ బూరెమ్మ ఊకదంపుడు కబుర్లతో కాలము వ్యర్థపుచ్చక ఇటువంటివి అనేకం చేసుకోవచ్చును. ముఖ్యంగా యీ టేబుల్ సాల్టుని డిన్నర్ప్లో సర్వుచేస్తే చూడముట కింపుగా వుంటుంది.” “ఏం” మరి తయారుచేస్తావు కదూ!”

★

తుంది. అవతల వాళ్ళ తొందరా, ఎటూ తోచదు. అంచేత సాయంత్రానికీ, రేపటికీ, ఆవారానికీ సరిపోయేని తీరిక వేళల్లో శుభ్రపరచుకోవడం భద్రపరచుకోవడం వల్ల పనంతా సుకరం అవుతుంది.

డబ్బు పొదుపు చేయడంలో కూడా అంతే లెండి. రోజు వారీ ఖర్చులు గిల్లిగిలి వాడటం ఎట్లాగో చాలా మందికి అలవడింది. కాని ఏదయినా పండుగా పబ్బం వస్తే ధూంధాంగా ఎక్కువలేని ఖర్చుచేసి కూచుంటారు. నాకిది చాలా వెగటు అనిపిస్తుంది. ఒకరోజూ రెండు రోజుల కోసం అనవసరపు ఖర్చులని కూడా లక్ష్యం చేయకుండా బోలెడంత డబ్బు ఖర్చు చేయడం, ఇహ మిగతా రోజులన్నీ కష్టంగా నెట్టుకు రావడం విజ్ఞత అనిపించుకోదు. ఇట్లాంటి విషయాలు రద్దు కెక్కించడంలో ఉద్దేశం ఇట్లాంటి కుటుంబాలు కొల్లలుగా ఉండడమే.

★

బంగాళ దుంపతో

కత్తులకు బాకులకు తుప్పు పట్టినా అవి మరకలు బారినా, ఒక బంగాళ దుంపని ముక్కలుగా కోసి వాటితో రుద్ది ఆ పైన కడిగి వేస్తే అవి పోతాయి.

చల్లటి ద్రవపదార్థాన్ని ఎప్పుడూ, వేడి కళాయి గిన్నెలో పోయకూడదు. అలా చేస్తే కళాయి త్వరగా పలచబారి పోతుంది.

ఏదైనా ఒక గిన్నెకి ఉల్లిపాయ వాసన పటి ఎంత తోమినా పోకపోతే, ఆ గిన్నెలో బంగాళదుంపలు ఉడకబెట్టండి

పంటి నొప్పికికూడా బంగాళదుంపలు పనికొస్తాయి. మూడు నాలుగు దుంపలను ఉడకబెట్టి, చిన్న చిన్న ముక్కలయేలా చితకగొట్టి, ఆపైన ఒకవస్త్రంలో చుటబెట్టి చెంపమీద కాపడం పెట్టుకుంటే, నొప్పి హరిస్తుంది.

లావుగా ఉన్నామనుకుంటున్న వాళ్లంతా సన్నబడడానికి చిన్న ఉపాయం: ఒక గాసు వేడినీళ్ళలో నిమ్మరసం పోసుకొని, రాత్రి పడుకు నేటప్పుడు, ఉదయం నిద్రలేవాక త్రాగాలి.

కొత్తబట్టలు ఏవేనా రంగు పోయేలా ఉంటే, ముందర నీళ్ళలో ఒక స్పూను వినిగర్ వేసి ఒకగంటసేపు ఉంచిన తరవాత, ఆ నీళ్ళలో ఆబట్టలను ముంచిపిండితే, రంగు పోకుండా ఉంటుంది.

కె. అన్నపూర్ణా రామారావు.

★ అతివృష్టి, అనావృష్టి ★

[43 వ పేజీ తరువాయి]

ఒకటి చేరి గుచ్చుకుంటోంది బాబూ?" అన్నాడు వాడు.

"అలా బాధపడుతూ నడవక పోతే జోడు విప్పి, రాయి తీసి అవతల పారెయ్యరాదా?" అన్నాడు మంత్రి.

"ఇప్పుడు పనిగట్టుకుని జోడు ఎవడు విప్పుతాడు?" అన్నాడా బద్ధకస్తుడు.

మంత్రి రాజుతో, "ప్రభూ, ఇతనికి రెండవ బహుమానం ఇప్పించండి" అన్నాడు.

వానికి డబ్భై ఐదు వరహాలిప్పించి రాజుగారు ముందుకు నడిచారు.

కొంతమేర వెళ్లేసరికి అక్కడ ఒకడు జోగుతో కనపడ్డాడు. బారెడు త్రాచుపాము ఒకటి జరజరా వచ్చి పక్కనుంచి పోతోంటే వాడు చూసికూడా కదిలేడు కాదు.

రాజుగారు ఆశ్చర్యపోయి, "ఏమిరా, పామొచ్చినా కదిలేవు కాదు?" అన్నారు.

"బద్ధకం బాబూ?" అన్నాడు వాడు.

మూడవ బహుమానం యాభై వరహాలూ వాడికిప్పించి రాజుగారు అంతఃపురానికి వెళ్లిపోయారు.

కొన్నాళ్ళు పోయాక మంత్రి రాజుగారితో, "ప్రభూ, ప్రజలలో ఇప్పుడు ప్రతివాడూ కూడా బహుమతి సంపాదించగలిగేటంత బద్ధకస్తుడైపోయాడు!" అన్నాడు.

ఆయన చెప్పదలచుకున్నదేదో ముగియకుండానే ఇద్దరు మనుష్యులు ఆ నగరం రక్షకభటాధికారిని సాయంపట్టి తీసుకొచ్చి రాజుగారి ముందు పడేశారు.

"ఏమిటిది?" అన్నారు రాజూ, మంత్రీకూడాను.

వాళ్లు, "ప్రభూ, ఈ అధికారి తన కళ్ళముందు ఒక హత్య జరుగుతోంటే చూసి ఊరుకున్నాడు! తమతో ఫిర్యాదుచేద్దామని తీసుకొచ్చాం. నడవమంటే కదిలేడు కాదు. అందువల్ల మోసుకు రావలసి వచ్చింది" అన్నారు.

రాజు రక్షకభటాధికారితో, "నీ కళ్ళముందే నేరం జరుగుతోంటే ఎందుకు ఊరుకున్నావ్, అడ్డుకోక?" అన్నారు.

రక్షకభటాధికారి రాజుముందు లేచి నిలపడలేక కూలబడ్డాడు. నిద్రమత్తుతో "ప్రభూ, బద్ధకం చేతనే అడ్డుకోలేకపోయాను!" అన్నాడు.

దానితో రాజుకి కోపంవచ్చింది. "ఆ బద్ధకం ఏమిటో వదలగొట్టేస్తాను! హంతకునికి బదులు నిన్ను ఉరి దీయిస్తాను!" అంటూ వెంటనే ఉరితాడుదరప్పించి ఆ అధికారికంఠానికి తగిలించాడు.

నిలపడి చూస్తోన్న వాళ్ళంతా "క్షమార్పణ కోరుకోవయ్యా!" అని ఆ అధికారిని హెచ్చరించారు.

ఆ అధికారి "క్షమించండ"ని కోరితే వదిలేద్దామనే ఉంది రాజుగారికి. కాని రక్షకభటాధికారి తాడుపీక్కి బిగిసిపోతోన్నా మాటలాడకుండా బద్ధకంగా అలాగే ఉండిపోయాడు

ఆఖరికి రాజుకే జాలిపుట్టి, "మంత్రీ, ఈ కత్తిని వాడికిచ్చి, ఆ ఉరిత్రాటిని కోసేసుకుపొమ్మను!" అన్నాడు.

మంత్రి కత్తి నిచ్చి, "కోసేసుకు పారిపో!" అని హెచ్చరించాడు. కాని అధికారి కత్తిని జారవిడిచేశాడు!"

"ఏం, ప్రాణంమీద తీపిలేదా నీకు?" అన్నాడు మంత్రి ఆశ్చర్య పడుతో.

"ఉంటే ఉండొచ్చుగాని, చచ్చు ప్రాణంకోసం ఈ తాడంతా ఇప్పుడు ఎవరు కోస్తారు? బద్ధకంగా వుంది, నన్ను తిప్పలు పెట్టకండి!" అంటూ అధికారి, మత్తుగా కళ్లు మూసుకున్నాడు.

మంత్రి చేసేదిలేక తనే ఆ వురితాడును కోసేసి ఆ మనుష్యుల చేతనే ఆ అధికారిని యింటికి మోయించేశాడు.

రాజువద్దకు వచ్చి, "ప్రభూ, ఇంక మనం సోమరితనాన్ని ప్రోత్సహించరాదు. కాస్త చురుకుపాలు తగ్గిద్దామని చూస్తే అతివృష్టిఅల్లా అనావృష్టి అయి ఊరుకుంది. దేశంలో మచ్చుకైనా ఇంక చురుకుతనం లేకుండా పోయేటట్లుంది. ఈ అధికారివంటి సోమరి చక్రవర్తులు తయారైతే ఇంకేమైనా ఉందా? నగరానికి ముప్పు వస్తుంది" అని మనవిచేసి, మంత్రి మళ్ళీ చురుకుతనంకోసం టముకు వేయించాడు. ★

సినిమా

★ భారత ఫిలింపరిశ్రమ పురోగమనం ★

ఈ దీపావళితో ముగిసిన 12 నెలల లోనూ భారత చలన చిత్ర సీమ అనేక విధాల అపూర్వ ప్రమాణాలను అందుకొన్నది బాక్సాఫీస్ వసూళ్లు పెరిగాయి, సాంకేతికంగా చిత్రకళస్థాయి పెరిగింది అంతర్జాతీయరంగంలో పేరుప్రతిష్ఠలు కలిగాయి. గత సంవత్సరంతో పోల్చిచూస్తే ఈ 12 నెలలలోనూ దెబ్బతిన్న చిత్రాల సంఖ్య తక్కువ పోతే, రజతోత్సవాలు చేసుకొన్న చిత్రాలు ఈ సారి ఐదు ఉన్నాయి వీటిలో రేడియం జూబిలీ జరుపుకొన్న "ఝనక్ ఝనక్ పాయల్ బాజే" ఇంకా ప్రతిరోజూ వేలాది జనాన్ని ఆకర్షిస్తూంది

అమియచక్రవర్తి చిత్రం "సీమ," దేవేంద్ర గోయెల్ నిర్మించిన "వచన్", రాజ్ కపూర్ తీసిన "శ్రీ 420", బి. ఆర్. చోప్రా చిత్రం "ఏక్ హీ రాస్తా" ఇంకా, భాయ్ భాయ్, తూఫాన్ ఔర్ దీయా, దేవదాస్, ఇన్సానియత్, నయా ఆద్మీ, బందీష్, మిస్టర్ అండ్ మిసెస్ 55, ముసాఫిర్ ఖానా వంటి చిత్రాలన్నీ బాక్సాఫీస్ విజయాలు సాధించాయి సి ఐ డి, దేవత, న్యూఢిల్లీ చిత్రాలు ఇక్కడ విజయవంతంగా సాగుతున్నాయి ఇవి రజతోత్సవాలు చేసుకోబోతున్నాయి

బొంబాయి సినిమాలేఖ

కేవలం సాంకేతికస్థాయినే పరిశీలిస్తే, ఝనక్ ఝనక్, పథేర్ పాంచాలి, శ్రీ 420, మిస్టర్ అండ్ మిసెస్ 55 చిత్రాలు ఈ రంగంలో అత్యున్నత ప్రమాణాలు అందుకొన్నాయి.


పరిశ్రమకుకూడా ఇవి మంచిరోజులే. ప్రభుత్వం ఈ విషయంలో తీసుకున్న శ్రద్ధ ఫలితంగా, ముడిఫిలిం, వివిధ పరికరాలు ఉత్పత్తిచేయడానికి ఒక పథకాన్ని రెండవ పంచవర్ష ప్రణాళికలో చేర్చడం జరిగింది. జాతీయ ఫిలింబోర్డు నెలకొంటున్నది. దీని ఆధ్వర్యాన పెట్టుబడిసంస్థ ఒకటి, శిక్షణ కేంద్రం ఒకటి, ఫిలిం సలహాసంఘం ఏర్పడి పనిచేస్తాయి బొంబాయి నగరంలో థియేటర్ల కొరత తగ్గించడంకోసం, మరి ఏడు థియేటర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీనివల్ల థియేటర్ యజమానుల హిరణ్యాక్షవరాలకు ఉద్వాసన చెప్పడానికి దోహదం జరిగింది.

పోతే, ఇది జరిగిన వారం రోజులకల్లా, ఫిలిం విచారణ సంఘ సిఫార్సుల ప్రకారం, 1923 వ సంవత్సరపు బొంబాయి వినోదపు పన్ను చట్టాన్ని సవరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది.

మొత్తం మీద ఈ 12 మాసాలలోనూ పరిశ్రమ అనేక గొప్ప ఫలితాలు సాధించింది. "మంచివి" అని మెచ్చతగ్గ



"భాగ్యరేఖ" చిత్రంలో రమణారెడ్డి, జమున, సూర్యకాంతం.



"దేవత" హిందీ చిత్రంలో కమలాలక్ష్మణ్.

భారత ఫిలిం పరిశ్ర

చిత్రాలు ఇన్ని తయారుకావడానికి కూడా ఇది తొలిసారి

ఇందులో ఒక ముఖ్య విశేషం ఉంది. ప్రేక్షకులు మంచి కథ, మంచి సంగీతం, నృత్యం కావాలని కోరారు ఈ ధోరణి గ్రహించి, చలన చిత్రకారులు ఈ విషయాలలో శ్రద్ధ తీసుకున్నారు. ప్రజలూ వాటిని ఆదరించారు. ఇపుడు విజయవంతం అయిన మంచి చిత్రాలలో విదేశీయ కథలను గాని, చిత్రాలను గాని ఆధారంగా తీసుకుని నిర్మించినవి ఏవీ లేవు. కథలూ, నృత్య సంగీతాలూ భారతీయ సంప్రదాయ బద్ధములై ఒప్పాయి. భరతనాట్యం, జానపద నృత్యాలూ చలన చిత్రాలలో ఇంతటి ప్రముఖ స్థానం సంపాదించుకోవడానికి ఈ ఏడాదే మొదటిసారి అనిపిస్తూంది సంకర సంగీతాన్ని, విదేశవాళీ నృత్యాలనూ భారత ప్రేక్షకులు హర్షించటం లేదనడానికి ఇదే నిదర్శనం.

* * *

ఈ ఏడాది ఫిలిం పరిశ్రమలో భారీ ఎత్తున నిర్మితం అవుతున్న చిత్రాలు చాలా ఉన్నాయి

బొంబాయిలోనూ, దక్షిణాదిన కలిపి ఈ కోవకు చెందిన హీనపక్షం 20 ఉంటాయి ఏదు లక్షల రూపాయలకు తగ్గే బడ్జెట్ దేనికీ లేదు గరిష్ఠ ప్రమాణం 50 లక్షల వరకూ వెళ్లిన చిత్రంకూడా ఒకటి ఉంది. అది 1951 లో ప్రారంభమైన "మొగల్ ఇ అజాం." దిలీప్ కుమార్, మధుబాల, పృథ్వీ రాజ్, నిగార్ సుల్తానా, అజిత్, జయంత్, దుర్గాఖోటె మొదలగు అగ్రశ్రేణి నటీనటులు చాలమంది పాల్గొంటున్నారు. నిర్మాణ వ్యయం ఇప్పటికి నలభై లక్షలు దాటింది

ఒక్క సెట్టు వెయ్యడానికి రెండులక్షలు ఖర్చుపెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి ఈ చిత్రం పై ఏడాదికి విడుదల కావచ్చునంటున్నారు

నౌషాద్ దీనికి సంగీత దర్శకుడు.

భారీ ఎత్తున నిర్మించబడు తున్న మరో చిత్రం 'అంగుళిమాల'. వాయ్‌లెండ్ ప్రభుత్వం ఈ చిత్రాన్ని బొంబాయి నటీనటులతో ఇక్కడ నిర్మిస్తున్నది. గేవాకలర్‌లో తయారయే ఈ బౌద్ధ చిత్రానికి ముందు హేమేన్ గుప్తా దర్శకత్వం స్వీకరించినా, కారణాంతరాలవల్ల, ఆ సారథ్యం శ్రీ గుప్తా చేతుల్లోకి మారింది నిమ్మి, భరత్ భూషణ్ అచలా సచ్ దేవ్ పాల్గొంటున్నారు. సంగీతం అనిల్ బిశ్వాస్

పెద్ద ఎత్తున తయారవుతున్న మరో బౌద చిత్రం "అంజలి" బుద్ధుని ప్రియశిష్యుడు ఆనందుని జీవితగాథ దీనికి ఆధారం ముఖ్యభూమిక నిర్వహిస్తున్న చేతన్ ఆనంద్ దీనికి దర్శకుడుకూడా ఈయనా, ప్రముఖరచయిత మాజీ రాజకీయ వాదీ అయిన పండిత న్యాయ శర్మ కలసి దీన్ని నిర్మిస్తున్నారు వీరు నిర్మిస్తున్న మరోచిత్రం 'కినారేకినారే' ఇందులో దేవానంద్, మీనాకుమారి నటిస్తున్నారు సంగీతం జయదేవ్. ఈయనే "అంజలి" చిత్రానికి కూడా సంగీత దర్శకుడు.

ఈ స్థాయికి చెందే మరికొన్ని చిత్రాలు పకీజా, నయాదౌర్, మధుమతి, చంపాకలి

వీటిలో మొదటిది మీనాకుమారి భర్త కమల్అమ్రోహీ నిర్మిస్తున్నది. దర్శకుడు కూడా ఆయనే. అశోక్ కుమార్, మీనాకుమారి పాల్గొంటున్నారు దీన్ని టెక్నికలర్ చిత్రంగా విడుదల చేయాలని సంకల్పించారు

బి. ఆర్ చోప్రా చిత్రం "నయాదౌర్" లో దిలీప్‌కుమార్, వైజయంతిమాల (మధుబాల స్థానే), రాధాకిషన్, జానీవాకర్, అజిత్, చందఉస్మాని, డెయిసీ ఇరానీ నటీనటులు సంగీతం ఒ. పి. నయ్యార్

"మధుమతి" చిత్రం బిమల్ రాయ్‌ది. ఇందులో కూడా దిలీప్, వైజయంతి పాల్గొంటున్నారు.



బిమల్ రాయ్ చిత్రం "పరివార్"లో ఉషాకిరణ్.

ఫిలింస్థాన్ వారి "చంపాకలి"లో బెంగాలీ తార సుచిత్రాసేన్, భరత్ భూషణ్ ముఖ్య నటీనటులు. అనార్కలీ, నాగిన్ చిత్రాలు తీసిన నందలాల్ జస్వంతలాల్ దీనికి దర్శకుడు.

దక్షిణ భారతంలో భారీఎత్తున తయారవుతున్న హిందీ చిత్రాలలో నరసూవారి "సితారోంసే ఆగే" ఒకటి. అశోక్, వైజయంతి ఇందులో జంట. రచయిత, దర్శకుడు అయిన గ్యాన్ ముఖర్జీ అస్వస్థతవల్ల [illegible] బి ఆర్. చోప్రా దీనికి దర్శకుడుగా [illegible]స్తున్నాడు

జెమినీ అధిపతి ఎస్. ఎస్. వాసన్ నిర్మిస్తున్న హిందీ చిత్రానికింకా నామకరణం జరుగలేదు. పద్మినీ, జెమినీగణేశన్ ఇందులో నాయికా నాయకులు. భారీ సెట్స్‌తో సంగీత నృత్యప్రధాన చిత్రంగా దీన్ని నిర్మిస్తారు. సంగీత దర్శకుడు సి రామచంద్ర.

తమిళంలో విజయవంతంగా సాగిన "అమర దీపం" (తెలుగులో "అమరజీవి")ను హిందీలో నిర్మించబోతున్నారు. దేవానంద్ పద్మిని నటిస్తారట. సావిత్రి నిర్వహించిన భూమికను నూతన [illegible] ఒప్పగిస్తారట.

నిర్మాణం చాలకాలం సాగిన చిత్రాలలో మెహబూబ్ టెక్నికలర్ చిత్రం "మదర్ ఇండియా" ఐ. ఎస్. జోహర్ చిత్రం "మిస్ ఇండియా" ముఖ్యమైనవి. ఈ రెండిటిలోనూ నర్గీస్ నాయికగా నటిస్తోంది. భారత రష్యాల సంయుక్త చిత్రం "పర్దేశీ"లో కూడా ఈమె ముఖ్యభూమిక

నటుడు అశోక్ కుమార్ స్వంతంగా ఒక చిత్రం నిర్మిస్తున్నారు. దీనికి పేరు "రాగిణి" ఇందులో నాయికి, నాట్యతార పద్మిని. అశోక్ కుమార్, అతని తమ్ముడు కిశోర్ కుమార్ ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు.

కొత్తగా ప్రారంభం అయిన మరో చిత్రం ఫిలింస్థాన్ వారి "ముసాఫిర్" దిలీప్, సుచిత్రాసేన్, కిశోర్ కుమార్, ఉషాకిరణ్, నిరూపరాయ్, శేఖర్, [illegible] ఇతరులు నటిస్తున్నారు.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)

* * *

'సెలెక్షన్' చాలునండి

[illegible] ఒక చిత్రానికి పది పాటలు [illegible] హిందీ సంగీత దర్శకుడు ఒ. పి. నయ్యర్ ఒక పాట ఎక్కువ సమయం [illegible] బొంబాయిలో అరగంట వదిలిపెట్టారు. చివరికి ఒకసారి సుప్రసిద్ధ నిర్మాత శ్రీ దల్‌సుఖ్ పంచోలి అవకాశం ఇచ్చారు. అప్పుడు ఒక సుప్రసిద్ధ ప్లేబాక్ గాయకుడు, సినిమా పాటలు రాసే ఒకాయన, నయ్యర్‌ను పక్క గొట్టించడానికి శతవిధాల ప్రయత్నించారు. చివరికి నిర్మాత పంచోలి వాళ్ళనే పక్క గొట్టారు. అప్పుడు నయ్యర్ సెలెక్షన్ చాలు అనడం.

మొన్న మధ్యనే, పంచోలి కొత్త చిత్రానికి నయ్యర్ సంగీత దర్శకుడుగా [illegible]. పంచోలి [illegible] అడ్వాన్సుగా ఇవ్వబోయారు.

"సెలెక్షన్ చాలునండి" అన్నాడు నయ్యర్, కృతజ్ఞతా పూర్వకంగా పంచోలి వందలు తిరిగి ఇచ్చివేస్తూ.

* * *

గురుదత్ ఫిలింస్ వారి "సి ఐ డి." లో ఉత్తరాది ప్రేక్షకులకు తొలిసారిగా [illegible] తెలుగు నాట్యతార వహీదా రెహమాన్‌ను దర్శక నిర్మాత గురుదత్ తన కొత్త చిత్రానికి బుక్ చేశారు. ఇది వహీదా నటించే మూడవ హిందీ చిత్రం. ఆమె రెండవ చిత్రం, గురుదత్ ఫిలింస్ వారి "ప్యాసా"

ఆంధ్ర రచయిత్రుల చరిత్రలు
చలనచిత్రాలుగా నిర్మింప శ్రీమతి భానుమతి సంకల్పం


ప్రసిద్ధ ఆంధ్ర కవయిత్రుల చరిత్రలను చిత్రాలుగా నిర్మించాలని సంకల్పించినట్లు సినీనటి, మొట్టమొదటి మహిళాదర్శకురాలు, అయిన శ్రీమతి భానుమతి తెలియజేసింది.

"ఇది నా ముఖ్య లక్ష్యాలలో ముఖ్యమైనది" అని ఆమె చెప్పింది.

మొల్ల, ముద్దుపళని, తరిగొండ వెంకమాంబ, తాళ్ళపాక తిమ్మక్క, రంగాజమ్మ ప్రోలమ, చేలమ ప్రభృతి మహిళామతల్లులను ఈ సందర్భంలో ఆమె ఉదహరించింది.

కట్టుదిట్టంగా పరిశోధన జరిపించి, ఈ కవయిత్రుల జీవిత కథలను, ఫుటు ఫూర్వాలను సమగ్రంగా సేకరించి, ఆ పైన ఒక్కొక్కరి కథను "డాక్యుమెంటరీ"గా చిన్న చిన్న చిన్న చిత్రాలుగా నిర్మిస్తుందట. ఆపైన ఆయా రచయిత్రుల ఉద్గ్రంథాలలోని ఉజ్వలఘట్టాలను ఏరి, వాటినికూడా సెల్యులాయిడ్ మీద చిత్రిస్తుందట ఈ ప్రకారము, ఒక్కొక్క రచయిత్రి పేరిట రెండు మూడు వేల అడుగులలో చిన్న చిత్రాలు రూపొందించి, విడుదల చేయాలని నిశ్చయించుకొంది.

ప్రాచీన కవుల, కవయిత్రుల గ్రంథాలు మనం భద్రపరచుకోవడం, విస్మృతి ప్రధానపడిన వాటిని పునరుద్ధరించి పునర్ముద్రించడం, అవసరమని అందరూ గుర్తించి, ప్రయత్నాలు చేస్తున్న ఈ సమయంలో శ్రీమతి భానుమతి ఈ రూపేణా మరొక అడుగు ముందుకు వేసి, ఆంధ్ర రచయిత్రుల చరిత్రలను సెల్యులాయిడ్ మీద భద్రపరచ సంకల్పించడం ముదావహం. ఇందుకు చలనచిత్ర నిర్మాతగా, దర్శకురాలుగా, కళారాధకురాలుగా ఆమె అభినందనీయురాలు. ★



చేతనా ఫిలింస్‌వారి "జీవనయాత్ర"కు ఇటీవల ప్రారంభోత్సవం జరిగింది. (ఎడమనుండి) దర్శకుడు కె. ఎస్. ప్రకాశరావు, వాహినీ సౌండ్ ఇంజనీరు కృష్ణయ్యర్. ఆయన వెనుక: గాయని సుశీల, రమేష్‌నాయుడు, అనిసెట్టి.



"చోరీ చోరీ"లో నర్గీస్, రాజ్‌కపూర్, ముక్రీ.

★ హాలీవుడ్ చోరీ ధోడీ ★

ఎ. వి. ఎం. వారి "చోరీచోరీ" చిత్రంలో రాజ్‌కపూర్, నర్గీస్, గోప్, భగవాన్, జానీవాకర్, డేవిడ్, ముక్రీ, రాజసులోచన, నర్తకీమణులు కుమారి కమల, సాయి-సుబ్బులక్ష్మి ప్రభృతుల పేర్లూ "ఇట్ హాపెన్డ్ వన్ నైట్" "రోమన్ హాలీడే" అనే హాలీవుడ్ చిత్రాల పోలికలూ, ఉన్నాయి.

ఈ చిత్రంలో వన్ని వేశాలన్నీ పై వాక్యంలాగే తీరు తెన్నూ, పొందికా లేకుండా ఉన్నాయి. ఉన్నా ఫరవాలేదను కున్నా, మొత్తంమీద ఈ చిత్రం, ప్రచారంద్వారా ఆశపెట్టినంత గొప్పగా లేదు. అసలు ముఖ్యంగా ఈ ప్రచారంవల్లనే ఈ విధమైన అపచారం జరిగిం దనిపిస్తుంది.

నటనకి సంబంధించినంత వరకూ, ఉన్న వారంతా ప్రశంసనీయంగా నటించారు. రాజ్ కపూర్ భూమికకు మాత్రమే చక్కని రూప కల్పన జరిగింది. దాన్ని రాజ్ కపూర్ అద్భుతంగా నిర్వహించాడు. మిగతా నటీ నటులంతా ఆరితేరినవారయినా, అందర్నీ కూడా ఎక్‌స్ట్రాలవతుగా వాడుకున్నట్లని పిస్తుంది. ఈవిధంగా, ఉన్నవారిని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేక పోయినా, మొత్తంమీద, కులాసాగా కాలక్షేపం చెయ్యడానికి ఇది చూడతగ్గ చిత్రమేనని చెప్పాలి హాస్యరసవన్ని వేశాలు, నృత్యాలు కొల్లలుగా ఉన్నాయి.

ఈ చిత్రానికి సంగీతం ప్రత్యేకాకర్షణేమీ కాదు. ఉన్నవాటిలో ఏ పాటా పెద్దా హిట్ అయిపోయే ప్రమాదానికి గురి కాబో తున్నట్లు తోచదు.

ఈ చిత్రం నిర్మాత ఎల్. బి. లక్ష్మణ్ దర్శకుడు అనంత ఠాకూర్. సంగీత దర్శకులు శంకర్, జైకిషన్‌లు.
తోచదు.

చిత్రం చూస్తున్నంతసేపూ, హాలీవుడ్ చిత్రాలు కొన్ని జ్ఞాపకం వస్తాయి. ఈ విధంగా 'ధోడీ' ఇందులోంచీ, ఇంకొంచెం ఇంకోదాంట్లోంచీ తీసుకుని వాడుకోవడం ఈనాడు పరిపాటి అయిపోవడమే కాకుండా, ఫలితం రాణించేట్లుంటే, "గొప్ప"గా కూడా చెలామణీ అవుతోంది. సినిమా పరిభాషలో దీన్ని "సక్సెస్‌ఫుల్ ప్లెగరైసింగ్" అంటారు.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



"ఇలవేలుపు" శతదినోత్సవాల సందర్భంలో వెండి తెర వేలుపుల కలయిక.

★ ఇజ్రేల్ రాజ్యస్థాపన చరిత్ర ★

(30 వ పేజీ తరువాయి)

వాకియానుండి ఆయుధాలు తెచ్చుకుంటున్నామనీ కర్నల్ నాసర్ (అప్పుడు ఈజిప్టుకు ప్రధానమంత్రి) ప్రకటించాడు. దీనిపై ఇజ్రేల్ మాత్రమే కాక బ్రిటన్, అమెరికా మొదలైన పశ్చిమ కూటమి రాజ్యాలన్నీ నిరసన తెలిపాయి. అప్పటినుంచీ ఇజ్రేల్ కూ, మిగతా అరబ్ రాజ్యాలకూ మధ్య విద్వేషం, సంఘర్షణ ముదరసాగింది.

సూయజ్ సమస్య

ఆ తరవాత వచ్చిన పెద్ద పరిణామం సూయజ్ కాలవ నిర్వహణను ఈజిప్టు జాతీయం చేయడం. ఈజిప్టు చర్యను పశ్చిమ రాజ్యాలన్నీ నిరసించడం, అరబ్ రాజ్యాలన్నీ సమర్థించడం జరిగింది. అంతవరకూ అంతరంగిక స్పర్థలతో బలహీనంగా ఉన్న అరబ్ రాజ్యాలన్నీ ఈజిప్టుకు అండగా నిలిచాయి. వీరి ఐకమత్యం ఇజ్రేల్ కు మరింత భయకారణమైంది. బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాల ఈజిప్షన్ వ్యతిరేక వైఖరి ఇజ్రేల్ కు ప్రోత్సాహకారణమైంది. గత అక్టోబరు మాసంలో ఇజ్రేల్ తన సరిహద్దుల్లో సైనిక చర్యలను తీవ్రం చేసింది. అక్టోబరు 29 న ఇజ్రేల్ ఈజిప్టుపై దురాక్రమణ ప్రారంభించింది. సూయజ్ కాలవ ప్రాంతంలోని ఈజిప్షన్ సైనిక స్థావరాలపై దాడులు సాగించామని ఆనాటి రాత్రి ఇజ్రేల్ రేడియో ప్రకటించింది. 30 వ తేదీన ఈజిప్టుకూడా సైనిక చర్యలను ప్రారంభించింది. సైనాయ్ ఎడారిలో యుద్ధం ముమ్మరంగా సాగింది.

బ్రిటిష్, ఫ్రెంచి జోక్యం

ఈ యుద్ధంమూలంగా సూయజ్ కాలవ నిర్వహణకు భంగంకలుగుతుందనీ, అందుచేత కాలవరక్షణకు గాను తాత్కాలికంగా తమ సైన్యాలను అక్కడికి పంపిస్తున్నామనీ ప్రకటించి బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు ఇజ్రేలీ-ఈజిప్షన్ యుద్ధంలో జోక్యంచేసుకున్నాయి. ఉభయపక్షాలను సూయజ్ ప్రాంతానికి దూరంచేసి కాలవను రక్షిస్తామని ప్రకటించిన బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాలు ఒక్క ఈజిప్షన్ సైన్యాలపైనా, ఈజిప్టుదేశంపైనా మాత్రమే దాడులు సాగించడం ప్రపంచ రాజ్యాలకు దిగ్భ్రాంతి కలిగించింది. సూయజ్ కాలవను తిరిగి ఆక్రమించుకోవడానికి ఇదొక సాకుగా మాత్రమే బ్రిటన్, ఫ్రాన్సులు ఉపయోగించుకుంటున్నాయనీ, ఇజ్రేలీ దురాక్రమణకు మద్దతుకూడా ఇచ్చి ఉండవచ్చునని అధిక సంఖ్యాకులు అనుమానించారు. యుద్ధం విరమించాలని భద్రతామండలిలో అమెరికా అక్టోబరు 31 న ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బ్రిటన్ వీటో చేసింది. అందుచేత యుగోస్లావియా ప్రతిపాదనపై ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశం జరిగింది. బ్రిటిష్, ఫ్రెంచి, ఇజ్రేలీ సైనికచర్యలపై ఆందోళన ప్రకటిస్తూ, వెంటనే యుద్ధం విరమించాలని అమెరికా నవంబరు 2 న మరో తీర్మానం ప్రవేశపెట్టింది. ఈతీర్మానికి 64 దేశాలు అనుకూలంగా వోటుచేశాయి. బ్రిటన్. ఫ్రాన్సు న్యూజీలాండ్, ఆస్ట్రేలియా, ఇజ్రేల్ దేశాలు ప్రతికూలంగా వోటుచేశాయి. ప్రపంచ దేశాల్లో అధికభాగం బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాల చర్యలను నిరసిస్తున్నట్లు స్పష్టమైంది.

బ్రిటన్, ఫ్రాన్సులు వెంటనే యుద్ధ విరమణ చేయని పక్షంలో యుద్ధం ఇజ్రేల్ ఈజిప్టులకు మాత్రమే పరిమితం కాకపోవచ్చును. ప్రపంచ పరివ్యాప్తంగా యుద్ధజ్వాలలు చెలరేగవచ్చును. ★

★ అరబ్ రాజ్యాల జాతీయ చైతన్యం ★

(27 వ పేజీ తరువాయి)

తెచ్చారు. ఇది విఫలం కావడంతో ఇప్పుడు ప్రత్యక్షచర్యలకు దిగారు.

జోర్డన్

ఇజ్రేల్ కు తూర్పుగా ఉన్న ఈ రాజ్యానికి రాజధాని అమ్మాన్. బ్రిటిషు ఆధిపత్యం క్రింద 1923లో మక్కా షెరీఫ్ కుమారుడైన హుసేన్ దీనికి ఏలిక అయినాడు. 1929 లో బ్రిటన్ ఈరాజ్యానికి మరికొంత స్వయం పరిపాలనాధికారం ఇచ్చింది 1946లో తనఆధిపత్యం వదలుకొని సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చింది. ఆ ఏడు మార్చి 25 న అబ్దుల్లా తనను రాజుగా ప్రకటించుకున్నాడు. 1955 డిసెంబరులో జోర్డన్ ఐక్యరాజ్య సభ్యత్వం పొందింది. ఇది అరబ్ లీగ్ లో సభ్యదేశం.

ఇరాక్

దీనికి రాజధాని బాగ్దాద్. 1920 లో మక్కా షెరీఫ్ కుమారుడైన ఫైజల్ ఇరాక్ కు రాజైనాడు. ఈయన 1930 లో మరణించాడు. తరవాత అతని కుమారుడు గాజీ రాజైనాడు. 1918 లో ప్రారంభమైన బ్రిటిషు మాండేట్ అధికారం 1932 లో అంతమైంది. ఇదికూడా అరబ్ లీగ్ లో సభ్యదేశమే. పెట్రోలియం పరిశ్రమకు ఈదేశపు రాజకీయాలలో మొదటినుంచీ ప్రాముఖ్యం ఉన్నది. ఈ పరిశ్రమకు కర్కూక్ కేంద్రం. ఇరాక్ పెట్రోలియం కంపెనీ చేతిలో ఈపరిశ్రమ కేంద్రీకృతమై ఉంది

సిరియా

ఇది రిపబ్లిక్ దేశం. రాజధాని డమాస్కస్. మొదటి ప్రపంచయుద్ధం తరవాత ఇది ఫ్రెంచి ఆధిపత్యం క్రిందికి వచ్చింది. 1920 నుండి 1936 వరకూ సిరియన్లు (అరబ్ జాతీయోద్యమం సిరియాలోనే ప్రారంభమైంది.) ఫ్రెంచివారిపై తిరుగుబాట్లు చేస్తూనే ఉన్నారు. 1943 డిసెంబరులో ఫ్రెంచి ఆధిపత్యం అంతమైంది 1946 ఆగస్టులో ఫ్రెంచిసేనలు పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిపోయాయి. తరవాత సిరియా ఐక్యరాజ్య సభ్యదేశమైంది.

లెబనాన్

ఇదికూడా రిపబ్లిక్ దేశమే. రాజధాని బేరూట్. 1941 దాకా ఇది ఫ్రెంచి ఆధిపత్యంలోనే ఉంది. జర్మన్ నాజీ సేనలు ఆక్రమించుకున్నప్పుడు బ్రిటిష్, ఫ్రెంచి సేనలు జర్మన్లను తరిమివేశారు. 1944 జనవరిలో లెబనాన్ పూర్తి స్వాతంత్ర్యం పొంది, ఆ తరవాత ఐక్యరాజ్య సభ్యదేశమైంది.

సావుదీ అరేబియా

రాజు ఇబిన్ సావుద్. రియాద్ ముఖ్య పట్టణం.

యెమెన్: ఇది అరేబియాకు నైఋతి కొసగా ఉన్న చిన్న స్వతంత్రరాజ్యం. ఇదికూడా అరబ్ లీగ్ లో సభ్యదేశమే.

ఈ ఏడు రాజ్యాలు కాక, కొత్తగా స్వాతంత్ర్యంపొందిన ఆఫ్రికన్ అరబ్ రాజ్యాలు మొరాకో, ట్యునీషియాలుకూడా అరబ్ లీగ్ సభ్యదేశాలే.

బాగ్దాద్ ఒడంబడిక

మధ్యప్రాచ్యంలో సోవియట్ ప్రాబల్యానికి తావులేకుండాచేసే ఉద్దేశంతో బ్రిటిష్ ప్రోద్బలంతో టర్కీ, ఇరాక్ దేశాలు పరస్పర రక్షణ ఒడంబడిక చేసుకున్నాయి. ఇది 1955 ఫిబ్రవరి 24 న బాగ్దాద్ లో జరిగింది. తరవాత బ్రిటన్, ఇరాన్, పాకిస్తాన్ కూడా చేరాయి. మిగతా అరబ్ రాజ్యాలేవీ చేరలేదు. ★

★ చరితార్థుడు ★

(34 వ పేజీ తరువాయి)

ఈ సైనికులు రోజూ రాత్రిపూటలు ఊరంతా మాటుమణిగాక, బయటనుంచి రంగరాయలనుంచిన జైలుగదిలో పలివరకూ సొరంగం త్రవ్వటం పనిగా పెట్టుకున్నారు. కొద్దిరోజులలోనే ఈపనిలో కృతకృత్యులుకూడా అయినారు. చిన్నచిన్న కొవ్వొత్తుల సాయంతో, కటిక చీకటిలో సొరంగాలుతవ్వ త్రవ్వించటానికి వాళ్ళను ప్రేరేపించింది ప్రభుభక్తే కావాలి! అట్లా కాక, ఎవరిఆజ్ఞగానో ఈపనంతా చేయటానికి కేవలం డబ్బుకోసం ఆశపడి ముందుకువచ్చేవాళ్ళు అరుదు—అసలే ఉండరు కూడాను—అందులో సర్వమూ సమృద్ధిగా దొరుకుతూ కరువుకాటకాలు అన్న మాటే వినిపించని ఆరోజులలో!

ఉన్నట్టుండి ఒకనాటిరాత్రి అసంఖ్యాకమైన సేన సొరంగంనుంచి రంగరాయలగదిలోనికి ప్రవేశించింది. ఒక్కుమ్మడిగా వస్తున్న ఇందరుసైనికులనుచూచి, రంగరాయలు మొదట గడబిడబడ్డాడు! వీరంతా జగ్గరాజు ఆదేశానుసారమే, తనను అవమానం చేయటానికో, లేక, చిత్రవధ చేయటానికో వస్తున్నారని అనుకున్నాడు. కాని తీరాచూడగా, అందరుసైనికులూ తనకు ఒక్కసారిగా సాష్టాంగ నమస్కారంచేసి, యాచమనాయుడు పంపిన ఉత్తరం అందించారు. అంతేకాకుండా వర్తమానం ముఖతః కూడా చెప్పారు. వారి అసమాన భక్త్యనురాగాలకు రంగరాయలు నీరైపోయాడు. సంతోషంతో కొన్నిక్షణాలవరకూ యేమీ తోచనే లేదు.

సైనికులు రంగరాయలను అతని భార్యను బిడ్డలను సొరంగంగుండా బయటకు తీసుకు వస్తున్నారు. పైనుంచి రాలుతున్న దుమ్ముతో వారికి ఊపిరిసలపక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అంతేకాకుండా మట్టిపెళ్ళలు రాలపడంవల్లకూడా శరీరానికి దెబ్బలుతగిలి ఆయాసం కలుగుతోంది. అట్లాగే అవస్థపడుతూ ఆ కుటుంబం, సైనికసమేతంగా, సొరంగం కనుచూపు మేరవరకూ పాకుతూ వచ్చారు. మనుష్యులఉచ్ఛ్వాసనిశ్వాసాలు తప్ప వేరేశబ్దం యేమీ వినరావడంలేదు. ఇంతలో పైనుంచి మట్టిగడ్డ పెద్దదొకటి విరిగి పడింది—దానివెనుకనే మరొకటి! అందుమీద ఒకమనుష్యుడుకూడా సొరంగంలోనికి దూకాడు. కోటను కాపలా కాస్తున్నవాడు మట్టిపెళ్ళక్రిందికి కూరుకు పోవడంతో, దురదృష్టవశాత్తూ తనుకూడా సొరంగంలోనికి కూరుకుని పడ్డాడు. అతడి చేతులో కాలుతున్న కంచుకాగడాకూడా వుంది. పడినవాడు చాల హడావిడి చేశాడు. కోటలోనుంచి చాలమంది జనం అక్కడకు పోగయ్యారు. జగ్గరాజుకూడా వచ్చాడు అల్లరి ఆగాక, రంగరాయలను జగ్గరాజు ఎదుట నిలుచోబెట్టారు. రంగరాయలు ఆయాసంతో ప్రయాణప్రయాసతో చాల డస్సివున్నాడు. మోకాళ్ళు మోచేతులు నెత్తురు చిమ్ముతున్నాయి. ఒళ్ళంతా మట్టి పులుముకుపోయింది. జగ్గరాజు ఇదంతా విశదంగా పరికించి చాలాగాభరాపడ్డాడు. ఈసారి రంగరాయలను ఒక జైలుగదిలోను, అతనికుటుంబాన్ని మరొక జైలుగదిలోను వుంచాడు. వాళ్ళనువిడిపించే ప్రయత్నంలో వచ్చిన సైనికులను నిర్దాక్షిణ్యంగా నరికేయించాడు.

పెద్దపెట్టున జరిగిన యీ ప్రయత్నం కూడా విచ్చిపోయింది. అయినా యాచమనాయుడు దిగులు పడలేదు. తరువాతకూడా ఎన్నో మారు పాయాలు తన్ని ప్రయత్నాలు సాగించాడు కాని ఒక్కటి సఫల్యంగా అంతం అయినది కాదు. కనుక యుద్ధంచేసిమాత్రమే చంద్రగిరికోట స్వాధీనము చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చాడు. ఈ తత్క్షణంనుంచి తనసేనను విపరీత స్థాయిలో మిక్కుటం చేయసాగాడు. జగ్గరాజుకు ఈ వర్తమానం ఎలానో తెలిసింది. తనతమ్ముడు ఓబలరాజును పిలిచి సమాలోచనలు జరిపాడు ఓబలరాజు మనుషులను హత మార్చడంలో తనకు తనే సాటి. అతడికి పరాయివాళ్ళ ప్రాణాలతో ఆటలాడటం మహా వేడుక. అతడు చెప్పిన ఉపాయం ఏమిటంటే, రంగరాయలు బ్రతికున్నంతవరకూ యాచమనాయుడు అతగాడినే తిరిగి సింహాసనం ఎక్కించడానికి ప్రయత్నం చేస్తూవుంటాడు. కనుక, రంగరాయలునే పరలోకానికి పంపితే ఈచిక్కులన్నీ మంచులా విడిపోతాయని.

జగ్గరాజు సరేనన్నాడు. ఆ కార్యపని కూడా నీచేతిమీదుగా కానీయమని తమ్ముడిని కోరాడు. ఓబలరాజుకు అంతకంటే

★ చరితార్థుడు ★

కావలసిందేముంది!- వెంటనే రంగరాయలును ఉంచిన జైలుగదికి వెళ్ళి తను వచ్చిన పని తెలిపాడు.

రంగరాయలు ఎన్నాళ్ళనుంచో ఈ క్షణానికే కాచుకుని ఉన్నాడు. కాని అతడికి ఆఖరుసారిగా తనభార్యను, సంతానాన్ని చూడాలని మనసు కలిగింది. పైకి చెప్పాడు.

రంగరాయలును సతీసుతులు బంధించబడ్డ గదికి తీసుకువెళ్ళారు. సతీపతులు క్షణ మాత్రం కనుసైగలు చేసుకున్నారు. చివరిసారిగా చూచుకున్నారు. రంగరాయలు, మొలలో వేలాడుతున్న కత్తి పైకెత్తి భార్య గుండెల్లో పొడిచాడు. ఆపైన ఇద్దరు మగపిల్లలను, ఒక ఆడపిల్లను కూడా హతమార్చాడు. ఇంక మిగిలింది కడగొట్టు అమ్మాయి.

ఈ అమ్మాయే రంగరాయలుకు ప్రాణప్రదం; ఎక్కువ ప్రేమ. అతడా పనికందును హతమార్చలేక, కత్తి వెనక్కు మరల్చి తన గుండెల్లో పొడుచుకున్నాడు. పక్కనే వున్న ఓబలరాజు వికటాట్టహాసం చేస్తూ, రాచపురుగంటూ ఏమీ మిగలకూడదని, ఆ పసికందు పీకకూడా నులిమివేశాడు. ఇక యాచమనాయనిదగ్గఱ రహస్యంగా పెరుగుతూన్న రెండవ కుమారుడు తప్ప, రంగరాయల వంశమంతా అంతరించింది!

ఈవృత్తాంతం యాచమనాయనికి చేరింది. అతడు కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఆక్రోశం పట్టలేక 'రంగరాయలు రెండవ కుమారుడు నాదగ్గర పెరుగుతున్నాడు. రాజవంశం క్షయంకాలేదు. ఈ కుర్రవాడికి పట్టాభిషేకం చేసేంతవరకూ నేను విశ్రమించను' అని ప్రకటించాడు.

ఈప్రకటన జగ్గరాజును మరింత ఆశ్చర్యపరిచింది. తాను క్షయమయిపోయిందనుకున్న రంగరాయని కుటుంబం ఇంకా నిశ్శేషం కాలేదని తెలియగానే, అతిగాడు నిప్పుతొక్కిన కోతిలా గంతులు వేయసాగాడు. పూర్వమార్గంగా యాచమనాయనికి మళ్ళీ సంధిప్రస్తావన పంపాడు అందుకు నాయడు మామూలు జవాబే చెప్పాడు.

* * *

ఈకథనంతటినీ తంజావూరురాజ్యం పరిపాలిస్తున్న రఘునాథరాయలు విన్నాడు. యాచమనాయని అకుంఠిత భక్తివిశ్వాసాలకు ఆయన హృదయం పులకితమయింది. యాచమనాయనికి అండగా నిలచి న్యాయం నిలబెట్టాలని ఆయన దీక్షవహించాడు. ఏభైవేల సైన్యంతో యాచమనాయడు చంద్రగిరికోటను ముట్టడించాడు. రెండు దీర్ఘ సంవత్సరాలపాటు ముట్టడిసాగింది జగ్గరాజు చివరిసారిగా సంధిప్రయత్నం చేశాడు కాని యాచమనాయడు ఆమాటలయినా దగ్గరకు రానీయలేదు. తన బలమంతా ఉడిగిపోయిన మీదట, ఇంకచేసేదేమీ లేక ప్రాణాలయినా దక్కించుకుందామన్నట్లుగా జగ్గరాజు కోటవదలి పారిపోయాడు. యాచమనాయడు చంద్రగిరికోట స్వాధీనం చేసుకున్నాడు. అపనమ్మకపు మంత్రులను, సైనికులను, ఇతర ఉద్యోగులను మార్చివేశాడు. త్వరలోనే సామంతరాజుల సభ ఏర్పాటుచేశాడు. అందరి సమక్షంలో రంగరాయని రెండవ పుత్రుడు రామరాయలును పట్టాభిషిక్తుడిని చేశాడు.

యాచమనాయని ధైర్యసాహసములకు, అచంచల స్వామిభక్తి ప్రవృత్తులకు, కార్యదీక్షకు తోటి సామంతరాజులు, సర్దారులే కాక, చంద్రగిరి రాజ్యప్రజలందరూ ఎంతో సంతోషపడ్డారు. వేయినోళ్ళ అతడి కథనాన్ని వినుతించారు. రాజ్యానికి అతడే అమాత్యుడుగా ఉండాలని కోరారు. కాని ఆ స్వామిభక్తిపరాయణుడు ఎల్లరకునమస్కరించి ప్రతిఫలాపేక్షతో కాక, తనకర్తవ్య నిర్వహణగా భావించి తానీకార్యం నెరవేర్చినటు, ఇందులో ఎవరూ తనను విపరీతంగా పొగడవలసింది లేదనీ, తన రాజు క్షేమమే తనకు కావలసింది కాని మరొకటి కాదనిచెప్పి సెలవుతీసుకుని తన పట్టణానికి మరలాడు.

సామంతరాజు లందరూ యాచమనాయని ప్రభుభక్తిని వేయినోళ్ళ కీర్తించారు. తాము పూర్వం అనుసరించిన కుమార్గం నుంచి తప్పించినందుకు అతడికెంతో కృతజ్ఞత వెల్లడించారు.

యాచమనాయనికి మాత్రం ఇవేవీ పట్టలేదు. అతడికి ఇతరం ఏమీ తెలియదు: తాను ప్రభుభక్తిపరాయణుడు. ఆపదలో నున్న రాజును రక్షించటం తన కర్తవ్యంగా భావించుకొని పనిచేశాడు. రాజద్రోహిని దేశంనుంచి పారద్రోలి న్యాయమైనవానినే పట్టాభిషిక్తుడిని చేశేంతవరకు విసుగు విరామం లేకుండా తిరిగాడు. తనకు అదే పదివేలు! తన జన్మకదే చరితార్థత! ★

తూర్పు పడమరలు

న్యాయమూర్తి: అయితే, పాతిక రూపాయలకే కక్కుర్తిపడి నిండుప్రాణం తీయడానికి వడిగట్టావన్నమాట!

దొంగ: బాగుందండి. వెధవ పాతిక అని అలా కొట్టిపారేస్తే ఎలాగండి. అక్కడో పాతికా, ఇక్కడో పరకా అలా అలా పోగడితేనే వందలూ వేలూ ఒరిగేదండి.

మేము మీ అదృష్టం చెప్పగలము



నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదీన్ని, నీ సరియైన చర్య గురించీన్ని నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టు కార్డు పైన నీ కిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తెద, వేళ వివరములున్నూ, నీసరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయముకలుగును. నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము. తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభం మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపుట చేయడమగును. వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన జోస్యం నీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.


Shree Swami Satyanarain Jyotish Ashram (W. P. A.), NAKODAR (Pb.)

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



సారిడన్

ఉపయోగించి నొప్పిని తరిమివేయండి




తలనొప్పి, పంటినొప్పి, వీపునొప్పి, కండరముల నొప్పి మరియు మామూలు అస్వస్థల నుండి తక్షణము ఉపశమనము పొందుటకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సారిడన్ వాడండి. అది ఈ క్రింద తెలియచేసిన మూడు విధములుగ పనిచేస్తుంది:

నొప్పిని పోగొట్టును : సారిడన్, అన్ని రకముల నొప్పుల నుండి దాదాపు తక్షణము మీకు ఉపశమనము చేకూర్చును. అది కడుపుకు అస్వస్థత లేక మీకు ఏ విధమైన అలసట నిరుత్సాహములు కాని కలుగచేయదు!

విశ్రాంతి నిచ్చును : సారిడన్, నొప్పివలన కలిగే బిగించబడిన నరముల అనుభవమునుండి ఉపశమనము చేకూర్చి, మీరు హాయిగా ఉల్లాసముగా ఉండేలా చేయును.

ప్రోత్సాహము చేకూర్చును : సారిడన్‌లోగల తేలికగా ఉత్తేజ పరచే గుణము విపరీతమైన బాధ మరియు నిద్ర లేకపోవుటచే కలిగే శారీరకమైన మరియు మానసికమైన అలసటను పోగొట్టుటలో సహకరించును, కొన్ని నిమిషాల్లోనే మీరు శక్తి ఉత్సాహములు పొందేలా చేయును!

సారిడన్ అంతలా గుణము కలిగించుటకు కారణము దానిలో ఉన్న పదార్థముల ఏకమై పని చేయుటయే. అవి ఒకదాని మీద ఒకటి పనిచేసి వాటి ఒంటరిగా పనిచేసే సామర్థ్యమును అధికము చేసుకుంటాయి. సారిడన్‌లో మత్తు మందులు లేవని జ్ఞాపకముంచుకోండి.



* ఒక బిళ్ల 2 అణాలు
* ప్రతి బిళ్ల ఒక పూర్తి మోతాదు
* దానిలో ఆస్పిరిన్ (అసిటిల్-సలిసిలిక్ ఆసిడ్) చేర్చబడలేదు

సారిడన్ ఉపయోగించి దాని గుణములను మీకు మీరే నిర్ధారణ చేసుకోండి!

VT. 3305